

తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక

SAPTHAGIRI (TELUGU)
SPIRITUAL ILLUSTRATED MONTHLY
Volume:56, Issue: 06
November - 2025, Price Rs.20/-.

నవంబరు 2025
వెల రూ. 20/-
పుటలు - 56

తిరుచానూరు
శ్రీపద్మావతీ అమ్మవారి
పంచమీతీర్థం
(25-11-2025)







2025 సెప్టెంబర్ 24న తిరుమల సాలకట్ల బ్రహ్మోత్సవాల పెద్దశేషవాహనంలో పాల్గొన్న భారత ఉపరాష్ట్రపతి గౌ॥ శ్రీ సి.పి.రాధాకృష్ణన్‌గారు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు మాన్యశ్రీ నారా చంద్రబాబునాయుడుగారు,

2025 సెప్టెంబర్ 25న తిరుమల శ్రీవారి దర్శనానంతరం భారత ఉపరాష్ట్రపతి గౌ॥ శ్రీ సి.పి.రాధాకృష్ణన్‌గారికి స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు మాన్యశ్రీ నారా చంద్రబాబునాయుడుగారు, తి.తి.దే. ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ బి.ఆర్.నాయుడుగారు తి.తి.దే. కార్య నిర్వహణాధికారి శ్రీ అనిల్‌కుమార్ సింఘాల్, ఐ.ఏ.ఎస్., గారు















2025 సెప్టెంబర్ 24న తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రముఖ్యమంత్రివర్యులు మాన్యశ్రీ నారా చంద్రబాబు నాయుడుగారు. వారికి శ్రీవారి ప్రసాదాలను, చిత్రపటాన్ని అందజేస్తున్న తిరుమల తిరుపతి దేవస్థానముల ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ బి.ఆర్.నాయుడు, తిరుమల తిరుపతి దేవస్థానముల కార్యనిర్వహణాధికారి శ్రీ అనిల్ కుమార్ సింఘాల్, ఐ.ఏ.ఎస్., గారలు. అనంతరం ముఖ్యమంత్రివర్యులు తిరుమల తిరుపతి దేవస్థానముల 2026 క్యాలెండరు, డైరీలను ఆవిష్కరిస్తున్న దృశ్యం.



# గీతాశ్లోకార్థసారం

**శ్లో : అకీర్తిం చాపి భూతాని కథయిష్యంతి తేఽవ్యయామ్ ।
సంభావితస్య చాకీర్తిః మరణాదతిరిచ్యతే ॥**

(శ్రీమద్భగవద్గీత 02వ అధ్యాయం-34వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** చ= మఱియు; భూతాని= సమస్తజనులు; తే= నీ యొక్క; అవ్యయామ్= కలకాలము నిలిచియుండు; అకీర్తిమ్, అపి= అపకీర్తిని గూర్చియు; కథయిష్యంతి= చెప్పికొందురు; చ= మఱియు; సంభావితస్య= మాన్యుడైనవానికి; అకీర్తిః= అపకీర్తి; మరణాత్= మృత్యువుకంటెను; అతిరిచ్యతే= అధిక (బాధాకర)మైనది.

**భావం:** లోకులెల్లరును బహుకాలమువఱకును నీ అపకీర్తిని గూర్చి చిలువలు పలువలుగా చెప్పికొందురు. మాన్యుడైన పురుషునకు అపకీర్తి మరణముకంటెను బాధాకరమైనది.



## పాలజలధిఁ బుట్టిన పద్మాలయ

గరుడాద్రి వేదాద్రి కలిమి యీపె
సిరులొసఁగీఁ జూడరో చింతామణి యీపె

పాలజలధిఁ బుట్టిన పద్మాలయ యీపె
లాలిత శ్రీనరసింహలక్ష్మి యీపె
మేలిమి లోకమాతయై మించిన మగువ యీపె
యీలీల లోకములేలే యిందిర యీపె

ఘనసంపదలొసఁగు కమలాకాంత యీపె
మనసిజుఁ గనిన రమాసతి యీపె
అనిశముఁ బాయనిమహాహరిప్రియ యీపె
ధనధాన్యరూపపుశ్రీ తరుణి యీపె

రచ్చలవెలసినట్టి రమావనిత యీపె
మచ్చికగల యలమేల్మంగ యీపె
యిచ్చట వేంకటాద్రి నీ యహోబలమునందు
నిచ్చలూఁ దావుకొనిననిధాన మీపె

అధ్యాత్మసంకీర్తన సంపుటం 4 - 522

ఈమె పాలసముద్రంలో పుట్టిన శ్రీమహాలక్ష్మి. నరసింహస్వామిని అనుసరించి యుండే పరమసాధ్వి. పదునాల్గు లోకాలను కాపాడే ఇందిర ఈమెయే. అన్నిలోకాలకూ ఈమెయే జనని. అధికసంపద లిచ్చే కమలాంబ ఈమెయే. ఈమెయే మన్మథుని కన్నతల్లి. ఎప్పడూ భర్తను ఎడబాయని అభిమానవంతురాలు ఈమె. ధనలక్ష్మి, ధాన్యలక్ష్మి అనే రూపాలతో విలసిల్లేది; సభలలో, గోష్ఠులలో, కలహాలలో వెలసేది ఈమే. భర్త పై ఆశ గల అలమేలుమంగ ఈమెయే. వేంకటాద్రిలో, అహోబలంలో నివసిస్తూ భక్తులపాలిటి పెన్నిధిగా ఉండేది ఈ మహాలక్ష్మీదేవియే.

(వ్యాఖ్యాత- కీ॥శే॥ శ్రీమాన్ ముదివర్తి కొండమాచార్యులు)







తిరుమల తిరుపతి దేవస్థానములు

# శ్రీపద్మావతీఅమ్మవారి బ్రహ్మోత్సవాలు

## తిరుచానూరు

| తేదీలు | వారం | పగలు ఉత్సవం | రాత్రి ఉత్సవం |
|---|---|---|---|
| 16-11-2025 | ఆది | లక్షకుంకుమార్చన | సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణం |
| 17-11-2025 | సోమ | తిరుచ్చి ఉత్సవం, ధ్వజారోహణం | చిన్నశేషవాహనం |
| 18-11-2025 | మంగళ | పెద్దశేషవాహనం | హంసవాహనం |
| 19-11-2025 | బుధ | ముత్యపుపందిరివాహనం | సింహవాహనం |
| 20-11-2025 | గురు | కల్పవృక్షవాహనం | హనుమద్వాహనం |
| 21-11-2025 | శుక్ర | పల్లకీ ఉత్సవం, సా॥వసంతోత్సవం | గజవాహనం |
| 22-11-2025 | శని | సర్వభూపాలవాహనం స్వర్ణ రథోత్సవం | గరుడవాహనం |
| 23-11-2025 | ఆది | సూర్యప్రభవాహనం | చంద్రప్రభవాహనం |
| 24-11-2025 | సోమ | రథోత్సవం | అశ్వవాహనం |
| 25-11-2025 | మంగళ | పల్లకీ తిరుచ్చి ఉత్సవం, తీర్థవారి అవభృథం, చక్రస్నానం, పంచమీతీర్థం | తిరుచ్చి ఉత్సవం, ధ్వజావరోహణం |



తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 56 నవంబరు, 2025 సంచిక : 06



**వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన।**
**వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి ॥**

**గౌరవ సంపాదకులు**
శ్రీ అనిల్‌కుమార్ సింఘాల్, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

**ప్రచురణకర్త-సంపాదకులు,**
**ప్రధాన సంపాదకులు** (ఎఫ్.ఏ.సి.)
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

**ఉప సంపాదకురాలు**
డా॥ అల్లాడి సంధ్య, ఎం.ఏ.తెలుగు, ఎం.ఏ.సంస్కృతం, ఎం.ఫిల్., పిహెచ్.డి., పి.జి.డిప్లొమా ఇన్ జర్నలిజం

**ముద్రాపకులు**
శ్రీ ఆర్.వి.విజయకుమార్, బి.ఏ., బి.ఎడ్.,
ఉపకార్యనిర్వహణాధికారి, (పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం), తి.తి.దే., తిరుపతి.

**ఫోటోలు**
శ్రీ పి.ఎన్.శేఖర్, చీఫ్ ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు
ప్రధానసంపాదకులు-0877-2264363
కార్యాలయం -0877 -2264543
0877 -2264359

విడి ప్రతి : రూ. 20/-
సంవత్సర చందా : రూ. 240/-
జీవితచందా (12 సం॥లకు) : రూ. 2400/-
విదేశాలకు సం॥చందా : రూ. 1030/-

వెబ్‌సైట్- ttdevasthanams.ap.gov.in;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు-
chiefeditortpt@gmail.com;
ద్వారా తెలియజేయవచ్చు.

24 గంటలూ పనిచేసే ఈ క్రింది తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్‌నెంబర్లకి ఫోన్ చేసి తి.తి.దే.కి సంబంధించిన సమస్తసమాచారాన్ని మీరు తెలుసుకోవచ్చు.
0877 2277777 / 2233333

## ఈ నెలలో....

| | | |
|---|---|---|
| మెరిసిపోతూ మురిసిపోతున్న శ్రీ అలమేలుమంగమ్మ!! | శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం | 07 |
| వ్యక్తి సంస్కారానికి ప్రతీక 'వాక్కు' | బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ | 12 |
| శ్రీవేంకటాచల మాహాత్మ్యం (వచనం) | ఆచార్య కె.సర్వోత్తమరావు | 13 |
| సందేహాలు-సమాధానాలు | డా॥ రేవూరు అనంతపద్మనాభరావు | 14 |
| గజ పరివేష్టిత మహాలక్ష్మి | ఆచార్య కాదంబిని | 15 |
| ధన్వంతరి నమోస్తు తే | లింగారెడ్డి ఉమామహేశ్వరి | 16 |
| తిరుమల సమయాచారములు | కీ.శే. డా॥ఎన్.సి.వి.నరసింహాచార్యులు<br>కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు | 18 |
| స్త్రీ వైశిష్ట్యం | 'వాచస్పతి' బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు | 19 |
| 'సుగుణఖని' పేయాళ్వార్ | శ్రీ వైద్యం వేంకటేశ్వరాచార్యులు | 20 |
| సర్వపుణ్యముల ఫలం- కార్తిక పున్నమి | శ్రీమతి పి.రమాదేవి | 22 |
| గురుశిష్య సంబంధం | విశ్వనాథ రమ | 24 |
| తిరుక్కుళందై (108 దివ్యదేశాలు) | ఆచార్య చక్రవర్తి రంగనాథన్ | 25 |
| కైశికద్వాదశి (క్షీరాబ్ధి ద్వాదశి) | డా॥ లంక వేంకట సుబ్రహ్మణ్యేశ్వర శర్మ | 31 |
| మేల్నాడు- రామానుజుల అడుగుజాడలు | ఆంగ్లమూలం- శ్రీలక్ష్మీనరసింహన్ శ్రీధర్<br>తెలుగు - శ్రీదేవీ మురళీధర్ | 34 |
| కణ్వమహర్షి | సద్గురు డా॥ కె.శివానందమూర్తి | 35 |
| వేదజ్ఞానం | శ్రీ కర్లపాలెం హనుమంతరావు | 36 |
| ఆచార్యుడు చూపే మార్గం | శ్రీ సురేశ్ కుమార్ రెడ్డి | 37 |
| వడ్డికాసులవాడు | శ్రీ వాసగరి రామచంద్రుడు | 39 |
| కరుణాకరా! కళాధరా! | శ్రీ జంధ్యాల శరత్‌బాబు | 40 |
| శ్రీ పళ్ళికొండేశ్వరస్వామి ఆలయం - సురుటుపల్లి | డా॥ ఐ.ఎల్.ఎన్.చంద్రశేఖర రావు | 43 |
| సంవాదం - సందేశం | శ్రీ మదన్ రావు జోషి | 45 |
| ఇహపరాలను తెలుసుకో! | డా॥ కేశవరావు | 46 |
| బుద్ధిహీనుడిని సేవించరాదు (వేమన శతకం) | కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు | 47 |
| దుర్జనుల దగ్గరికి పోరాదు (భాస్కర శతకం) | డా॥తిరుమల శ్రీనివాసాచార్య | 47 |
| సువర్ణ వర్షం (చిత్రకథ) | కథ: శ్రీ డి.శ్రీనివాసదీక్షితులు<br>చిత్రాలు: శ్రీ ద్వారకనాథ్ | 48 |
| సంస్కృతం నేర్చుకుందాం..!! | రచన-కీ.శే.మహామహోపాధ్యాయ కె.కృష్ణాచార్య | 50 |
| క్విజ్ | | 51 |
| బాలవినోదం | | 52 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి | 53 |
| శ్రీపదకేళి | శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు | 54 |

ముఖచిత్రం : తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారి పంచమీతీర్థం
వెనుకచిత్రం: తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారి పుష్పయాగం



ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

సంపాదకీయం

# జగన్మాతా! వందనమ్!!

**"పద్మాలంకృత పాణిపల్లవయుగాం పద్మాసనస్థాం శ్రియమ్।
వాత్సల్యాది గుణోజ్జ్వలాం భగవతీం వందే జగన్మాతరమ్॥"**

ఈ జగత్తు ఐశ్వర్యమయం. సిరిసంపదలతో ఉన్న దివ్యత్వాన్ని లక్ష్మీదేవతాకృతిగా దర్శించారు మహర్షులు. జగత్కారణుడైన ఈశ్వరుని శక్తే **'లక్ష్మి'**. మహాలక్ష్మి అనగానే కేవలం ధనరూపిణియే కాదు. శుద్ధసత్త్వస్వరూపిణి. శుభంకరమైన గుణాలకు సాకారం.

ఈ తల్లికి **'పద్మ'** అనే పేరున్నది. వికసించే లక్షణమే పద్మం. పద్మం వికసించిన 'జ్ఞానానికి', 'ఐశ్వర్యాని'కి గుర్తు. విష్ణుని హృదయపద్మంలో లక్ష్మీదేవి ఉందని మన శాస్త్రాలు చెబుతున్నాయి. అంటే దీని అర్థం– 'శ్రీమహావిష్ణు సంకల్పశక్తే ఐశ్వర్యంగా వ్యాపించినది' అని.

అమ్మలగన్నయమ్మ **శ్రీపద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలు** కార్తికమాసంలో రావడం పరిపాటి. సామాన్యంగా మన పురాణవాఙ్మయంలో పన్నెండు మాసాలకి ప్రత్యేక మహిమలు చాటించే చిన్న పురాణాల్లో ప్రసిద్ధమైనది– **'కార్తికపురాణం', 'మాఘపురాణం'**లాంటివి. అటువంటి కార్తికంలో జరిగే అమ్మవారి బ్రహ్మోత్సవాలు జగజ్జేగీయమానంగా జరుగుతాయి. అమ్మవారికి జరిగే వివిధ వాహనసేవల్లో ముఖ్యమైనది **'గజవాహనం'**. గజం స్థిరత్వానికి, ఆధ్యాత్మిక బలానికి సంకేతం. అమ్మవారు గజవాహనంపై విహరించడం ద్వారా భక్తులకు అచంచల భక్తి, ధైర్యం ప్రసాదమవుతాయి.

కార్తికశుద్ధపంచమినాడు జగన్మాత శ్రీఅలమేలుమంగమ్మ పుట్టినరోజు. అంటే ఆ తల్లి అవతరించిన రోజు. ఆ రోజు తిరుమల శ్రీవారి నుండి అమ్మ పుట్టినరోజు కానుకగా– చీరలు, రవికలు, చందనం, పసుపుకుంకుమలు, తులసి, ప్రసాదాలు సారెగా వస్తుంది. ఆనాడే అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో జరిగే అతి ప్రధానఘట్టం **'పంచమీతీర్థం'**. ఇది పద్మసరోవరంలో జరిగే విశేషకార్యక్రమం. సరోవర తీరాన అమ్మవారికి, చక్రత్తాళ్వారుకు తిరుమంజనం నిర్వహించి, పద్మపుష్కరిణిలో సుదర్శన భగవానునికి 'చక్రస్నానం' అర్చకులు గావిస్తారు. ఇది అమ్మవారి బ్రహ్మోత్సవాల కళాశోభగా భావించబడుతుంది. దీన్ని తిలకించడానికి లక్షలాదిమంది భక్తులు హాజరై, తీర్థస్నానం చేసి అమ్మవారి కృపకు పాత్రులవుతారు.

కార్తికం అంటేనే హరిహరాదులకు ప్రీతికరం. వీరిలో హరునకు తిరుపతి కపిలేశ్వరాలయంలో స్వామివారి సన్నిధిన జరిగే 'అన్నాభిషేకం' విశేషం. చూచి తరించవలసిందే! అట్లే కపిలేశ్వరునికి జరిగే 'లక్షబిల్వార్చన' అత్యంత నయనానందకరం. ఇక శివపుత్రుడైన కుమారస్వామికి జరిగే 'స్కంద షష్ఠ్యుత్సవం' కూడా వీక్షిస్తే అత్యంత పుణ్యప్రదం.

ఇవేకాక తిరుమల శ్రీవారి సన్నిధిన జరుపబడే **'కైశికద్వాదశి'** విశేషమైనది. ఈ సందర్భంగా శ్రీవారి ఉత్సవమూర్తుల్లో ఒకరైన **'ఉగ్రశ్రీనివాసమూర్తి'**ని సూర్యోదయానికి ముందే తిరుమల మాడ వీధుల్లో ఊరేగించి తిరిగి స్వామి సన్నిధిలో వేంచేపు చేయడం ప్రత్యేకం. మరియు శ్రీవారి సన్నిధిలో 'కార్తికపౌర్ణమి'న జరిగే **దీపోత్సవం, జ్వాలాతోరణం** ముక్తిప్రదాయకమైనవి.

ఈ నెలలోనే తిరుమల తిరుపతి దేవస్థానముల ఆలయాలైన నారాయణవనం శ్రీకల్యాణ వేంకటేశ్వరాలయంలో జరిగే తెప్పోత్సవం, నగరి శ్రీకరియమాణిక్యస్వామివారి పవిత్రోత్సవం, నాగులాపురం శ్రీవేదనారాయణస్వామివారి పవిత్రోత్సవం, శ్రీపద్మావతీ అమ్మవారికి జరిగే పుష్పయాగ మహోత్సవంవంటి ఉత్సవాలలో పాల్గొందాం. శ్రీనివాసుని కృపకు పాత్రులౌదాం!!

*"ఓం నమో వేంకటేశాయ."*

నవంబరు 16 నుండి తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా...



# మెరిసిపోతూ.. మురిసిపోతున్న... శ్రీఅలమేలుమంగమ్మ!!

- శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, 99856 70152

ప్రతి ఏటా సౌరమానం (వృశ్చికమాసం) ప్రకారం కార్తికశుద్ధ పంచమినాడు శ్రీఅలమేలుమంగమ్మకు పుట్టినరోజు పండుగ! అంటే ఆ తల్లి అవతరించిన రోజన్నమాట! ఆ రోజుకు ముందు నుండే అలమేలుమంగమ్మకు పుట్టినరోజు పండుగ (25-11-2025, మంగళవారం) సందర్భంగా పదినాళ్లపాటు ఘనంగా వేడుకలు ఉత్సవాలు ఊరేగింపులు నిర్వహింపబడతవి.

## అలమేలుమంగమ్మ అద్భుతదర్శనం!

ప్రతి సంవత్సరం పుట్టిన పండుగనాడు, తిరుచానూరులోని **"శాంతినిలయం"** అనే బంగారు మేడలో కొలువై ఉన్న అలమేలుమంగమ్మ వారి విశేషదర్శనం అపురూపం! అద్భుతం! దివ్యాతిదివ్యం! పరమానందదాయకం!!



ఆ ఒక్కరోజున మాత్రమే ప్రత్యేకమైన పెద్ద బంగారు పద్మంలో ఆసీనురాలైన అమ్మ, విశేషంగా బంగారు చీరను ధరించి వింత వింతలుగా ప్రకాశిస్తుంది. శిరస్సుపైన వజ్రాలు తాపిన బంగారు కిరీటం జిగేలుమని మెరుస్తూండగా, పై రెండు చేతుల్లో నవరత్నాలు పొదిగి ఉన్న పెద్ద తామర మొగ్గలను సుతారంగా పట్టుకొని సొంపుగా విరాజిల్లుతుంటుంది. అంతేనా! ఇంకా.. వజ్రవైడూర్యాలు తాపిన వరద, అభయహస్త కవచాలతోను, నొసటన వజ్రాలనామంతోను, వజ్రాల చెవిదుద్దులతోను, సంపెంగవంటి సొగసైన నాసికపైన ఎఱ్ఱటి కెంపుల ముక్కెరతోను, కరకంకణాలతోను, ఇలా.. ఒక్కటేమిటి! ఎన్నో ఎన్నెన్నో! అమూల్యమైన దివ్యాభరణాలను అలంకరించుకొన్న అలమేలుమంగమ్మ ఆనందనిలయునికి ధీటుగా సాటిగా దర్శనమిస్తూ, మెరిసిపోతూ, మురిసిపోతుంటుంది. భక్తులనందరినీ మైమరిపిస్తూ అఖండసచ్చిదానంద స్వరూపిణిగా దర్శనమిస్తూ, ఆధ్యాత్మిక లోకాల్లో విహరింపజేస్తుంది అమ్మ అలమేలుమంగమ్మ!

ఇలాగ తాను ఆవిర్భవించిన కార్తికశుక్ల పంచమినాడు రోజంతా ఎంతో ఓపికగా, ఓర్పుగా తనను దర్శించవచ్చిన భక్తులనందరినీ తన దివ్యరూప దర్శనంతో మైమరపిస్తూ, కడగంటి చూపులతో చల్లగా, నిండుగా, మెండుగా అనుగ్రహిస్తుంది అమ్మ అలమేలుమంగమ్మ.

ఇంతకూ, ఇంతగా కీర్తింపబడుతున్న అలమేలు మంగమ్మ ఎవరు? ఎక్కడ ఉంటుంది. ఆ యమ్మ పూర్వాపరాలు ఏమిటి? అంటే ఆ జగన్మాత సాక్షాత్తు తిరుమలేశుని తిరుచాన!

## తిరుమలేశుని తిరుచాన!

'తిరుచాన' అంటే **'శ్రీకాంత'** అని అర్థం. అందులోను ఆనందనిలయుని **'తిరుచాన'.** అంటే ఇల్లాలు. ఆవే శ్రీమహాలక్ష్మి! ఆ సిరుల తల్లిని **'అలమేలుమంగ'** అని కూడ కొందరంటారు. పుష్పంపైన ప్రకాశిస్తున్న శ్రీమహాలక్ష్మే అలమేలుమంగ! సహస్రదళాల బంగారుపద్మంలో అవతరించినందువల్ల ఆ జగన్మాతను **'పద్మావతి'** అని కూడ అంటారు.

తిరుమల ఆనందనిలయుని పట్టపురాణి అయిన ఈ తిరుచాన అర్చామూర్తిగా కొలువై ఉన్న దివ్యక్షేత్రం **తిరుచానూరు**. దీన్నే **'అలమేలుమంగపట్నం'** అంటారు.

తిరుపతికి ఆగ్నేయమూలలో 3-4 కిలోమీటర్ల దూరంలో వెలసి ఉన్న ఈ క్షేత్రానికి నిరంతరం ఆటోలు, బస్సులు తిరుగుతుంటాయి. తిరుపతి బస్టాండు నుంచి పట్టుమని పదినిమిషాల్లో ఇక్కడికి చేరుకోవచ్చు.

పూర్వం ఈ ప్రాంతంలో శ్రీశుకమహర్షి ఆశ్రమం ఉండేదట. అందువల్ల **'శ్రీశుకుని ఊరు'**గా పిలువబడింది. అదే **'తిరుశుకనూరు'** అనీ, **'తిరుచ్చుకనూరు'** అనీ పిలువబడుతూ

చివరకు 'తిరుచానూరు'గా మారిందని చారిత్రకుల మాట. తిరుచాన ఉన్న ఊరు కనుక 'తిరుచాన ఊరు'గా పిలువబడిందనీ, అదే 'తిరుచానూరు'గా అయ్యిందన్నది మరో కథనం!



ఈ ఊరు నడిబొడ్డున "పద్మ సరోవరం" అనే కోనేరు ఉంది. ఈ కోనేట్లోనే శ్రీమహాలక్ష్మి బంగారు పద్మంలో 'పద్మావతి'గా, 'అలమేలు మంగ'గా అవతరించింది.

అటు తిరుమలక్షేత్రం, ఇటు తిరుచానూరుక్షేత్రం ఇంచుమించు ఒకే కాలంలో వెలసిన దివ్యక్షేత్రాలే కాక అత్యంత మహిమగల క్షేత్రాలు కూడా.

శ్రీవైకుంఠం నుంచి భక్తులకోసమే భువికి దిగివచ్చిన స్వామి ఏడుకొండల వాడు. భృగుమహర్షి చేసిన లోకకల్యాణకారకమైన కార్యం వల్ల లక్ష్మీవిరహుడైన వేంకటేశ్వరుడు, భువిలో దీనుడై భక్తుల కోరికలను తీర్చలేక అనేక బాధలకు లోనయ్యాడు. అందువల్లే సిరిలేని శ్రీనివాసుడు, వైకుంఠంనుంచి అలిగి భూలోకానికి వచ్చిన శ్రీమహాలక్ష్మిని వెదుకుతూ కొల్హాపురం క్షేత్రానికి వెళ్లాడు. అక్కడ ఆమె అనుగ్రహం కోసం పదేండ్ల పాటు తపస్సు చేశాడు. మహాలక్ష్మి "ఇక్కడ నీకు దర్శనం ఇవ్వనుగాక ఇవ్వను" అని ఖండితంగా ఆకాశవాణి ద్వారా చెప్పుతూ పద్మసరోవర తీరాన నీ కోరిక నెరవేరుతుందని ఆనతిచ్చింది. శుకమహర్షి ఆశ్రమ ప్రాంతంలో పద్మసరోవరాన్ని ఏర్పరచి లక్ష్మీదేవి అనుగ్రహం కోసం పన్నెండేండ్ల పాటు తపస్సు చేశాడు వేంకటేశ్వరుడు.

ఒకానొక కార్తికమాసం శుద్ధపంచమీ శుక్రవారంనాడు అభిజిత్ లగ్నాన ఉత్తరాషాఢనక్షత్రంలో పదహారేళ్ల నవయువతిగా శ్రీమహాలక్ష్మి 'పద్మసరోవరం'లో సహస్రదళాల బంగారుపద్మంలో ఆవిర్భవించింది. సమస్తదేవతలు, ఋషులు, యోగులు ఆ జగన్మాతను అనేకవిధాలుగా స్తుతించారు, కీర్తించారు. 'పద్మావతి'గా, 'అలమేలుమంగ'గా అవతరించిన ఆ తల్లిని హృదయం మీద 'వ్యూహాలక్ష్మి'గా ఉంచుకొని ఏడుకొండలవాడు 'శ్రీనివాసుడి'గా పేరు పొందాడు. ఆ తర్వాత ఆ స్వామి తిరుమలకు పయనమయ్యాడు. ఆ సమయంలో బ్రహ్మాది దేవతలు ప్రార్థించారు. అప్పుడు ఆ జగన్మాత అర్చామూర్తిగా అక్కడే నిలిచి పూజలందుకోవడానికి అంగీకరించింది. అయితే, శ్రీస్వామివారు లేకుండా తానొక్కతే 'విరహాలక్ష్మి'గా, 'వీరలక్ష్మి'గా వెలసి స్వతంత్రంగా సేవలను స్వీకరిస్తానని, అందరి కోరికలు తీరుస్తానని వాగ్దానం చేస్తూ వరాలను ప్రసాదించింది.

## శుక్రవారపు తోటలో అభిషేకం

శ్రీపద్మావతి అమ్మవారి ఆలయానికి దక్షిణదిక్కున కేవలం వంద అడుగుల దూరంలో అందమైన ఉద్యానవనం ఉంది. ఇదే 'శుక్రవారపుతోట'. చక్కగా తీర్చిదిద్దిన పూలమొక్కలతో పాటు అరటిచెట్లు ఉన్న విశాలమైన ఈ పూలతోటలో 16 శిలాస్తంభాలతో నిర్మింపబడిన 'వసంత మండపం' ఉంది. ప్రతి శుక్రవారం మధ్యాహ్నవేళలో ఇక్కడికి వేంచేసిన అలమేలుమంగమ్మకు పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, చందనం, పసుపు మున్నగు ద్రవ్యాలతో తిరుమంజనం జరుగుతుంది. పిదప చక్కగా అలంకరింపబడిన అమ్మవారికి నివేదనలు జరిగిన తర్వాత ఊరేగింపుగా వచ్చి, గుడి ముందర ఉన్న వాహనమండపంలో జరిగే 'సహస్రదీపాలంకరణసేవ'లో భక్తులకు దర్శనమిస్తూ అనుగ్రహిస్తారు.



అందువల్ల తిరుచానూరు క్షేత్రంలో శ్రీపద్మావతి అమ్మవారిని ముందుగా దర్శించడం, ఆమెకు కోరికలను విన్నవించుకోవడం ఎంతో శ్రేయోదాయకమే కాక, యాత్రకూడ పూర్తిగా ఫలవంతమవుతుంది.

ఇక్కడ తిరుచానూరు క్షేత్రంలో అలమేలుమంగ నెమ్మదిగా కూర్చుని పద్మంపైన అభయ వరద హస్తాలతో దర్శనమిస్తున్నది. నింపాదిగా కూర్చున్న ఈ తల్లి భక్తుల ప్రార్థనలను, కోరికలను నిదానంగా ఓపికగా వింటుంది. తాను విన్న వాటి నన్నింటిని తిరుమలలో శ్రీవారి వక్షఃస్థలంలో **'వ్యూహలక్ష్మి'**గా ఉన్న ఆ జగన్మాత మరింత ఓపికగా ఓర్పుగా తన స్వామికి భక్తుల విన్నపాల్ని వినిపిస్తుంది. అంతటితో ఆగకుండా తన స్వామివారిని ఒత్తిడి చేస్తుంది. ఆమె సిఫారసుకు తలవొగ్గుతూ, భక్తుల కోరికలను దర్శనమాత్రం చేతనే తీరుస్తూ, **'వరాల రాయడని'** పెద్ద పేరునే పొంది ఉన్నాడు తిరుమలేశుడు.

అంతేగాదు, పూర్వం ఎప్పుడో, ఏనాడో అటు **'ఆనంద నిలయుడు'**, ఇటు 'అలమేలుమంగమ్మ' ఒకే ఎత్తులో ఉన్న కొండలపై ఉండేవారట. కాని స్వామివారికంటే కొంచెం ఎక్కువగా అమ్మవారికి ఉన్న **'దయ'** అనే కాసింత బరువువల్ల అలమేలుమంగమ్మ ఉన్న కొండ కాస్తా భూమిలోకి కుంగిందట. అందువల్లే స్వామివారు అంత ఎత్తులో ఏడుకొండలపైనా, అమ్మవారు ఇంత క్రింద తగ్గులోను ఉన్నారని పెద్దలమాట! నిజంగా ఎంతటి దయగల తల్లో గదా అలమేలుమంగమ్మ!

### అర్చనలు-ఆరాధనలు

ఈ జగన్మాతకు పాంచరాత్రాగమం ప్రకారంగా సుప్రభాతం, సహస్ర నామార్చన, శ్రీపద్మావతీపరిణయం, ఏకాంత సేవవంటి నిత్యోత్సవాలు; సోమవారం అష్టదళపాదపద్మారాధన, గురువారం తిరుప్పావడసేవ, శుక్రవారాభిషేకం, సహస్ర దీపాలంకరణసేవ, శనివారం పుష్పాంజలివంటి వారోత్సవాలు; వైశాఖమాసంలో పున్నమికి వసంతోత్సవాలు, జ్యేష్ఠమాసంలో తెప్పోత్సవాలు, భాద్రపదమాసంలో పవిత్రోత్సవాలు, కార్తిక మాసంలో లక్ష కుంకుమార్చన, బ్రహ్మోత్సవాలు, పుష్పయాగం వంటి వార్షికోత్సవాలు శ్రీపద్మావతి అమ్మవారికి ఘనంగా అంగరంగవైభవంగా నిర్వహింపబడుతున్నాయి.

### అలమేలుమంగమ్మకు.. ఆనందనిలయుడి కానుక!

**అలమేలుమంగమ్మ అవతరించిన 'పంచమి'నాడు ఆనందనిలయుడు తన ప్రియమైన పట్టపురాణికి పుట్టినరోజు సారెను బహుమతిగా పంపిస్తారు. 2 పట్టుచీరలు, 2 పట్టు రవికలు, 2 వజ్రాలు పొదిగిన బంగారు నగలు, పసుపు ముద్ద, చందనపు ముద్ద, శ్రీగంధపు కర్ర, పచ్చి పసుపు కొమ్ములతో ఉన్న పచ్చని పసుపుచెట్లు, పూలమాలలు, తులసీమాలలతో పాటు పిండివంటలు 51 పెద్దలడ్డులు, 51 వడలు, 51 అప్పాలు, 51 దోసెలు కూడ పంపబడతవి.**

**వీటన్నింటిని ముందుగా తిరుమలలో ఆనందనిలయునికి సమర్పింపబడిన తర్వాత, దేవస్థానం అధికారులు, పరిచారకులు కాలి నడకన బయలుదేరి అలిపిరికి దగ్గరలో ఉన్న 'పసుపుమండపం' చేరుకుంటారు. మళ్లీ అక్కడినుంచి ఏనుగు అంబారీపైన పెట్టుకొని, మేళతాళాలతో తిరుపతిలోని శ్రీకోదండరామాలయం, శ్రీగోవిందరాజస్వామి ఆలయాల మీదుగా తిరుచానూరు చేరుకుంటారు. అక్కడ శ్రీపద్మావతిఅమ్మవారి ఆలయం అర్చకులు అధికారులు "ఆనంద నిలయుడు పంపిన సారెకు" దివ్యమంగళ నీరాజనాలతో స్వాగతం ఇస్తారు. పిదప తిరుచానూరు పురవీథుల్లో ఊరేగింపుగా వెళ్ళి అమ్మవారికి సమర్పిస్తారు. వాటితో శ్రీఅలమేలుమంగమ్మకు, శ్రీసుదర్శన చక్రత్తాళ్వారుకు పద్మసరోవర మండపంలో తిరుమంజనాదులు ఘనంగా నిర్వహించిన తర్వాత, సరిగ్గా ముహూర్తవేళలో శ్రీసుదర్శన భగవానునికి సరస్సులో చక్రస్నానం నిర్వహిస్తారు. ఆ చక్రంతో పాటు వేలాది మంది భక్తులు పవిత్రస్నానాలు చేస్తారు.**






### ఆదిత్యుణ్ణి ప్రతిష్ఠించిన ఆనందనిలయుడు...



పద్మసరోవరానికి తూర్పుగట్టున పశ్చిమాభిముఖంగా శ్రీసూర్యదేవుని ఆలయం ఉంది. ఈ ఆదిత్యుణ్ణి సాక్షాత్తు ఆనందనిలయుడు ప్రతిష్ఠించి అక్కడే శ్రీమహాలక్ష్మికోసం 12 ఏండ్లపాటు తపస్సు చేశాడు. ఆ సరస్సులోనే బంగారుపద్మంలో అలమేలుమంగమ్మ ఆవిర్భవించింది. ఆనాటి నుంచి తిరుచానూరు 'భాస్కరక్షేత్రం'గా ప్రసిద్ధికెక్కింది.

ఈ సూర్యదేవాలయం అనేకమార్లు పునరుద్ధరింపబడింది. మళ్లీ 1866 ఏప్రిల్ 23న హాథీంరాజీమఠంవారు జీర్ణోద్ధరణ చేశారు. ఈ ఆలయంలో మాత్రం వైఖానసాగమం ప్రకారం నిత్యపూజలు జరుగుతాయి. ప్రతి ఆదివారంనాడు, హస్తానక్షత్రంనాడు, 'రథసప్తమి' నాడు శ్రీసూర్యనారాయణస్వామివారికి అభిషేకానంతరం, గ్రామోత్సవం జరుగుతుంది.

## బ్రహ్మోత్సవాలు

ప్రతి ఏడాది సూర్యమానం ప్రకారం కార్తికమాసంలో శుద్ధపంచమి నాడు పద్మావతి అమ్మవారి అవతార దినోత్సవం సందర్భంగా పదిరోజుల ముందు నుండే తిరుచానూరు క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. అంకురార్పణతో ప్రారంభమైన ఈ ఉత్సవాలు 'పంచమీతీర్థం' అనే చక్రస్నానంతో పరిసమాప్తమౌతాయి.

## పూట పూట ఉత్సవాలు

ఇవి ప్రారంభమైన నాటినుండీ ప్రతిరోజూ రెండు పూటలా వివిధ వాహనాల్లో అమ్మవారి ఊరేగింపులు జరుగుతాయి. 'నాగదోషనివారణిగా, సంతానప్రదాత'గా చినశేష, పెదశేషవాహనాల్లోను, 'విద్యాలక్ష్మి'గా హంస వాహనంపైన, సంపదలను కురిపించే 'సంపత్‌లక్ష్మి'గా కల్పవృక్షవాహనం లోను, త్రేతాయుగంనాటి 'సీతాలక్ష్మి'నే నేను అంటూ హనుమద్వాహనం లోను, 'ధనలక్ష్మి'గా పల్లకిలో, 'గజలక్ష్మి'గా గజవాహనంపైనా, 'బ్రహ్మాండ నాయకి'గా సర్వభూపాలవాహనంలోను, 'విజయలక్ష్మి'గా గరుడవాహనం పైనా, 'ఆదిలక్ష్మి'గా సూర్యప్రభలోను, 'సామ్రాజ్యలక్ష్మి'గా చల్లని చంద్రప్రభ లోను సర్వలోకాలకు 'మహారాజ్ఞి'గా అలమేలుమంగమ్మ దివ్యరథంలో దర్శన మిస్తారు. చివరగా, అశ్వవాహనంలో 'భవభయహారిణి'గా దర్శనమిస్తుంది అమ్మ అలమేలుమంగ!

## పద్మసరోవరంలో పంచమితీర్థం

చివరిరోజు అనగా సౌరమానం కార్తికశుద్ధపంచమి నాడే అమ్మ అవతరించిన రోజు. ఆ రోజు తిరుమల శ్రీవారి నుండి పట్టమహిషి అయిన




పద్మావతికి పుట్టినరోజు కానుకగా సారె వస్తుంది. అందులో చీరలు, రవికలు, చందనం, పసుపుకుంకుమలు, తులసి, ప్రసాదాలు తిరుమల నుండి కాలినడకన మెట్లమార్గంలో, పిదప తిరుపతి నుంచి తిరుచానూరుకు ఏనుగు అంబారిపైన, తిరుమల శ్రీస్వామివారి అర్చకులు, ఆలయ అధికారగణం, బాజా భజంత్రీలతో వేడుకగా తీసుకువస్తారు. ఆ సరోవరతీరాన శ్రీపద్మావతి అమ్మవారిని, సుదర్శనభగవానుని, శ్రీవారు పంపిన పసుపు, కుంకుమ, చందన, తులసీ వగైరాలతో అలంకరించి తిరుమంజనం ఘనంగా నిర్వహిస్తారు. ఆపై, శుభ ముహూర్తంలో పద్మపుష్కరిణిలో శ్రీసుదర్శనభగవానుని మూర్తికి **'చక్రస్నానం'** వైభవంగా నిర్వహింపబడుతుంది. ఆ సమయంలో వేలాదిమంది భక్తులు సుదర్శనభగవానునితో పాటు పద్మసరోవరంలో మునకలు వేస్తూ పునీతులు అవుతారు.



దయాస్వరూపిణి అలమేలుమంగమ్మకు జరిగే పంచమితీర్థం నాటి మహోత్సవవైభవం వర్ణించడానికి మాటలు చాలవు. తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారి అనంతమైన **'దయ'**నే సాక్షాత్తు **'అలమేలుమంగమ్మ'**గా అవతరించిందని మహనీయు లంటారు. అందువల్ల, అటు తిరుమలేశుని, ఇటు తిరుచానూరు పద్మావతిని విడివిడిగా ఎంతగా పొగడినా వారిద్దరూ అభిన్నులే! ఒక్కరే! అని మనం మరచి పోకూడదు. ఏ ఒక్కరిని కీర్తించినా ఇద్దర్నీ కీర్తించినట్లే. వారిద్దరి సంబంధం వెన్నెలకు–చంద్రునికీ; సూర్యునికీ– సూర్యకిరణాలకూ; అగ్నికీ–వేడికీ ఉన్న సంబంధం లాంటిది. అందువల్ల అభిన్నులూ. ఒక్కరే అయిన అలమేలుమంగా సమేతంగా ఆనందనిలయుణ్ణి ఇలా ప్రార్థించుదాం.

నారాయణస్య హృదయే భవతీ యథాస్తే
నారాయణోఽపి తవ హృత్కమలే యథాస్తే।
నారాయణ స్త్వమపి నిత్యముభౌ తథైవ
తౌ తిష్ఠతాం హృది మమాపి దయావతీ శ్రీః॥

అమ్మా! అలమేలుమంగమ్మా! ఆనందనిలయుడైన నారాయణుని గుండెలో నీవు ఉంటావు. నీ హృదయపద్మంలో ఆ స్వామి ఉంటాడు. మీరిద్దరూ కలసి నా హృదయంలో నిండు దయతో స్థిరంగా కొలువై ఉందురుగాక!!

ఓం శ్రియై నమః
ఓం నమో వేంకటేశాయ

ఉపనిషద్వాక్యం

# వ్యక్తి సంస్కారానికి ప్రతీక 'వాక్కు'

**'వాఙ్మే మనసి ప్రతిష్ఠితా మనో మే వాచి ప్రతిష్ఠితమ్'**
**(వేదశాంతిపాఠమ్)**

**- బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ**

శుద్ధత కోసం వేదమతం అనేక భావనలను ప్రసరించింది. **'వాక్కు'** వ్యక్తి సంస్కారానికి ప్రతీక. వ్యక్తిత్వం వాక్కులో ప్రతిఫలిస్తుంది. అందుకే వాక్కును శుద్ధం చేసుకోవడం ప్రధానం.

అయితే వాక్కు వేరుగా, మనస్సు వేరుగా కాకుండా మనోవాక్కులు ఏకం కావాలి. మనస్సులోని సంకల్పం, భావన పటిష్ఠంగా వాక్కులో నెలకొనాలి. అట్లే 'అన్నమాట' పదిలంగా మనస్సులో నిలవాలి. ఇదే నిజమైన సత్యవ్రతం.

వేదం ఈ మాటలను పలికి **'ఋతం వదిష్యామి, సత్యం వదిష్యామి'** అని ప్రతిన పలికించింది. శాశ్వతమైన పరమాత్మయే **'ఋతం'**. ఆయన నుండి ప్రసరించిన చైతన్యమే **'సత్యం'**. వాటిని మననం చేయడం, వాక్కుతో అర్చించడం యథార్థమైన వ్రతం.

వేదాధ్యయన సందర్భంగా ఈ మంత్రాన్ని చెబుతూ, అధ్యయనం చేసిన దివ్య విషయాలు వాక్కునందు, మనస్సునందు సుప్రతిష్ఠితం కావాలని బోధిస్తున్నది **'వేదమాత'**. కేవలం మాటలతో అధ్యయనం చేయడమే కాక ఆ విద్య మనస్సులో నిలవాలి. అధ్యయన కాలంలో మనస్సు వాక్కునందు నిలవాలి. ఇది ఏకాగ్రతకు, శ్రద్ధకు ఉన్న ప్రాధాన్యాన్ని తెలియజేయడం.

అలా సత్యం పలికిన వానిని, అధ్యయనం చేయించిన గురువును కూడా రక్షిస్తుంది. అందుకే **'తన్మామవతు - తద్వక్తారమవతు -అవతు మామ్'** అని శాంతి మంత్రం పూర్తవుతుంది.

మనోవాక్కుల ఏకత్వం సిద్ధించిన తరువాత క్రియా రూపంగా పరిణమిస్తే ఆ జీవితం ధన్యం. దీనినే **'ఆర్జవత్వం'** అంటారు. 'ఋజుత్వమే' ఆర్జవత్వం. మనోవాక్కాయ కర్మల ఐక్యత, శుద్ధతలే ఋజుత్వం. ఈ ఆర్జవశక్తి ఆత్మను కాపాడుతుంది.

అసత్యాలతో, వంచనతో తనను కాపాడుకోగలనను కోవడం భ్రమ మాత్రమే. అది ఆత్మను క్షోభింపజేసి, పతనానికి తీసుకువెళుతుంది.

**"యథా చిత్తం తథా వాక్కు। యథా వాక్కు తథా క్రియా॥"**

చిత్తమేదో మాట అదే, మాట ఏదో క్రియ అదే. ఇదే త్రికరణశుద్ధి. ఈ త్రికరణాలలో 'సత్యం' నిండితే ఆ జీవితం పరిపూర్ణం.

వాక్కు వెలికి వచ్చేటప్పుడు- అది సత్యమో కాదో మనస్సుకి తెలుస్తుంది. మనసు వెనుక సత్యం ఉంటుంది. అది మాటగా రాకపోతే, ఆ సత్యం మనసును హెచ్చరిస్తూనే ఉంటుంది. తాను పలికేది సత్యమో, అసత్యమో ఆ అంతరంగానికి తెలుసు. అంతరంగ స్వరమే వెలికివస్తే సత్యం. అలా లేకుండా అంతరంగ మొకటీ, అనేదొకటీ అయితే మాట సగం ముక్కలైనట్లే. వాక్కు, అంతరంగం ఒకటైననాడు ఆ వాక్కుకి బలమొస్తుంది.

అట్లే, అన్నమాటను నిలబెట్టుకున్నప్పుడు బాహ్యమూ, భావమూ ఒకటై మనస్సుకి పటిష్ఠత చేకూరుతుంది. ఆ కారణం చేత సత్యం వాగ్విషయమే కాదు, మనోవిషయం కూడా.

సత్యమే నారాయణుడు. సర్వజ్ఞుడైన విష్ణువే వెలుపలా, బైటా ఉన్నవాడు. ఆ స్పృహ ఉన్నప్పుడు అసత్య జీవనమే ఉండదు. సత్యం లేని అర్చన, ఉపాసన, యజ్ఞం, తపస్సు వ్యర్థం.

సత్యంతో కూడిన యజ్ఞం సర్వాంగీనమవుతుంది.

మనస్సుకి భిన్నంగా మాట్లాడినా, మాటకు భిన్నంగా ప్రవర్తించినా చేసిన తపస్సు క్షీణిస్తుంది. మనోవాక్కుల ఏకత్వమే మహాతపస్సు. ఆ తపోమయ జీవనాన్ని సాధించడమే జీవనపరమార్థం. భారతీయ తాత్త్విక చింతనకి మూలభూమిక ఇదే.

# శ్రీవేంకటాచల మాహాత్మ్యం

(తరిగొండవెంగమాంబ ప్రణీతం)

వచనం- ఆచార్య కె.సర్వోత్తమరావు, 97041 04000

**గతసంచిక తరువాయి..**

మరల కొల్లాపురాన్ని వదలి గొల్లెతెలాగా చోళరాజపత్ని ఆశ్రమంలో ఉంటూ హరికి నేనేలా సేవ చేయలాని ఊగిసలాట లాడుతుంటే లక్ష్మీదేవి మానసిక స్థితిని బ్రహ్మ అవగతం చేసుకొన్నాడు. వెంటనే తాను ఆవు రూపం దాల్చాడు. రుద్రుడు దూడ అయ్యాడు. లక్ష్మీదేవి ముందు నిలబడ్డారు. సామాన్య గోవులాగ బ్రహ్మ, భూలోకం లోని దూడలాగా రుద్రుడు నటిస్తుంటే లక్ష్మివారి మనోభావాలను అర్థం చేసుకొని ఆవుదూడలను తరుముతూ చోళప్పపాళుని సతి అంతఃపురం వీథుల్లో ఆవుదూడల్ని 'అమ్మేస్తా! కొనేవారు కొనండి' అని కేకలు వేస్తూంటే, చోళరాజపత్ని ముచ్చటపడి ఆవు దూడల్ని కొన్నది. తన దగ్గర లోగడ ఉన్న రెండువేల ఆవులతో ఈ ఆవుదూడలని సంరక్షించమని గొల్లవానికి హుకుం జారి చేసింది.

బ్రహ్మరుద్రులు ఆవుదూడలు కావడంతో వారి చేతనే పుట్టలో దాగిన హరిని పోషిస్తాను. ఇక నాకు వేరే చింత లేదని మరలి కరవీరపురానికి లక్ష్మి వెళ్లిపోయింది.

ఆపై బ్రహ్మ స్వరూపమయిన ఆవు తాను ఇతర గోవులతో పచ్చికమేస్తూ వెంకటగిరి ఎక్కి పుట్టపై నిలబడి తనంత తాను పాలు స్రవించసాగింది. పుట్టలోని స్వామి పైనుండి స్రవించే పాలు తాగుతూ అజరుద్రుల ఉపాయనానికి ఆనందించాడు.

ఇలా ఉండగా ఆవు దూడల్ని కొన్న రాణి తన బిడ్డకోసం తాను కొన్న ఆవుపాలను పట్టించాలనుకొంది. గోపాలకుడు రాణికోరిక ప్రకారం ఆ ఆవుదూడల్ని అంతఃపురానికి తోలుకొంటూ వచ్చాడు. రాణి ఆ ఆవును నిమురుతూ విశ్వాసం కలిగిస్తూ పాలు పిండబోతే పాలు స్రవించలేదు. తనలో తాను-

"ఆవు పొదుగును చూస్తే నిండుకుండలా ఉంది. కాని, పాలేమి రావాయె" అని ఆశ్చర్యపడింది. కొన్ని దినాలు పరీక్షించి చూచినా పాలు రాలేదు. వెంటనే గోపాలకుణ్ణి పిలిచి- 'గోపాలా! కుండలాంటి పొదుగున్నా పాలు లేక పోవడమేమిటి? నీవు అడవిలో ఆకలికి పాలు పిండి తాగినావా?' అని ప్రశ్నించింది. 'అమ్మా! మీ మీద ఒట్టు, నేను తాగలేదమ్మా. ఒకవేళ దూడ తాగిందేమో' అన్నాడు.

'మా ఇంటనున్న దూడ తాగిందా! అబద్ధాలాడకు' అని కసరింది. చివరకు రాణి గొల్లవాణ్ణి కట్టి కొట్టి ఆపై వెళ్ళమని అదలించి పంపించింది.

ఆ గొల్లవాడు ఏడుస్తూ రోజూ వెళ్ళే ఆలమంద వెనక అడుగులు వేయక, రాణి తనకు అప్పగించిన ఆవు వెంటనే వెళ్ళాడు. ఆ ఆవు సరాసరి పుట్ట దగ్గరికి వెళ్ళి పొదుగు దిగజారి విడిచి పాలు స్రవించసాగింది. ఇదంతా చూస్తున్న గోపాలకుడు కోపంతో ఒక పెద్ద గొడ్డలి చేత బట్టి, ఆవు నడినెత్తిపై కొట్టబోయాడు.



ఆ సమయంలో పుట్టలోని విష్ణు దేవుడు 'ఆహా! రోజూ నా దగ్గరికి వచ్చి పాలిచ్చి తల్లిలా పోషిస్తున్న ఆవు గొల్ల వాని చేత చంపబడడమా?' అని తానే పుట్టనుండి పైకి వచ్చి గొడ్డలి వేటు ఆవుకు తగలకుండా అడ్డుపడ్డాడు. కాని గొల్లవాని గొడ్డలి వేటు హరినెత్తి మీద పడడంతో తలనుంచి ఏడు తాడి చెట్ల ఎత్తులో రక్తం స్రవించసాగింది. ఈ దృశ్యాన్ని చూసిన గొల్లవాడు అదిరిపోయి అక్కడే పడి చనిపోయాడు.

ఈ దృశ్యాన్ని చూచిన గోవు శేషాద్రి దిగి చోళభూపతి సభ చేరి అక్కడ నేలమీద పొరలుతూ అరుస్తూ కన్నీరుతో నించుంటే రాజు ఆ ఆవుకేసి చూశాడు. సమస్య తెలుసుకోవడానికి చారులను ఆవు వెంట వెళ్ళమన్నాడు. *(ఇంకా ఉంది)*



# సందేహాలు సమాధానాలు

-డా॥ రేవూరు అనంతపద్మనాభరావు, 98665 86805

**ప్ర) "సర్వం శ్రీకృష్ణార్పణం" అనడానికి కారణమేమిటి?**

**- కుటుంబరావు, హైదరాబాదు.**

**జ)** భగవదర్చనలో ప్రధానంగా త్రికరణశుద్ధి ముఖ్యం. మనసా, వాచా, కర్మణా- భగవంతుని అర్చించాలి.

"మంత్రహీనం, క్రియాహీనం, భక్తిహీనం సురేశ్వర!
యత్పూజితం మయా దేవ పరిపూర్ణం తదస్తు మే"

అని అపరాధ క్షమాపణ స్తోత్రం పఠిస్తారు. ఆ తర్వాత అక్షింతలు చేతిలో తీసుకొని నీళ్లు పోస్తూ "సర్వం శ్రీపరమేశ్వరార్పణమస్తు" అని పాత్రలో వదులుతారు. దాని భావం- ఈ షోడశోపచారాలతో కూడిన సమస్త పూజాద్రవ్యాలు, నైవేద్యము భక్తిభావంతో ఆ భగవంతునికే అర్పించడం. అలానే 'సర్వం శ్రీకృష్ణార్పణం' అనే సంప్రదాయం ఆచారంగా మారింది. ఫలితాన్ని ఆశించకుండా సమస్తం భగవదర్పితం చేయడం ఇందులో పరమార్థం.

**ప్ర) స్వామివారి నీరాజన శ్లోకాలలో - "నీలాచల నివాసాయ, నిత్యాయ పరమాత్మనే। సుభద్రాప్రాణనాథాయ జగన్నాథాయ మంగళం" అని అనుసంధానిస్తారు. దీనిలో పూరీ జగన్నాథుని ప్రస్తావన ఉంది. మరి సుభద్ర చెల్లెలా? భార్యయా? ఏది ఎలా?**

**- డా॥ ఎం.పురుషోత్తమాచార్య, నల్గొండ.**

**జ)** ఈ అంశం పూరీజగన్నాథుని పరంగా అన్వయించుకొనే సందర్భంలోనిది. జగన్నాథరథయాత్ర వైశాఖశుద్ధతదియనాడు రథనిర్మాణకార్యక్రమంతో మొదలవుతుంది. ఆషాఢశుద్ధ విదియ నాడు "మానియా" (జగన్నాథా) అంటూ నామస్మరణ చేస్తూ జగన్నాథ, బలభద్ర, సుభద్రుల మూలవిగ్రహాలను కదిలిస్తారు. రథాలపై ముగ్గురూ బయలుదేరుతారు. ఇక్కడ 'సుభద్రాప్రాణనాథా!' అనడంలో సోదరీసోదరుల అనుబంధం స్మరించుకోవాలి. రాజును 'ధరణీనాథుడు' అంటారు. ధరణిపై ప్రజలను రక్షించువాడని భావం. సుభద్రవిషయంలోను శ్రీకృష్ణుడు (జగన్నాథుడు) ఆమెకు వివాహ విషయంలో రక్షకుడు. అన్వయం అలా చేసుకోవడం భావ్యం.

**ప్ర) ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి స్వాధీనమయితే పరమాత్మలో లీనమవుతాయా? -సంపత్కుమారాచార్యులు, తిరుపతి.**

**జ)** వేదాంత పరిభాషలో మనస్సు, బుద్ధి స్వాధీనంలో ఉండడానికి ఏకాగ్రత, ధ్యానము, అంతఃకరణశుద్ధి ముఖ్యం. పంచేంద్రియాలు మానవుని జీవన గమనాన్ని నడిపిస్తాయి. పరమాత్మలో లీనం కావడానికి అనేక సాధనాలున్నాయి. నవ విధభక్తి మార్గాలలో భగవంతుని సేవించడం మన పురాణాలలో, వేదాంత గ్రంథాలలోను విపులంగా వివరించబడింది. సామీప్య, సారూప్య, సాలోక్య, సాయుజ్యసిద్ధులు భక్తిమార్గంలో మెట్లు. శివానందలహరిలో 'సారూప్యం తవ పూజనే' అనే శ్లోకంలో ఈ అంశాలు ప్రస్తావించబడ్డాయి.

**ప్ర) జీవహింస మహాపాపం కదా? మరి ఋషులు జింకచర్మం, పులిచర్మం వాడడం సబబేనా?**

**- డా॥ సుబ్రహ్మణ్యం, హైదరాబాదు.**

**జ)** మృతకళేబరాల నుండి సేకరించిన జింకచర్మము లేదా వ్యాఘ్రచర్మంపై ఋషులు, మునులు తపస్సు, ధ్యానం చేస్తారు. పులినోటబడితే మృత్యువే. దానిని జయించి పునర్జన్మ పొందిన భావంతో పులిచర్మంపై ధ్యానం చేస్తారు. చపలచిత్తానికి జింక నిదర్శం. పరుగులు తీసే మనస్తత్వం దానిది. నిగ్రహశక్తికి జింకచర్మం తోడ్పడుతుంది. యోగులు, సిద్ధులు కూడా జింకచర్మంపై ఆసీనులవుతారు. ఆ దృష్టితో ఆలోచించాలి.

**ప్ర) భగవద్గీతను చదవడం వల్ల ఏమిటి ప్రయోజనం?**

**- శ్రీమతి శ్రీప్రియ, యు.ఎస్.ఏ.**

**జ)** గీతామాహాత్మ్యాన్ని శ్రీవిష్ణువే ఇలా వివరించాడు.

గీతార్థం ధ్యాయతే నిత్యం కృత్వా కర్మాణి భూరిశః।
జీవన్ముక్తః సవిజ్ఞేయో దేహాంతే పరమం పదమ్॥

భగవద్గీతా పఠనం వలన అనేక కర్మలు ఆచరించినప్పటికీ జీవన్ముక్తి కలిగి దేహాన్ని విడిచినపుడు పరమపదం జీవుడు పొందుతాడు. కేవలం గీతాశ్రవణం వలన మహాపాపులకు కూడా వైకుంఠప్రాప్తి కలుగుతుంది. భగవానుడు బోధించినది అర్జునునికే కాదు, యావత్ మానవకోటికీ వర్తిస్తుంది. గీతా పఠనము, గీతాశ్రవణము భక్తి ముక్తిదాయకం.

## శ్రీమహాలక్ష్మి కమలంలో కూర్చొని రెండు వైపులా ఏనుగులతో ఎందుకు ఉంటుంది ?

దేవదానవులు క్షీరసాగరాన్ని మథించినపుడు విష్ణువును వరించింది లక్ష్మీదేవి. సర్వలక్షణసంపన్నురాలు అయిన ఈ సుందరికి "శ్రీలక్ష్మి" అని నామకరణం చేశారు. సమస్తసంపదలకు అధిదేవతను చేశారు. పాలనురుగువంటి దేహచ్ఛాయ, త్రిలోకైకసౌందర్యం ఈమెకు సొంతం. ఎప్పుడూ చిరునవ్వు నిండిన ముఖంతో, సర్వాలంకారభూషితయై గజరాజులు తోడుగా, నాలుగుచేతులతో, కమలాసనంపైన కూర్చొని ఉంటుంది. చేతులలో ఎటువంటి ఆయుధాలు ఉండవు లక్ష్మీదేవికి. ఈమె పద్మములను మాత్రమే ధరించి ఉంటుంది.

దేవతలకు 4 చేతులు, 8 చేతులు ఉండటం మనం గమనిస్తాం. అంటే దాని అర్థం దేవతలకు అంతటి శక్తి ఉంటుందని అర్థం. లక్ష్మీదేవికి 4 చేతులు ఉంటే, పార్వతీదేవికి 8 చేతులు ఉంటాయి. అలా ఎందుకు దేవతలకు అన్ని చేతులు ఉంటాయంటే డబ్బుకన్నా, విద్యకన్నా, భుజబలం చాలా గొప్పదని అంతరార్థం.

ధనలక్ష్మికి స్థిరత్వం లేదు. ఒకరి దగ్గర స్థిరంగా ఉండదు, లక్ష్మి చంచల మనస్సు గలది. అయితే ఎవరి దగ్గర ఆమె ఉంటుందో ఆ ఉన్న 4 రోజులు ఉయ్యాల ఊగిస్తుంది, అందరిని అన్నింటికీ దాసోహం అని అనిపిస్తుంది. తన శక్తి ఏమిటో చూపిస్తుంది. అందుకే పెద్దలు "డబ్బుకు లోకం దాసోహం" అని, "ధనమూల మిదం జగత్" అని అంటారు. లక్ష్మికి నాలుగు చేతులు ఉండడానికి కారణం ఇదే! తన చంచలత్వాన్ని అందరికి తెలియజేయడానికి. శ్రీమహాలక్ష్మి నీటి కొలనులో ఉన్న తామరలో కూర్చొని ఉంటుంది. నీటిలో ఉన్న తామరపూవు నిశ్చలంగా ఉండదు. చిన్న గాలి వచ్చినా అటు ఇటు ఊగిపోతుంది. ఆ పద్మం నీటిలో ఉన్నంత వరకు నిగ



"ఓం శ్రీమహాదేవ్యై
చ విద్మహే
విష్ణుపత్న్యై చ
ధీమహి।
తన్నో లక్ష్మీ
ప్రచోదయాత్"



# గజ పరివేష్టిత మహాలక్ష్మి

**– ఆచార్య కాదంబిని, 94900 08288**

నిగలాడిపోతుంది. నీటినుంచి బయటకి తీయగానే వాడిపోతుంది. అదేవిధంగా ధనం మన దగ్గరున్నంత వరకు మనకు శక్తి, ధైర్యం వస్తుంది. బయటకి తీసి ఖర్చు పెడితే మనిషికి శక్తి తగ్గిపోతుంది, భయం వస్తుంది. అన్ని విధాలుగా క్రుంగిపోతారు. దరిద్రం వెంటాడుతుంది.

శ్రీమహాలక్ష్మికి రెండు వైపులా ఏనుగులు ఎందుకు ఉంటాయంటే గజబలం ఎంత గొప్పదో, ధనబలం కూడా ఈ కలియుగంలో అంత గొప్పది అని తెలియజేయటంకోసం. ఒక్క రోజులో వాడిపోయే పద్మంలో లక్ష్మి ఎందుకు దర్శనం ఇస్తుంది అంటే "ధనం శాశ్వతం కాదు" అని తెలియచెప్పడానికి.




# ధన్వంతరి నమోస్తు తే

- లింగారెడ్డి ఉమామహేశ్వరి, 91820 75761

అమృతోత్పాదనకై దేవదానవులు క్షీరసముద్రమును మథించగా అమృతకలశమును దివ్యౌషధములను తీసుకొని శ్రీమహావిష్ణువు ధన్వంతరిస్వరూపమున ఆవిర్భవించినట్లు పురాణకథనం.

కార్తికే కృష్ణపక్షే తు త్రయోదశ్యాం గురోర్దినే
హస్తా నక్షత్రసంయుక్తే యామే ప్రాథమికే నిశి।
ధన్వన్తర్యాఖ్యయా చాహం ధనగుప్త మివోదధేః
అవతీర్ణో యతస్తస్మాత్ సాతిథిస్సర్వకామదా॥

కార్తికమాస కృష్ణపక్షత్రయోదశి తిథి హస్తానక్షత్ర శుభదినమునందు ఆరోగ్యప్రదాత, కరుణామూర్తి, శ్రీహరి స్వరూపుడు ఆధివ్యాధి జరామృత్యురహిత సంపూర్ణసర్వకామ్యార్థ ఫలప్రదాత అగు ఆ ధన్వంతరి వ్రతవిధానం ధన్వంతరి జయంతి నాడు ఆచరించుట సర్వశ్రేయోదాయకం. ఆ వ్రతం బ్రహ్మాండపురాణంలోనిది. ఇది ఐదు అధ్యాయములతో కూడినది.

## పూర్వరంగం

సంకల్పపూర్వక పుణ్యాహవాచనం, దిక్పాలకపూజ, 'ఆశ్రితభక్తలోకసదారోగ్య వరప్రదాతారం శ్రీమద్ధన్వంతరిం ధ్యాత్వా' అని ధన్వంతరిని కలశమందుగానీ ప్రతిమయందు గానీ, ధ్యానించి ప్రాణప్రతిష్ఠ జరిపి-

ఓం నమో భగవతే వాసుదేవాయ ధన్వన్తరాయ
అమృతకలశహస్తాయ సర్వామయ వినాశనాయ
స్వామినే త్రైలోక్యనాథాయ మహావిష్ణవే నమః॥

-అని ఆవాహన జరిపి, ఆసన- పాద్య- అర్ఘ్య- ఆచమన- మధుపర్క- స్నాన- వస్త్ర- యజ్ఞోపవీత- నృత్య- గీత- వాద్యాదులు సమర్పించి ధన్వంతరి వ్రతకథను శ్రవణం చేయవలయును. అందు-

## ప్రథమాధ్యాయ సారాంశము

సూతుడు శౌనకాది మహామునులకు ధన్వంతరి వ్రతవైశిష్ట్యమును, ఆచరించు విధానమును, శ్రీమహావిష్ణువు ద్వారా నారదమహాముని కొరకు ఉపదేశింపబడిన విధానమును ఉపదేశించుచున్నానని తెలిపిన సారాంశము ప్రథమాధ్యాయ మందు కలదు.

## ద్వితీయాధ్యాయ సారాంశము

పుష్పరథుడను రాజు తనకుమార్తె యగు పుష్పవేణికి మాళవ దేశాధీశ్వరుని కుమారుడైన సుప్రకాశునితో వివాహం చేయ దలచి మాళవేశ్వరునకు వర్తమానము పంపెను.

మాళవేశ్వరుడు తన పుత్రునకు ఈ విషయాన్ని తెలుపగా, కుమారుడు వైరాగ్యభావనతో వివాహముపై ఇష్టంలేక తన స్నేహితుడైన సునీతునితోకలిసి తపోవనమునకు వెళ్లి, గురువువద్ద సకలశాస్త్రములు అభ్యసించి, గురువాజ్ఞతో ఇద్దరు వివాహము చేసుకొనదలచి, అక్కడ నుండి పాదచారులుగా బయలుదేరి, ఒక నదీతీరమున విశ్రమించిరి. కొంతసమయ మైన తరువాత, సునీతి తన మిత్రుడైన సుప్రకాశునకు ఎటువంటి ఆపదలు వాటిల్లకుండ జాగరూకుడై ఉండెను. సుప్రకాశుడు భూమిపై అట్లే నిద్రపోయెను. ఇది ద్వితీయా ధ్యాయ సారాంశము.

## తృతీయాధ్యాయ సారాంశము

పుష్పవేణి తను భర్తగా నిర్ణయించుకొన్న సుప్రకాశుడు తపోవనమునకు వెళ్లెనని తండ్రిద్వారా తెలుసుకొని, మిక్కిలి దుఃఖంతో కొంత కాలము గడిపి, ఎట్లైననూ సుప్రకాశుని చేరవలెనని నిర్ణయించుకొని, తండ్రి ఆజ్ఞతో కొంత సైన్యమును తీసుకొని వనమునకు బయలుదేరి సుప్రకాశుని అన్వేషించ సాగింది.

కొంత దూరము వెళ్లిన తర్వాత సైన్యమును వదలి, ఒంటరిగా పాదచారియై సుప్రకాశుని చూచుటకై వెళ్లగా 'హా! సుప్రకాశా! మిత్రమా! లే! నన్ను విడిచిపెట్టి వెళ్లకు', అన్న శబ్దము విని, ఆ దిశగా వెళ్లి సుప్రకాశుని గుర్తించి, సునీతుని ప్రశ్నించగా, సునీతుడు తన స్నేహితుడు సర్పకాటుతో మర ణించెనని దానితో నేను వ్యథ చెందుచున్నానని తెలుపగా, పుష్పవేణి అత్యంత దుఃఖితురాలై సుప్రకాశునితో కలసి సహ గమనము చేయ ఉద్యుక్తురాలయ్యెను.

అంతలో అశరీరవాణి 'ఓ పుష్పవేణి! నీ పాతివ్రత్య సంకల్పము గొప్పది. నీవు వెంటనే శ్రీమన్నారాయణస్వరూపుడైన ధన్వంతరిని ఆరాధించుమ'ని పలికెను.

వెంటనే పుష్పవేణి భక్తిపూర్వకముగా ధన్వంతరివ్రతము చేసి సుప్రకాశుని శరీరము స్పృశించగా, సుప్రకాశుడు సజీవుడై పుష్పవేణిని అభినందించి వివాహము చేసుకొని సుఖసంతో షములు పొందెను.

ఈ వృత్తాంతము శ్రీమన్నారాయణుడు నారదునకు ఉపదేశించెనని సూతుడు శౌనకాదిమునులకు బోధించెను. ఇది తృతీయాధ్యాయ సారాంశము.

## చతుర్థాధ్యాయ వృత్తాంతము

సూతుడు శౌనకాదిమునులకు ఇట్లు ఉపదేశించు చున్నాడు. వైవస్వతమను కుమారుడైన శర్యాతిరాజునకు సుగుణ వతియైన కన్య కలదు. ఆమె వనవిహారార్థము సంచరించుచు ఒక వల్మీకము వద్ద తేజస్సు వచ్చుటను గమనించి కర్రతో రంధ్రమును పొడిచెను. ఆ వల్మీకములో తపస్సు చేయుచున్న చ్యవనమహర్షి కన్నులను పొడుచుటచే కన్నులు పోయినవాడై ఆ రాజ్యమును శపించెను.

దానితో సమస్తప్రజలు మలమూత్రవిసర్జనలేక దుఃఖమును అనుభవించసాగిరి. రాజు విచారించి కారణమును తెలుసుకొని చ్యవనమహర్షి వద్దకు వచ్చి ప్రార్థించగా, ఆ మహర్షి రాజపుత్రికను తనకిచ్చి వివాహము చేసిన దుఃఖమునుండి బయటపడగలరని తెలిపెను. రాజు తన ప్రజల సుఖమే ప్రధానమని భావించి, తన పుత్రికనిచ్చి వివాహము చేయుటకు నిశ్చయించెను. తన కుమార్తె కూడా వివాహమునకు అంగీ కరించెను. వెంటనే వివాహము గావించగా ప్రజలు ఆ బాధ నుండి విముక్తులై సుఖసంతోషమును పొందిరి.

## పంచమాధ్యాయవృత్తాంతము

ఆమె భర్తసేవయందు అప్రమత్తమై భర్తకు నేత్రములు, యౌవనము, శక్తి రావలయునని ధన్వంతరి వ్రతమును చేయుటనారంభించెను.

శాస్త్రోక్తముగా ధన్వంతరివ్రతము గావించి దీక్షతో వైదికపద్ధతిలో వ్రతమాచరించి ధన్వంతరికటాక్షము పొంది, తన భర్తకు యౌవనము సంపాదింపచేసెను. సంపూర్ణయౌవనమును పొంది, ఆనందభరితుడై గార్హస్థ్య ధర్మములను పాటించుచూ ధన్వంతరి వ్రతమును అందరికి ఉపదేశించినవాడయ్యెను. ఆ చ్యవనమహర్షి–

"జ్వర– గుల్మ– ప్లీహ– అర్శ– కుష్ఠ– ఆమ్ల– పిత్త– కర్ణ– నేత్ర– అతిసారాది మహారోగ పీడితులు ఈ వ్రతమును ఒక్కసారి భక్తిపూర్వకముగా ఆచరించినచో, ఆయా రోగముల నుండి విముక్తులై తప్పక సుఖమును పొందెదరు. ఇది సత్యము" అని పల్కెను.

ఈ విధంగా శ్రీమన్నారాయణుడు నారదమహర్షికి ఉపదేశించిన వృత్తాంతమును సూతుడు శౌనకాదిమునులకు ధన్వంతరి వ్రతకథనము వివరించెను.

## ఉపసంహారము

ధన్వంతరియొక్క అనుగ్రహము అవశ్యకర్తవ్యము. అందులకై 'ధన్వంతరి జయంతి' రోజు యథాశక్తి ధన్వంతరి వ్రతము గావించి సర్వజనులు ఆయురారోగ్యభాగ్యము పొందగలరు.

మంగళం సాగరోత్థాయ పీయూషకలశాయ చ।
ఆయుర్వేదస్వరూపాయ మంగళం శుభహేతవే॥

ధారావాహిక

# తిరుమల సమయాచారములు

(తిరుమల-తిరుపతి ఐతిహ్యమాల)

**తెనుగు అనువాదకులు:**
**కీ.శే. డా॥ఎన్.సి.వి.నరసింహాచార్యులు,**
**కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు**

*(గత సంచిక తరువాయి భాగం...)*

శ్రీ అనంతార్యులు తమ ఆచార్యులగు భాష్యకారుల నామధేయముపెట్టి 'రామానుజమ్' అను ఒక నందనవనము ఏర్పరచి, అందులకై తమ ధర్మపత్నితోడను, కుమారులతోడను ఒక చెరువు త్రవ్వించి దానికిని 'రామానుజమ్' అను నామధేయమిడి, పుష్పవృక్షములకు నీరు పారించుటకై ఒకకాలువ కట్టించి, శ్రీమాల కూర్చెడు మండపమునకు భగవద్రామానుజాచార్యుల యాజ్ఞమేరకు తమ పరమాచార్యులగు ఆళవందారుల నామధేయమగు 'యమునైత్తుఱైవన్' (యామునాచార్యమండపము) అను పేరు పెట్టునట్లుగా ఒక శ్రీమండపమును నిర్మింపవలెనని నియమించిన రీతిగ (కట్టియం యాదవరాజు) కట్టించినాడు. ఇట్లనేక కైంకర్యములను జరిపించుచుండినాడు.

ఇట్లు కొంత కాలము గడిచిన తరువాత కందాడై రామానుజయ్యంగార్ అనెడు శ్రీవైష్ణవు లొకరు శ్రీరామానుజాచార్యుల యెడ పరమ వైరాగ్యనిష్ఠగలవారై, భాగవతోత్తములై, స్పర్శవేది అను విద్య ఫలించునట్టి సత్యవచనులైయుండి శ్రీరంగాది క్షేత్రములందు అనేక గోపుర మండప ప్రాసాదాదుల నిర్మింపజేసి ఔపచారిక-సాంస్పర్శిక-అభ్యవహారిక కైంకర్యములను నిర్వర్తింపజేయుచుండిన కాలమునకు వెనుకటి దినములలో ఒక కాల విశేషమున తిరుమలయందు 'శెవ్వన్' అనెడు ఒక గొల్లవాడు ఆలమందలను తోలుకొనిపోయి మేపుచుండగా, అతనికి స్వప్నమునందు శ్రీవేంకటేశ్వరస్వామి కనిపించి 'ఒకచోట నిధి నిక్షేపముండుట చెప్పి, ఆ ద్రవ్యమును తీసికొని తిరుమల యడివారమునకు, తిరుచ్చుకనూరు (తిరుచానూరు)నకును, మేము వసించెడి స్థలమునకును సేవాపరులు సుఖముగా నెక్కివచ్చుటకు మార్గమేర్పరచి మెట్లు కట్టింపుము' అని నియమించుటచేత, అతడును ఆ స్వప్నమును గాంచి సంతుష్టుడై యట్లే ఆ నిధిని గొని, సుగమమార్గ మేర్పరచి మెట్లు గూడ కట్టించినాడు. కొంత కాలము చనిన తరువాత మార్గమందలి సోపానములు శైథిల్య మొంద, అప్పుడు కందాడై రామానుజయ్యంగారు ప్రాతసోపానములు తీసివేయించి, సుదృఢముగను, విశాలముగను మెట్లు కట్టించి, మున్ను నైమిశారణ్యమందు ఋషులు, మార్కండేయాది పరమర్షులు శ్రీవేంకటాచలయాత్ర చేయుచుండగ మార్గమధ్యమున నరసింహస్వామి ప్రత్యక్షమై వారికి దర్శనభాగ్య మొసగిరని మార్కండేయపురాణమున వేంకటాచలమాహాత్మ్య ఘట్టమున నున్నందువలన, ఆ నరసింహస్వామి విజయము చేసియున్న గుహ ఒక పల్లపు ప్రదేశమున ఉండుటచేత దిగి ఎక్కివచ్చుటకు అలవిగాకయుండుటచేత ఆ స్థలము పరిహరించి గుహకు దక్షిణ భాగమునందు మార్గమధ్యమున ఎల్లవారును దర్శనము చేసి కొనుట కనువుగా గుడి నిర్మించి నరసింహస్వామికి శ్రీప్రతిష్ఠ జరిపించి, ప్రతిదినము భగవదారాధనము జరుగునట్లుగ ఏర్పాటొనర్చెను.

మునుపు భగవద్రామానుజులు శ్రీవేంకటాచలయాత్ర చేసినప్పుడు శ్రీశైలపూర్ణులు, అనంతార్యులును శ్రీవేంకటాచలపతి ప్రసాదమైన మామిడిపండ్లను చేతగొని ఎదురుగ నరుగుదెంచి భగవద్రామానుజులకు సమర్పింపగా, వారు ఆ పండ్లను స్వీకరించి- **'ప్రాప్తమాత్రేణ భుంజీయాత్ ప్రసాదం పావనం హరేః'** (దొరికినదే తడవుగ పావనమైన శ్రీహరి ప్రసాదమును భుజింపవలెను) అన్నవిధముగ, ఆ పండ్ల నారగింపగ ఆ పండ్ల టెంకలు అచ్చోటనే పడి మొలకెత్తి, పెరిగి ఫలపర్యంత మగుటచేత ఆ చెట్ల సంతానపరంపరాప్రాప్తమగు ఆ మామిడి చెట్లున్న స్థలమందు ఒక గుడి కట్టించి శ్రీభగవద్రామానుజులను అర్చామూర్తిగా ప్రతిష్ఠ చేయించి శ్రీవేంకటాచలయాత్ర యొనర్చెడు పరమభాగవతులకొరకై శీతాతపవర్షబాధానివర్తకములైన మండపములను కోనేరులను ఏర్పరచి, దేవతాంతరభక్తుల మూలమున స్థలమునకు ఒక ఉపద్రవము రాకుండునట్లుగ తిరుమల యడివారమున మునుపు శ్రీశైలపూర్ణులు శ్రీభాష్యకారులకు శ్రీమద్రామాయణమును ప్రవచించుచుండిన స్థలమైన శ్రీవేంకటాచలపతి పాదారవిందముల సమీపమందు సర్వారిష్ట నివారణనిపుణుడగు లక్ష్మీనరసింహస్వామిని ప్రతిష్ఠ చేయించి స్వయంవ్యక్తమగు ఒక శ్రీగోపురమునకు తొమ్మిది అంతస్తులు నిర్మింప సంకల్పించియుండగా ఆ కాలమున పరపతి యస్తమించుట జూచి, శిలాద్వారముతోడ ఏడు ద్వారములు శిల్పసిద్ధమగుటచేత, ఆ విధముగ శిఖరముల నెత్తించి కందాడై రామానుజఅయ్యంగారు శ్రీగోపురము పూర్తి చేయించెను.

(ఇంకా ఉంది)

# స్త్రీ వైశిష్ట్యం

గృహలక్ష్మి

**– 'వాచస్పతి' బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు**

**55** ఏళ్ళు అన్నయ్యకు, 50 ఏళ్ళు తమ్ముడికి. అన్నయ్య ఇంటికి తమ్ముడెళ్ళడు, తమ్ముడింటికి అన్నయ్య వెళ్ళడు. ఒక్క అమ్మ కడుపున పుట్టినవాళ్ళమనే భావన ఈ జన్మకు ఆ ఇద్దరితోటే కదా! 55 ఏళ్ళు వస్తే నువ్వు మహాబతికితే 70 ఏళ్లు వచ్చే వరకే. ఆ తరువాత నీవు స్వతంత్రంగా తిరగలేవు. ఆ తరువాత మరో 15 ఏళ్ళు బతుకగలవేమో. అప్పుడప్పుడూ వెళ్ళేది లెక్కేసుకున్నా ఈ శరీరం ఉండగా మహా అయితే బహుకొద్ది సార్లు మాత్రమే నీ తమ్ముడింటికి వెళ్ళగలవు. ఆ మాత్రం దానికి ఎందుకు కొట్టుకు చస్తారు? అన్నదమ్ములిద్దరూ చిన్నప్పుడెంత ప్రేమగా మెలిగారో అలా చెయ్యి చెయ్యి పట్టుకుని, పాతజ్ఞాపకాలు నెమరేసుకుంటూ సంతోషంగా కలిసి మెలగలేరా... నిజానికి ఏ ఒక్కరి శరీరం పడిపోయినా ఆ బంధం తాలూకు మాధుర్యం జీవితంలో మళ్ళీ వస్తుందా... పోగొట్టుకున్న తరువాత ఏడ్చి ఉపయోగం ఏమిటి?

రాముడు పుష్పక విమానంలోంచి దిగుతుంటే లక్ష్మణ స్వామి, భరత శత్రుఘ్నులు ఎదురెళ్ళి పాదుకలు తొడిగి కిందకు దింపుతుంటే... విభీషణుడు పక్కకు తిరిగి కళ్ళొత్తుకున్నాడు... "నా అన్న రావణుడు కూడా మహానుభావుడు. సమస్త శాస్త్రాలను చదువుకున్నవాడు. పది తలలున్నవాడు. ఘోరమైన తపస్సు చేసినవాడు. కాంచన లంకాధిపతి. లోకాలను గడగడలాడించినవాడు. నేనే చంపించేసాను. కుంభకర్ణుడు సామాన్యుడు కాదు. నేనే చంపించేసాను. అన్నయ్య కనపడితే పాదాల దగ్గర అన్నయ్యా అని నమస్కరిద్దామంటే ఏడీ? అన్నయ్యా! చెప్పులేసుకో అని ఇలా చెప్పులు తీసి అన్నయ్య కాళ్ళదగ్గర పెడదామంటే ఏడీ? చంపించేసాను" అని తలచుకుని ఆవేదన చెందాడు.



సుగ్రీవుడు కూడా పక్కకు తిరిగి కళ్ళొత్తుకున్నాడు. "నా అన్న వాలి. ఎదుటివారి బలం సగం లాగగలడు. అప్రమేయ పరాక్రమవంతుడు. నాలుగు సముద్రాల దగ్గర సంధ్యావందనం చేయగలడు. అంతటి బలవంతుడు. నేనే ఈ రాముడితోటే బాణం వేయించి చంపేసాను. నాకు అన్న లేడు.. నేనిలా చెప్పులు తొడగలేను. నేనిలా కౌగిలించుకోలేను. అన్నయ్యా! అని చెయ్యివ్వలేను... అన్నను పోగొట్టుకున్న దురదృష్టవంతుణ్ణి" అని వేదనాభరితుడయినాడు.

రామలక్ష్మణ భరతశత్రుఘ్నులు నలుగురూ చెయ్యి చెయ్యి పట్టుకుని బతికారు జీవితాంతం.. కానీ ఆ గొప్ప వాళ్ళది కాదు. అలా బతకగలిగారంటే.. వాళ్ళు అలా బతికేటట్టుగా మాట్లాడి.. బతకడానికి అవకాశమిచ్చినవారు– శాంతిస్థానంలో ఉన్న వాళ్ళ భార్యలు.

"మీ అన్న రాముడు అరణ్యవాసానికి వెడుతున్నాడు... అంటే మీ నాన్న దశరథ మహారాజుగారిని వరమడిగారు, వెడుతున్నాడు. మీ వదిన సహధర్మచారిణి కాబట్టి వెడుతోంది.. 14 ఏళ్ళు నువ్వెందుకయ్యా వెళ్ళడం..?" అని లక్ష్మణ స్వామి భార్య ఊర్మిళ భర్తను అడగవచ్చు కదా! అడగలేదు. అంటే "ఆయన ధర్మాత్ముడు. అన్నగారి కోసం వెళ్ళిపోయాడు. అటువంటి భర్తకన్నా నాకేం కావాలి?" అనుకుని ఊర్మిళ ప్రశ్నించలేదు.

ఆ నలుగురు అన్నదమ్ములు అలా సఖ్యతతో ఉండడానికి కారణం **సీతమ్మ, ఊర్మిళ, మాండవి, శృతకీర్తి** సహకరించడం. స్త్రీ తాను ఎంత శక్తిమంతురాలో తెలుసుకోవడం ఒక ఎత్తు, అది తెలుసుకున్న తరువాత తన కుటుంబ శాంతి కోసం శీలవైభవాన్ని పొందడం ఒక ఎత్తు. అది ఆచరణాత్మకమైననాడు పదిమంది ప్రశాంతంగా జీవనం చెయ్యగలిగిన అవకాశం కలుగుతుంది.

*॥జై శ్రీరామ్॥*

# 'సుగుణఖని' పేయాళ్వార్

**- శ్రీ వైద్యం వేంకటేశ్వరాచార్యులు**

**పద్మారమణపాదాబ్జ ప్రేమభ్రాంత్యా మనోజ్ఞయా,**
**భ్రాంతయో గీతి విఖ్యాతం మునిం వందే గుణాంబుధిమ్.**

"శ్రియఃపతిపాదారవిందాలమీద ఉండే ప్రీతివల్ల కలిగిన భ్రాంతిచే భ్రాంతయోగి అనే వినుతిని గడించిన 'సుగుణఖని' అయిన పేయాళ్వార్లకు నమస్కరిస్తున్నాను."

శ్రీహరి నందకఖడ్గాంశాన 'పేయాళ్వారు' అవతరించారు. మొదలాళ్వారులలో వీరు మూడవవారు. పూదత్తాళ్వారు పుట్టిన మరునాడే వీరూ పుట్టారు. వీరు (నేటి చెన్నైలోని మైలాపూర్) మయూరనగరంలో మణికైరవం అనే బావిలోని ఎఱ్ఱకలువల నుండి అవతరించారు. సిద్ధార్థి నామసంవత్సర చాంద్రమాన ఆశ్వయుజ శుక్లపక్ష దశమి శతభిషానక్షత్రాన వీరు అవతరించారు. 'పేయ్' అంటే పిచ్చి, భ్రాంతి అని అర్థం. భగవంతుని యందే మనస్సు కలిగి పేయ్/ పిచ్చిగా తిరుగుతూ ఉండడంచేత వీరు పేయాళ్వారుగా ప్రాచుర్యం పొందారు. వీరు రచించిన దివ్యప్రబంధం పేరు **"మూన్ఱాం తిరువన్దాది"**. ఇందులో నూరు పాశురాలు ఉన్నాయి.

పేయాళ్వారు అనుగ్రహించిన **'మూన్ఱాం తిరువన్దాది'** దివ్యప్రబంధంలో మంగళాశాసనం చేసిన దివ్యతిరుపతులు 15. ఆ వివరాలు సంక్షిప్తంగా- *1)తిరువరంగం 2)తిరుక్కుడన్దై 3)తిరువిణ్ణగరం 4)తిరుక్కోట్టియూర్ 5)తిరుక్కచ్చి 6)అష్టభుజం 7)వేళుక్కై 9)తిరుఊరగం 10)తిరువెనకా 11)తిరువెల్లిక్కేణి 12)తిరుఘటికై 13)తిరువెంగడం 14)తిరుప్పారకడల్ 15)పరమపదం.*

తిరుమలలో వేంచేసి ఉన్న వరాహస్వామివారిని పేయాళ్వారు 10 పాశురాలలో మంగళాశాసనం చేశారు. అందులో మచ్చునకు ఒక పాశురభావం-

"మదపుటేనుగులు అనురూపంగా ఉండే ఆడ ఏనుగులతో సంశ్లేషించి, ప్రణయ కలహంతో అటు ఇటు తిరుగుతుంటాయి. స్వచ్ఛమైన రాళ్లలో తమ ప్రతిబింబాలను చూసి వేరే ఏనుగులని భావిస్తుంటాయి కొన్ని ఏనుగులు. వాటి దంతాలలోని ముత్యాలు వేంకటాద్రిపై రాలిపడుతుంటాయి. ఆ శ్రీవేంకటాచలమే పూర్వం తనకొమ్ములతో జలార్ణవంనుంచి భూమిని ఉద్ధరించిన శ్రీవరాహస్వామి వేంచేసి ఉండే దివ్య పర్వతం."

పన్నిద్దరు ఆళ్వారులలో మొదట అవతరించిన ఈ ముగ్గురు ఆళ్వారులను యోగిత్రయం అని, మొదలాళ్వారులు అని వ్యవహరిస్తారు.

వీరు ముగ్గురూ భగవదనుగ్రహప్రాప్త దివ్యజ్ఞాన సంపన్నులు. మొదట వీరు ఒకరి నొకరు ఎరుగరు. వీరు ఒకే చోట ఉండక, పగలు సంచారం చేస్తూ రాత్రులలో మాత్రమే గ్రామాలలో ఉండేవారు. ఒక రాత్రి వీరు ముగ్గురూ తిరుక్కోవలూరు (దేహళీ నగరం) అనే గ్రామంలో కలుసుకుంటారు. ఆ సంగతి సంక్షిప్తంగా-



**నవంబరు 1న పేయాళ్వార్ వర్ష తిరునక్షత్రం సందర్భంగా...**



పేయాళ్వారు శ్రీహరి నందకఖడ్గాంశాన జన్మించారు

సరోయోగి (పొయ్‌గై ఆళ్వార్) గ్రామసంచారం చేస్తూ ఒకనాడు రాత్రి తిరుక్కోవలూరు చేరుకున్నారు. రాత్రివేళ కనుక విశ్రాంతికోసం ఒక ఇంటిబయట అరుగుమీద పడుకున్నారు. ఆ స్థలం ఒకరికి మాత్రమే సరిపడేటంత ఉంది.

కొంతసేపటికి *భూతయోగి (పూదత్తాళ్వారు)* అక్కడకు వచ్చారు. ఇరువురు పరస్పరం దాస్యధర్మాలను నిర్వర్తించారు. భూతయోగి, సరోయోగిని "ఇక్కడ దాసునికి చోటు ఉంటుందా" అని అడిగారు. అప్పుడు సరోయోగి ఇలా చెప్పారు– "ఒక్కరికి పడుకునేంత మాత్రమే చోటు ఉంది. కూర్చుంటే మన ఇద్దరికీ ఈ స్థలం సరిపోతుంది, రండి" అని పూదత్తాళ్వారును ఆహ్వానించి ఇద్దరూ ఆ రాత్రి కూర్చునే ఉన్నారు.

కొంత సమయం గడిచింది. మరొక వ్యక్తి *మహాయోగి (పేయాళ్వార్)* అక్కడకు వచ్చారు. అక్కడ ఉన్న ఇరువురూ వచ్చిన వారు విష్ణుదాసులని తెలుసుకుని మహాయోగిని పూజించారు. ఇక్కడ మనం మువ్వురమూ కూర్చొనేందుకు స్థలం చాలదు. కనుక మువ్వురమూ నిలుచునే భగవద్గుణానందాన్ని పొందుదాం– అని ముగ్గురు నిలిచారు.

తిరుక్కోవలూరు ఆలయంలో ఉన్న పెరుమాళ్లు ఈ ముగ్గురినీ పరీక్షించాలని అనుకున్నాడు. వెంటనే తాను నాలుగవ వ్యక్తిగా మారి, వారి మధ్యకు వచ్చి హరిగానం చేశాడు. ఆ కొత్త వ్యక్తి ఎవరని తెలుసుకోవడానికి ఆరాట పడుతూ భగవంతుని కీర్తించసాగారు. అపారకరుణామయుడైన శ్రీమన్నారాయణుడు తన అప్రాకృత దివ్యమంగళమూర్తితో ముగ్గురికీ దర్శనమిచ్చాడు. ఆ ముగ్గురూ దేవదేవునికి ప్రణతులు చేసి వేదాంతసూక్తులతో, కవితావైభవంతో పెరుమాళ్లను సన్నుతించారు.

నాలాయిర దివ్యప్రబంధాలకు నాందీవాక్యాలుగ కవితా దీపాలను వెలిగించారు. ఇవి మామూలు దీపాలు కాదు. వారి దివ్యప్రబంధాలతో రచించిన ఆధ్యాత్మిక దివ్యజ్యోతులు.

మొదటి పొయ్‌గై ఆళ్వారు వెలిగించిన కవితాదీపం ఇలా భావకిరణాలను వెదజల్లుతోంది. ఆ భావం– "భూమిని ప్రమిదగా చేసి, సముద్రజలాన్ని నేయిగా అందులో ఉంచి, ఉష్ణ కిరణుడైన సూర్యుణ్ణి వత్తిగా చేసి, తయారు చేసిన దీపంతో

**"మీ ఉరఃస్థలాన లక్ష్మీ అమ్మవారినీ చూశాను.**
**సుందరమైన మీ తిరుమేను చూశాను.**
**సూర్యునిలా ప్రకాశవంతంగా ఉండే మీ రూపాన్నీ**
**దర్శించగలిగాను. సుందరసుదర్శన చక్రాన్నీ,**
**శంఖాన్నీ మీ చేతుల్లో చూశాను.**
**సముద్రవర్ణుడవగు ఓ శ్రీమన్నారాయణా!**
**ఇవన్నీ దర్శించాను."**

స్వామివారిని అర్చిస్తాను. సుదర్శన చక్రపాణి అయిన శ్రీమన్నారాయణుని పాదకమలాలదగ్గర ఈ వాఙ్మాలను భక్తితో సమర్పించడం తప్ప నేనేమి చేయగలను."

ఇక రెండవవారైన పూదత్తాళ్వారు ఇలా కవితాజ్యోతిని వెలిగించారు–

"భక్తిని ప్రమిదగా, ఆర్తిని నేయిగా, భగవద్దర్శనంవల్ల కలిగిన ఆనందాన్ని వత్తిగా చేసి అజ్ఞానాంధకారం దూర మయ్యేలా 'పరభక్తి' అనే ఉజ్జ్వల దీపాన్ని నిండు మనస్సుతో కమలాక్షునికి అర్పించి, అర్చిస్తున్నాను."

ఇక మూడవవారైన పేయాళ్వారు శ్రీహరిసౌందర్య దర్శన కవితావైభవ దీపం ఇలా వెలిగించాడు.

"మీ ఉరఃస్థలాన లక్ష్మీ అమ్మవారినీ చూశాను. సుందరమైన మీ తిరుమేను చూశాను. సూర్యునిలా ప్రకాశవంతంగా ఉండే మీ రూపాన్నీ దర్శించగలిగాను. సుందరసుదర్శన చక్రాన్నీ, శంఖాన్నీ మీ చేతుల్లో చూశాను. సముద్రవర్ణుడవగు ఓ శ్రీమన్నారాయణా! ఇవన్నీ దర్శించాను."

ఇలా ముగ్గురు ఆళ్వారులూ మూడు దివ్య ప్రబంధాలలో కవితాజ్యోతులను వెలిగించి పెరుమాళ్లకు సమర్పించారు.

వీరు పరస్పరం వారి వారి ఊర్ల పేర్లు కానీ, కులాల పేర్లు కానీ, తదితర వివరాలు కానీ తెలుసుకోలేదు. ప్రేమ పూర్వకంగా పలుకరించుకున్నారు. హరిభక్తులయితే చాలు అని ముగ్గురూ కలుసుకున్నారు, భగవద్గుణ గానం చేశారు. అన్నిటికన్నా భగవదభిరుచి ప్రధానమని తెలియజేస్తుంది ఈ ముగ్గురు ఆళ్వారుల కలయిక.

***'ఆళ్వార్ తిరువడిగలే శరణమ్'***

# సర్వపుణ్యముల ఫలం- కార్తిక పున్నమి

**నవంబర్ 5న కార్తికపౌర్ణమి సందర్భంగా...**

– శ్రీమతి పి. రమాదేవి



**మ**న హైందవ విశిష్ట సంస్కృతికి మకుటాయ మానమైన మాసం **'కార్తిక మాసం'**. శివకేశవులు ఇద్దరికీ ప్రీతిపాత్రమైన మనోజ్ఞమైన మాసమే కార్తికమాసం. సర్వశుభంకరమైన ఈ కార్తికపున్నమి రోజున నిష్కల్మషబుద్ధితో హరిని గానీ, హరుణ్ణి గాని సేవించిన భక్తులకు, ముముక్షులకు శుభాల వెన్నెల కురుస్తుందని స్కాందపురాణం చెబుతోంది.

హరిహర స్వరూపమైన ఈ కార్తికమాసం కైవల్య ప్రదమైంది. జన్మజన్మల పాపాల్ని పటాపంచలు చేసి మానవులకు మోక్షాన్ని ప్రసాదించే ఈ మాసంలో మహిమాన్వితమైన రోజు **కార్తికపౌర్ణమి**. స్త్రీలు సౌభాగ్యత కోసం ఈ మాసంలో కార్తికపున్నమి నోము నోచడం, కార్తికపున్నమి రోజున కుటుంబంతో కలిసి సత్యనారాయణస్వామి వ్రతాదులు ఆచరించడం పరిపాటి. ఈ మాసంలో ఏ దిక్కున తిరిగి నమస్కారం ఆచరించినా, అది పవిత్రమై హరిహరాదులకు చేరుతుంది.

## కార్తిక స్నానం...!

కార్తికమాసంలో పౌర్ణమినాడు చంద్రుడు కృత్తికా నక్షత్రంలో ఉండడం చేత ఈ నెలకు **'కార్తికం'** అనే పేరు వచ్చింది. ఈ పౌర్ణమికి **'త్రిపురపూర్ణిమ'** అనే పేరు కూడా ఉంది. ఎందుకంటే తారకాసురుని కుమారులైన తారకాక్షుడు, కమలాక్షుడు, విద్యున్మాలి అనే త్రిపురాసురులను శివుడు అంతమొందించి, లోకరక్షణ కావించిన రోజు కనుక కార్తికపూర్ణిమకు 'త్రిపురపూర్ణిమ' అనే పేరు ఏర్పడినట్లు పురాణ కథనం.

'కార్తిక పౌర్ణమి' అనగానే సముద్రస్నానం చేయడం ఒక విశిష్ట లక్షణం, ఏడాదిలో శ్రావణం, కార్తికం, మాఘం, వైశాఖ మాసాల్లో వచ్చే పౌర్ణమి రోజున మాత్రం తప్పక సముద్ర స్నానం చెయ్యాలని వేదప్రమాణం. సముద్ర స్నానం చేయటం వల్ల సమస్త చర్మవ్యాధులు నశించిపోతాయి. చెరువులు, దిగుడు బావులు, పిల్లకాలువలు అన్నింటా శ్రీమహావిష్ణువు నివసిస్తాడని పురాణప్రవచనం. ఈ పున్నమి రోజున చేసే స్నానం, దీపా



రాధన, ఉపవాసంలాంటి అన్నింటిలోనూ ఆరోగ్య, ఆధ్యాత్మిక భావనలు అంతర్లీనంగా ఉన్నాయి.

## కార్తిక సోమవారం వ్రతం

సోమవారం రోజు పూర్తిగా పగలంతా ఉపవాసం ఉండి ప్రదోషసమయంలో అంటే సాయంత్రం వేళ అభిషేకాలు, అర్చనలు చేసి తులసితీర్థం స్వీకరించి, మరుసటిరోజు తిరిగి పూజ చేసి నైవేద్యం సమర్పించి ఉపవాస దీక్షను విరమించాలి. ఈ విధంగా కార్తిక సోమవారాలు వ్రతం చేయాలి. ఇది చేయలేనివారు **'నక్త'వ్రతం** పాటించాలి.

## 'నక్త' వ్రతం అంటే...

కార్తికమాసంలోని సోమవారాల్లోనూ, పూర్ణిమనాడు మొత్తం ఐదురోజులు ఉపవాసం ఉండాలని వాయుపురాణం వివరించింది. ఈ రోజుల్లో తెల్లవారుజామునే నిద్రలేచి కాల కృత్యాలు తీర్చుకొని తలస్నానం ఆచరించి, ఇష్టదేవత పూజ చేసిన అనంతరం ప్రదోషసమయం వరకు ఉపవాసంతో దైవస్మరణతో గడపాలి. ప్రదోషకాలంలో శివుణ్ణి పూజించి, నైవేద్యాన్ని సమర్పించి, నక్షత్రోదయమైన తరువాత ఉపవాసదీక్షను విరమించి శివప్రసాదాన్ని స్వీకరించాలి. దీన్నే **'నక్తవ్రతం'** అని అంటారు.

## కార్తిక దీపం...!!

కార్తికమాసంలో ఆచరించే మరొక ముఖ్య సంప్రదాయం **'దీపారాధన'**. కార్తికమాసంలో పెట్టే ఆకాశదీపాలు మానవ హృదయాకాశంలో వెలిగే పరబ్రహ్మజ్యోతికి ప్రతీకలు. కార్తికమాసంలో శ్రీకృష్ణుని ఆరాధించడం కూడా బహుశ్రేష్ఠ



మైనది. తులసిసన్నిధిలో దీపాలు పెట్టడం, తులసిమాలను ధరించడం, గోవర్ధనపూజ, గోపూజ చేయడం శ్రీకృష్ణభగవానుని ఆరాధనలో భాగమే. ఇట్టి ఆరాధన భక్తిశ్రద్ధలతో చేసినవారు విష్ణుసాయుజ్యం పొందుతారని శాస్త్రవచనం.

## దీపదానం ఫలితం

సర్వజ్ఞానప్రదం దీపం సర్వసంపత్సుఖావహం।
దీపదానం ప్రదాస్యామి శాంతిరస్తు సదా మమ॥

అనగా సర్వవిధాలైన జ్ఞానాన్ని అందించి సకలసంపదలను కలుగజేసేటువంటిది, చీకట్లను పారద్రోలి వెలుగురేఖలను



నింపేదియైన దీపాన్ని నేను దానం ఇస్తున్నాను. ఈ దీపదానంతో నాకు సంపూర్ణక్షేమం కలుగుగాక! అని పై శ్లోకార్థం. ఈ కార్తికపున్నమి రోజున పై శ్లోకాన్ని చదువుతూ దీపాన్ని దానం చేయాలి.

## కార్తిక వనభోజనాలు..!

కార్తికంలో వనభోజనాలు చేయడం అత్యంత పుణ్యప్రదం. ముఖ్యంగా కార్తికమాసంలో ఏదో ఒకనాడు ఈ వనభోజనానికి వెళ్లాలి. ముందుగా ఉసిరికచెట్టును, ఉసిరికచెట్టు కింద సాలగ్రామాన్ని ఉంచి పూజించి నైవేద్యం చేయాలి. తరువాత ఆ నైవేద్యం వనానికి వచ్చినవారంతా స్వీకరించి, తోటలోనే భోజనం చేయాలి.

## భగినీహస్తభోజనం...!!



కార్తికశుద్ధ తదియను సోదరీ తృతీయగా పేరు పొందింది. అంటే ఈ రోజున సోదరి సోదరుని గౌరవిస్తుంది. సోదరుడు సోదరిని గౌరవిస్తాడు. అందుచేత ఇది సోదరీ తృతీయ అని అయ్యింది. తన సోదరిచేత భగినీహస్త భోజనం (భోజనం ఆరగించడం) ఈరోజు ప్రత్యేకత. కుటుంబ వ్యవస్థ బలోపేతం అవుతుంది. దీనిని **'యమద్వితీయ'** అని కూడా పిలుస్తారు. ఈ తిథి రోజున యమధర్మరాజు తన సోదరి అయిన 'యమి' వండిన భోజనాన్ని ఆరగించాడట.

## జ్వాలాతోరణం సర్వపాపహరణం

ఈ కార్తికపున్నమి రోజున దేవతలు, రాక్షసులు కలిసి పాలసముద్రాన్ని చిలకగా ముందుగా హాలాహలం పుట్టింది. దానిని శివుడు సేవించవలసి వచ్చింది. అప్పుడు పార్వతీదేవి – "ఈ హాలాహలభక్షణంతో నా భర్తకు ఎటువంటి ఆపద కలగకపోతే తన భర్తతో కలిసి జ్వాలాతోరణం కింద మూడుసార్లు అటు ఇటు తిరుగుతానని" మొక్కుకుంది. ఆ విధంగా కార్తిక పున్నమి రోజున పార్వతీపరమేశ్వరులు కలిసి జ్వాలాతోరణం కింద తిరిగి మొక్కు తీర్చుకున్నారు. ఆనాటి నుండి సంప్రదాయ



బద్ధంగా దేవాలయాల్లో ఈ జ్వాలాతోరణాన్ని ఏర్పాటు చేస్తారు. భక్తులు ఆ జ్వాలాతోరణం క్రింద మొక్కులు తీర్చుకొని పునీతులు అవుతారు. శివుడు అగ్నిస్వరూపం కాబట్టి ఇలా జ్వాలరూపంలో కానీ, దీపరూపంలోనూ ఆయనను కొలవడం ఆచారంగా వచ్చింది. ఇది కాకుండా ఈరోజు అనేక వ్రతాలు, పూజలు, నోములు ఆచరిస్తారు. వీటితో పాటు లక్షబిల్వార్చన, లక్ష ప్రదక్షిణ, లక్షవత్తుల్ని వెలిగించడంవంటి పూజలు చేస్తారు. 'వెల సులభము, ఫలమధికమూ' అయినది ఈ కార్తిక పున్నమి వ్రతం కోరిన కోరికలు నెరవేర్చుతుంది.

*॥ సర్వేజనా స్సుఖినో భవన్తు ॥*

# గురుశిష్య సంబంధం

**- విశ్వనాథ రమ**



మనిషి ఏ రంగంలోనైనా, ఏ వృత్తిలోనైనా రాణించాలనుకుంటే అందులో ప్రావీణ్యం కలిగిన వ్యక్తి సాయం అవసరం. కలం పట్టినా, హలం పట్టినా అందులో నేర్పరి అయిన వ్యక్తి దగ్గర మెలకువలు నేర్చినప్పుడే తాను ఎంచుకున్న రంగంలో రాణిస్తాడు. అలాగే లౌకిక, అలౌకిక మార్గాల్లో... దేనిలోనైనా మనిషి ఎదగాలనుకున్నప్పుడు సద్గురువు సహాయం తప్పనిసరి. చంద్రగుప్తుడి వెనక చాణక్యుడిలా, వివేకానందుడి వెనక రామకృష్ణ పరమహంసలా... గురువు ప్రభావం మనిషి జీవితంమీద ఎంతగానో ఉంటుంది. జీవితానికి వెలుగు చూపే వ్యక్తి గురువు. రాయిని శిల్పంగా మలచడంలో కళాకారుడి నైపుణ్యం ఎంత ఉంటుందో, ఒక వ్యక్తికి విద్యాబుద్ధులు నేర్పి సమాజంలో ఉన్నతవ్యక్తిగా తీర్చిదిద్దడంలో గురువు ప్రాధాన్యం అంతే ఉంటుంది. గురువు బోధనలు తనకు విజయం చేకూరుస్తాయనే అచంచల విశ్వాసం శిష్యుడికి ఉండాలి. అతడు ఎప్పుడూ కొన్ని నీతినియమాలను పాటించాలి. గురువుల సమక్షంలో వినయవిధేయతలతో మెలగాలి. తాను విద్యార్థిననే విషయం ఎప్పుడూ మర్చిపోకూడదు. కొందరు శిష్యులు గురువులతో వితండవాదం చేసి తమ ఆధిక్యాన్ని ప్రదర్శించాలనుకుంటారు. అది తప్పు. ముఖ్యంగా శిష్యత్వం కోరేవారికి జ్ఞానతృష్ణ, వినయశీలత ఉండాలి.

సీతాకోకచిలుక అనేక పూలపై వాలి తేనె సేకరిస్తుంది. తేనెటీగ ఒక్క పువ్వు మకరందంతో తృప్తిస్తుంది. అలాగే జ్ఞానార్థి అయిన శిష్యుడు ఒక గురువుతో తృప్తిపడడు. తన జ్ఞానతృష్ణ తీరేవరకు గురువుల్ని అన్వేషిస్తూనే ఉంటాడు. చివరకు ఒక సిద్ధగురువు దగ్గర స్థిరపడతాడు. అందుకే *"వడపోసి నీళ్లు తాగాలి, పరీక్షించి గురువులను ఎన్నుకోవాలని"* లోకోక్తి. రామకృష్ణ పరమహంసను బాగా పరీక్షించిన తరవాతే గురువుగా స్వీకరించి ప్రణమిల్లారు వివేకానంద.

శంకరాచార్యుల శిష్యుడైన తోటకాచార్యులు ఒకసారి స్వాధ్యాయానికి రావడం ఆలస్యమైంది. ఇతర శిష్యులు ఆయనను జడబుద్ధి కలవాడని హేళన చేయసాగారు. అది గమనించిన శంకరాచార్యులవారు తోటకాచార్యులకు ఆశీర్వాదమివ్వగా ఆయన అత్యంత కఠినమైన తోటకచ్ఛందస్సులో గురుస్తుతి చేశారు. శిష్యులు ఆశ్చర్యచకితులయ్యారు. ఆ తోటకాచార్యులే గురువు ఆజ్ఞతో 'శ్రుతిసార సముద్ధరణము' లేదా 'తోటకము' అనే గ్రంథాన్ని రచించారు. సాధారణంగా మొక్కకు నీరుపోసి అది ఎదగడానికి అవసరమైనవన్నీ సమకూరుస్తాం. కానీ ఎదిగి ఆకులు తొడగడం, పూలు పండ్లు ఇవ్వడం మొక్క స్వయంగా చేయాల్సిందే. అలాగే గురువు శిష్యుడికి అన్ని విధాలా చేయూతనిస్తాడు. శిష్యుడు కూడా ఏకాగ్రచిత్తంతో స్వీయ ఉన్నతికి శ్రమించాలి.

పరమశివుడు పార్వతీదేవికి 'గురుగీత' బోధించి **'ఆది గురువు'**గా నిలిచాడు. కురుక్షేత్ర సంగ్రామంలో శ్రీకృష్ణుడు అర్జునుడికి గీతోపదేశం చేసి **'జగద్గురువు'** అయ్యాడు. అందుకే యుగాలు మారినా, సద్గురువు ఎల్లప్పుడూ శిష్యుడికి మార్గదర్శకుడే, దైవసమానుడే.



గురువు ప్రభావం మనిషి జీవితంపై ఎంతగానో ఉంటుంది

108 దివ్యదేశాలు

## నవతిరుపతులు - 4

# తిరుక్కుళంద్రై

- ఆచార్య చక్రవర్తి రంగనాథన్, 94409 19186

తిరునల్వేలి నుండి తిరుచ్చెందూర్ వెళ్ళేటువంటి మార్గంలో శ్రీవైకుంఠ దివ్యదేశం నుండి 10 కి.మీల దూరంలో తామ్రపర్ణినదీతీరంలో పెరుంకొళమ్, ఆళ్వార్‌నగర్, బాలికా వనం, తటాకవనం అనేటువంటి పేర్లలో విలసిల్లుచున్నటువంటి దివ్యక్షేత్రం **'తిరుక్కుళంద్రై'** అనే దివ్యదేశం. అద్భుతమైన ప్రాకారంతో ప్రకృతి రామణీయకతతో ఈ దివ్యదేశం విలసిల్లి ఉన్నది. ఈ దివ్యదేశానికి **'పెరుంకొళమ్, పెరుమాళ్‌కోవిల్'** అని భక్తులంతా ఎంతో ఆదరంతో, అభిమానంతో పిలిచేవారు. ఈ క్షేత్రంలో మూలమూర్తి **శ్రీనివాసుడి**గా నిలుచున్న భంగిమలో, అలాగే **'అలిమేలుమంగై'**, **'కుళందవల్లితాయార్'** అనే దేవేరులు భగవంతునితోపాటు వేంచేసి ఉండి భక్తులని అనుగ్రహిస్తూ ఉన్నారు.

ఈ స్థలంలో అమ్మవారికి ప్రత్యేక సన్నిధి లేదు. ఉత్సవ మూర్తి ఉభయదేవేర్లతో అలాగే శ్రీవిల్లిపుత్తూరులో ఉన్న విధంగా గరుడాళ్వార్ల ఉత్సవర్లతో **'మాయక్కూత్తన్ పెరుమాళ్'** అనే అద్భుతమైన దివ్యనామంలో పిలువబడుతూ భక్తులని అను గ్రహిస్తూ ఉన్నాడు. ఆనందనిలయవిమానం, బృహత్ తటాక తీర్థం ఈ క్షేత్రంలో కలవు. దేవగురువైన బృహస్పతి ఈ దివ్యదేశంలో తపస్సు చేసి భగవంతుని యొక్క అనుగ్రహాన్ని పొందినట్లు పురాణం చెబుతున్నది. వేదాలని అభ్యసించడం మాత్రం కాదు, వేదాలలో చెప్పబడి నటువంటి ధర్మాలను నిర్వర్తించడమే చాలా ముఖ్యమని బృహస్పతికి ఈ దివ్యదేశ మూర్తి ఉపదేశించినట్లు మనకు తెలియవస్తున్నది.

### స్థలపురాణం

నమ్మాళ్వారులు నాయికాభావంతో ఈ స్వామిని స్మరించి తరించారు. పురాణకాలంలో తటాకవనం అని ఈ దివ్యదేశాన్ని పిలిచేవారు. వేదసారుడనే భాగవతోత్తముడు కుముదవల్లితో పాటు నివసిస్తూ ఉండేవారు. వీరివురు కూడా శ్రియఃపతియొక్క దివ్యపాదారవిందములయందు అచంచలమైన భక్తివిశ్వాసాలు కలవారు. కానీ చిరకాలంగా వారికి సంతానం లేకుండాపోయినది. ఈ కొరతను తీర్చవలెనని ఆ దంపతులు ఈ తిరుక్కుళంద్రైస్వామిని స్మరిస్తూ, ఈ తటాకంలో స్నాన మాచరించి ప్రతిరోజూ కూడా ఆ స్వామిని కొలుస్తూ వస్తుండే వారు. భగవంతుడు కూడా వారిరువురి యొక్క భక్తికి మెచ్చి ఒక శుభముహూర్తంలో వాళ్ళకి చక్కటి కుమార్తెని ప్రసాదిం చారు. మిక్కిలి సంతోషించినటువంటి ఆ దంపతులు ఆ అమ్మాయికి కమలావతి అని నామకరణం చేశారు. కాలం తర్వాత యుక్తవయస్కురాలైనటువంటి ఆ అమ్మాయికి పెళ్ళి చేయాలి అని సంకల్పించి వరుని కొరకు అన్వేషిస్తూ ఉన్నారు. తల్లిదండ్రుల ఈ నిర్ణయాన్ని తిరస్కరించకుండా కమలావతి ఒకే ఒక నిబంధనను తెలియజేసింది. "మానవమాత్రుల నెవ్వరిని కూడా నేను వివాహం చేసుకోను. శ్రీమన్నారాయణునే నేను నా యొక్క భర్తగా పొందాలి. అతనితో వివాహం జరిపించండి" అని వేడుకున్నది. అలా చెప్పిన వెంటనే ఆ దంపతులు ఏంచేయాలో దిక్కుతోచని స్థితిలో ఉండగా, కమలావతి ఏ పరమాత్ముడైన శ్రీమన్నారాయణుని వేడుకుని మీరు నన్ను కుమార్తెగా పొందారో, అదే ప్రకారం నేను కూడా తపస్సు చేసి





ఆ భగవంతునికి ధర్మపత్నిగా వెళ్తాను అని దృఢంగా చెప్పి దీర్ఘ తపస్సు చేసినది. నారాయణుని నామమే దారకపోషక భోగ్యములుగా భావించింది. కమలావతి యొక్క అచంచలమైన భక్తివిశ్వాసాలకు భగవంతుడు సాక్షాత్కరించి ఆవిడ తపస్సుకు కారణమేమిటి అని తెలుసుకున్నాడు.

తరువాత దేవదేవుడు తాను ధరించినటువంటి కౌస్తుభ మాలను చూచి ఆ మాలతో "నీకు సహాయంగా నా వక్షః స్థలంలో అలంకరించుకోవడానికై ఒక భక్తురాలు రాబోతున్నది. ఆవిడను నీలాగే నేను నా యొక్క వక్షఃస్థలంలో అలంకరించుకో బోతున్నాను" అని భగవంతుడు చెప్పిన తరువాత కౌస్తుభమణి మాల కూడా ఆ కమలావతిని ఆహ్వానించి అదే ప్రకారం స్వామివారి యొక్క వక్షఃస్థలంలో అలంకరింపజేసెను. తల్లి దండ్రులుకూడ చాలా సంతోషపడిరి.

చాలాకాలం తరువాత భగవంతునికి అశ్మసారుడు అనే ఒక రాక్షసుడు వేదసారుని భార్య అయిన కుముదవల్లిని అపహరించెను. దీని వలన ధర్మపత్నితో పాటు చేయవలసినటు వంటి భగవంతుని యొక్క కైంకర్యాలన్నీ కూడా ఆ రాక్షసుని వల్ల అన్నీ నిలిచిపోయాయని మిక్కిలి దుఃఖపడ్డాడు వేదసారుడు. తిరిగి శ్రీమన్నారాయణుడినే శరణాగతి చేశాడు. తన ధర్మపత్నిని ఎలాగైనా మీరు రక్షించి నన్ను కాపాడాలి అని తమిళ "తై" నెలలో పుష్యమినక్షత్రంలో పౌర్ణమితిథిలో తిరుక్కుళందై భగ వంతునికి అభిషేకం చేసి వేదసారుడు మిక్కిలి భక్తివిశ్వాసాలతో ప్రార్థించ, వెంటనే దేవదేవుడు గరుడారూఢుడై ఆ అసురుని యొక్క వాసం తెలుసుకుని కుముదవల్లిని అక్కడినుండి తీసుకు వచ్చి వేదసారుడికి అప్పగించడం జరిగినది.

| | | |
|---|---|---|
| మూలమూర్తి | : | శ్రీనివాసుడు |
| ఉత్సవర్లు | : | మాయక్కూత్తన్ |
| అమ్మవార్లు | : | అలిమేలుమంగై, కుళందవల్లితాయార్ |
| తీర్థాలు | : | పెరుంకుళ తీర్థం, బృహత్ తటాకతీర్థం. |
| ప్రత్యక్షం | : | వేదసారుడు, బృహస్పతి, కుముదవల్లి, కమలావతి |
| విమానం | : | ఆనందనిలయవిమానం |
| మంగళాశాసనం | : | నమ్మాళ్వార్లు |
| ఆగమం | : | వైఖానసఆగమం |

తనులేకపోయినప్పుడు భగవంతుడు తనచోటికే వచ్చి తాను అపహరించినటువంటి ఆ కుముదవల్లిని భగవంతుడు తీసుకునిపోయాడు అని మిక్కిలి కోపించినటువంటి ఆ అశ్మసారుడు వెంటనే ఈ తిరుక్కుళందై వచ్చి భగవంతునితో పోరాటం ప్రారంభించాడు. భగవంతుడు కూడా తన ఆశ్రితులకు జరిగేటువంటి ఈ దుఃఖాన్ని చూచి ఆ అసురుని యొక్క కాళ్ళను పట్టుకుని నేలలో బాది, అతని పైన నాట్యం చేశాడట. మాయావి అయినటువంటి రాక్షసుణ్ణి పడగొట్టి అతనిపైనే నాట్యం చేసినటువంటి భగవంతుడు కనుక ఇతను 'మాయ క్కూత్తన్' అని నామాన్ని పొందాడు. 'మాయక్కూత్తన్' అంటే ఆ మాయావి అయిన రాక్షసునిపైన నాట్యం చేసినవాడు అని అర్థం. సంస్కృతంలో 'చోరనృత్యః' అని వ్యవహరిస్తారు. భక్తుడైనటు వంటి వేదసారుని యొక్క సకలదుఃఖాలని కూడా భగవంతుడు పోగొట్టేటువంటి సందర్భంలో అతని పక్కన గరుడుడు ఉండి సహాయం చేశాడు. కనుక గర్భగృహంలోనే అర్చారూపిగా గరుడుణ్ణి భగవంతుడు స్వీకరించాడు అని స్థలపురాణం.

కనుక ప్రతి ఒక్కరూ కూడా ఈ తిరుక్కుళందైస్వామిని దర్శించుకొని సకలపాపముల నుండి విముక్తిని పొంది అంతిమంగా భగవత్పాదారవిందాలని ఆశ్రయించి తరించాలి.

శ్రీమత్కుళంద నగరే తు పెరుంకొళాఖ్య
తీర్థే కుళంద లతికా నయనాబ్జ భృంగః।
ప్రాగాసన స్థితిరసౌ గురుసేవితాంగః
శ్రీమత్పరాంకుశ మునీంద్ర పరిస్తుతాత్మా॥



తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారి లక్షకుంకుమార్చన
(16-11-2025)

# 24-09-2025 నుండి 02-10-2025 వరకు జరిగిన తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవ వాహనాల దృశ్యమాలిక





ఉభయదేవేరులతో శ్రీ ఉగ్రశ్రీనివాసమూర్తి
(ఉత్సవమూర్తి తిరుమల)
కైశికద్వాదశి (02-11-2025)

# కైశికద్వాదశి (క్షీరాబ్ధిద్వాదశి)

- డా॥ లంక వేంకట సుబ్రహ్మణ్యేశ్వర శర్మ, 9951374024

**ఈ వ్రతకథ బ్రహ్మవైవర్త పురాణంలో, స్మృతి కౌస్తుభములో ఉన్నది. ఈ వ్రత మహిమ వ్యాసుడు ధర్మరాజుకు చెప్పాడు. కైశికద్వాదశిని 'క్షీరాబ్ధిద్వాదశి' అని కూడా అంటారు. ఈ ద్వాదశి వ్రతకథ ప్రకారం, ధర్మరాజు తన సోదరులతో కలిసి అడవిలో ఉన్నప్పుడు వ్యాసమహర్షికి పూజచేసి, మనుషుల కోరికలు ఎలా నెరవేరుతాయని అడిగారు. అప్పుడు వ్యాస మహర్షి క్షీరాబ్ధిద్వాదశి రోజున తులసికి పూజ చేస్తే ఎంతో పుణ్యం లభిస్తుందని, తులసికథను వింటే పునర్జన్మ ఉండదని ధర్మరాజుకి వివరించారు. ఈ ద్వాదశికి సంబంధించిన వ్రతకథలో... శ్రీమహావిష్ణువు మరియు తులసి యొక్క గొప్పదనం గురించి చెప్పబడింది.**



## వ్రత విధానము

(1)సంకల్పము (2)కలశారాధన (3)గణపతి పూజ (4)తులసీధాత్రీసహిత లక్ష్మీనారాయణస్వామి పూజ.

ఈ పూజయందు ఒక లక్ష్మీనారాయణ ప్రతిమను (రాగి మొదలగు లోహములతో చేయబడిన ప్రతిమను) తులసికోటయందు పెట్టి, షోడశోపచారములు అనగా- ధ్యానము, ఆవాహనము, సింహాసనము, స్థిరాసనము, పాద్యము, అర్ఘ్యము, ఆచమనీయము, మధుపర్కము, శుద్ధోదకస్నానము, కటిసూత్రము, కౌపీనము, వస్త్రయుగ్మము, ఉత్తరీయము, యజ్ఞోపవీతము, ఆభరణాలు, దివ్యశ్రీ చందనము మొదలైన వాటితో పూజ చేయాలి. ఈ షోడశోపచారపూజ అయిన తరువాత వ్రతకథ చదవాలి, వినాలి.

పూర్వము ధర్మరాజు రాజ్యము పోగొట్టుకొని తమ్ములతో కూడి ద్వైతవనమందు ఉండగా, అచ్చటికి అనేక ఋషులతో కూడి వ్యాసులవారు వచ్చిరి. అట్లు వచ్చిన వ్యాసుని చూచి ధర్మరాజు తగుపూజలు చేసి, కూర్చుండబెట్టి ఆయనతో 'స్వామీ! మీరు అన్ని ధర్మములను ఉపదేశించదగిన మహానుభావులు, మీకు తెలియని ధర్మసూక్ష్మములు లేవు. మనుష్యులకు అన్ని కోర్కెలు ఏ ఉపాయము చేత సిద్ధించునో సెలవియ్యండి', అని అడుగగా, వ్యాసుడు 'నాయనా! మంచి ప్రశ్న వేసినావు. ఈ విషయమునే పూర్వం నారదమహాముని బ్రహ్మను అడుగగా, ఆతడు సర్వకామప్రదము లగు రెండు వ్రతములు చెప్పినాడు.

**'క్షీరాబ్ధిద్వాదశీవ్రతము', 'క్షీరాబ్ధిశయనవ్రతము'** అను నా రెండు వ్రతములలో క్షీరాబ్ధిద్వాదశీవ్రతమును నీకు వివరిస్తాను.

'కార్తికశుక్ల ద్వాదశిరోజు ప్రొద్దుపొడిచిన తర్వాత పాలసముద్రమునుండి లేచి మహావిష్ణువు సమస్తదేవతలు, మునులు, లక్ష్మితో కలసి బృందావనమునకు వచ్చి, ఒక

ప్రతిజ్ఞ చేసినాడు. ఏమనగా 'ఏ మానవుడైనను ఈ కార్తికశుద్ధ ద్వాదశి నాటి కాలమున బృందావనమున వేంచేసియున్న నన్ను లక్ష్మీదేవితో కూడ పూజించి, తులసిపూజ చేసి, తులసికథను విని భక్తితో దీపదానము చేయునో, వాడు చేసిన పాపాలు పోయి నా సాయుజ్యమును పొందును.' అని శపథము చేసినాడు. కావున నీవును పుణ్యకరమైన ఆ వ్రతమును చేయుము' అని వ్యాసుడు చెప్పగా, విని ధర్మరాజు 'స్వామి! ఈ వ్రతము చేయవలసిన విధాన మెట్టిదో' నాకు జెప్పమని అడుగగా వ్యాసుడు ఈ విధముగా తెలిపెను.

'ధర్మరాజా! ఏకాదశినాడు ఉపవాసము చేసి, ద్వాదశి పారణచేసికొని, సాయంకాలమున మరల స్నానము చేసి, శుచియై తులసికోట దగ్గర చక్కగా శుద్ధి చేసి, ముగ్గులు పెట్టి, పలువిధములగా అలంకరించి తులసీమూల మందు లక్ష్మీసహితుడైన విష్ణువును, తులసిని భక్తితో సర్వోపచారముల తోను పూజించి, నైవేద్యమైన తర్వాత కొబ్బెర, బెల్లము, ఖర్జూరము, అరటిపండ్లు, చెఱకుముక్కలు సమర్పించి, తాంబూలనీరాజనము లొసగి, మంత్రపుష్పముతో పూర్తి చేసి తులసీసహిత లక్ష్మీనారాయణమాహత్మ్యమును, దీపదాన ఫలమును విని అనంతరము పురోహితునకు గంధపుష్ప ఫలాదు లొసగి తృప్తిపరచి వ్రతము పూర్తిచేయవలెను. ఇట్లే మానవుడు చేసినను ఇష్టము గాంచును.' ధర్మరాజు విని దీపదాన మహిమను తెలుపుమని అడుగగా వ్యాసుడు చెప్పు చున్నాడు.

'కార్తికశుద్ధ ద్వాదశినాడు బృందావన సమీపమున దీపదానము చేయవలెను. ఒక దీపదానముచే ఉపపాతకములు పోవును. విష్ణుసారూప్యము కలుగును. భక్తితో ఒక వత్తితో దీపము పెట్టిన బుద్ధిశాలి అగును. నాలుగు వత్తులు వేసి వెలిగించిన రాజు అగును. పది వేసిన విష్ణుసాయుజ్యమును పొందును. వేయి వత్తులు వేసినచో విష్ణురూపుడు అగును. ఇది బృందావనములో చేసిన యెడల కురుక్షేత్రమందు జేసినంత ఫలము కలుగును. దీనికి ఆవునేయి మంచిది. నువ్వులనూనె మధ్యమము, అడవి నూనెలు అధమము. ఆవునేయి జ్ఞానమోక్షములను ఒసగును. నువ్వుల నూనె సంపదను కీర్తిని ఇచ్చును. ఇప్పనూనె భోగప్రదము, అడవినూనె కామ్యార్థప్రదము, అందులో ఆవనూనె మిగుల కోరికలను ఇచ్చును. అవిసెనూనె శత్రుక్షయకారి, ఆముదము ఆయుష్షును నాశనము చేయును. బఱ్ఱె నేయి పూర్వపుణ్యమును తొలగించును. వీనిలో కొంచెమైన ఆవునేయి కలిసిన దోషపరి హారమగును. ఈ దీపదానములవలననే ఇంద్రాదులకు వారి వారి పదవులు దొరకినవి. దీనివలన అనేక మహిమలు కలుగును, ద్వాదశినాడు దీపదానము చేసిన ముక్తిగాంతురు. బృందావనము అందొక మంటపము గట్టి వరుసగా దీప పంక్తులు పెట్టియున్న ఎవడు చూచి ఆనందపడునో వాని పాపములన్నియు నశించును. ఈ దీపదాన మహిమను విన్నవారు చదివినవారు మోక్షప్రాప్తులగుదురు' అని చెప్పగా, విని ధర్మరాజు మహానందమును చెంది తులసీ మాహాత్మ్యమును చెప్పమని కోరగా వ్యాసుడు చెప్పుచున్నాడు.

'కార్తికమాసమందు తులసిపూజ చేయు వారుత్తమ లోకమును పొందుదురు. తులసిమొక్క వేసి పెంచినవారు దానికెన్ని వేళ్ళు పారునో అన్ని మహాయుగములు విష్ణులోక మందు ఉందురు. తులసీదళములు కలిసిన నీట స్నానమాడిన వారు పాపము వదలి వైకుంఠమునకు పోవుదురు. బృందావనము వేసినవారు బ్రహ్మత్వము పొందుదురు. తులసియున్న ఇంటిలో కాపురము చేయుట, తులసితోట వేసి పెంచుట, తులసిపేరులు దాల్చుట, తులసిదళము భక్షించుట పాపహరములు. తులసియున్న చోటునకు యమకింకరులు రారు.

యన్మూలే సర్వపాపాని బ్రహ్మహత్యాదికాని చ।
తత్సన్నిధౌ పునః పాపం కిం జన్మనాపి జాయతే॥

యన్మూలే సర్వతీర్థాని యన్మధ్యే సర్వదేవతాః।
యదగ్రే సర్వవేదాశ్చ తులసి త్వాం నమామ్యహమ్॥

నమస్తులసి కల్యాణి నమో విష్ణుప్రియే శుభే।
నమో మోక్షప్రదే దేవి నమః సంపత్ప్రదాయిని॥

అను మంత్రమును పఠించువారికి ఏ బాధయు అంటదు. యమకింకరులు దగ్గరకు రారు.



ఈ తులసి సేవయందే ఒక పూర్వకథను చెప్పెద, వినుము. "కాశ్మీరదేశవాసులగు హరిమేధ-సుమేధులను ఇద్దరు విప్రులు తీర్థయాత్ర చేస్తుండగా మార్గంలో ఒక తులసి తోటను చూచిరి. చూచినతోడనే వారిలో సుమేధుడు భక్తితో ప్రదక్షిణ నమస్కారములు చేసెను. అది చూచి హరి మేధు డిది యేమని యడిగెను. సుమేధుడు ఇక్కడ ఎండ బాధగా ఉన్నదని ఒక మఱ్ఱిచెట్టు దగ్గరకు జేరి తులసికథ ఇట్లు చెప్పెను. 'పూర్వము దేవాసురులు సముద్రము చిలికినప్పుడు దానియందు ఐరావతము, కల్పవృక్షము మొదలుగా ఎన్నో ఉత్తమ వస్తువులు పుట్టెను. తర్వాత లక్ష్మీదేవి పుట్టెను. తర్వాత అమృతకలశము పుట్టెను. ఆ అమృతకలశమును చేతబూని మహానందమును పొంది విష్ణువు ఆ కలశముపై ఆనందబాష్పములు విడువగా, అందు ఈ తులసి పుట్టినది. ఈ విధంగా పుట్టిన తులసిని, లక్ష్మిని విష్ణువు పరిగ్రహించెను. ఇట్లు పరిగ్రహించి వేడుకతో తులసిని తొడమీద ఉంచుకొని నీవు లోకాలను పావనము జేయగలదానవగుమని పలికెను. అందువలన నేను తులసికి మ్రొక్కినాను- అని ఆ విప్రుడు పలుకుచుండగానే ఆ మఱ్ఱిచెట్టు ఫెళ్ళుమని విరిగి కూలెను. ఆ చెట్టు తొఱ్ఱలోనుండి ఇద్దరు పురుషులు వెలుపలకు వచ్చి దివ్యతేజముతో నిలిచియుండగా, హరిమేధసుమేధులు చూచి దివ్యమంగళ విగ్రహధారులైన మీరెవరిని అడిగిరి?

ఆ పురుషులను మీరే మాకు తల్లిదండ్రులు, గురువులు అని చెప్పి వారిలో జ్యేష్ఠుడు ఇట్లు అనెను. 'నేను దేవలోకవాసిని, నా పేరు ఆస్తికుడు అందురు. నేనొకనాడు అప్సరసలతోగూడి నందనవనమున క్రీడించుచుండగా, మా సందడివలన తపస్స మాధిలో ఉన్న రోమశమహాముని నన్ను చూచి 'నీవు మదోన్మ త్తుడవై ఇట్లు నాకు తపోభంగము కలిగించితివి, కావున బ్రహ్మరాక్షసుడవగుమని శపించి, తప్పు పురుషునిదే గాని స్త్రీలు పరతంత్రలు గనుక వారివలన తప్పు లేదని వారిని క్షమించి విడిచెను. అంతట నేను శాపమునకు భయపడి ఆ మునిని ప్రార్థింపగా, నీవెప్పుడు తులసిమహిమను, విష్ణుప్రభావమును విందువో అప్పుడు, శాపవిముక్తుడవగుదువని అనుగ్రహిం చెను. నేనును బ్రహ్మరాక్షసుడినై ఈ చెట్టు తొఱ్ఱలో జేరి మీ దయవలన నేడు శాపవిమోచనము పొందితిని' అని చెప్పి, రెండవవాని వృత్తాంతము చెప్పసాగెను. 'ఈయన పూర్వ మొక మునికుమారుడు. గురుకులవాసము చేయుచుండినపుడు ఒక అపరాధము వలన బ్రహ్మరాక్షస్సుడవగుమని గురువువలన శాపము పొంది ఇట్లు నాతో కలసియుండెను. మేమిద్దరమును మీదయ వలన పవిత్రులమైతిమి. ఇట్లు మమ్మనుగ్రహించినారు. కావున మీ తీర్థయాత్రాఫలము సిద్ధించినది" అని చెప్పి వారి రువురు అక్కడ నుండి నిష్క్రమింపగా, బ్రాహ్మణులిద్దరూ ఆశ్చర్యానందములతో మునిగి, తులసి మహిమను పొగడుచు యాత్ర ముగించుకొని ఇండ్లకేగిరి. ఈ కథను ఎవరు విన్నను వారు సర్వపాపములు వదలి ఉత్తమగతిని చెందుదురని బ్రహ్మ నారదునకు జెప్పెను" అని వ్యాసుడు చెప్పి 'ధర్మరాజా! ఇట్లు క్షీరాబ్ధివ్రతము చేసి తులసికథ విన్నవారు ఉత్తములగుదురు.'

ఇది బ్రహ్మవైవర్తపురాణమున వ్యాసయుధిష్ఠిర సంవాదమున క్షీరాబ్ధివ్రతకథ సంపూర్ణము.

## 2025, డిసెంబరు నెల ఉత్సవాలు, పర్వదినాలు

**01** గీతాజయంతి

**02** చక్రతీర్థముక్కోటి

**03** హనుమద్వ్రతం

**04** కపిలతీర్థముక్కోటి,
తిరుమంగైఆళ్వార్ శాత్తుమొఱ,
దత్తజయంతి

**05** తిరుప్పాణాళ్వార్ వర్షతిరునక్షత్రం

**16** ధనుర్మాసారంభం

**19** తొండరడిప్పొడిఆళ్వార్ వర్షతిరునక్షత్రం
శ్రీవారిసన్నిధిన అధ్యయనోత్సవ ప్రారంభం, తిరుమల

**30** వైకుంఠఏకాదశి

**31** శ్రీ స్వామిపుష్కరిణీతీర్థముక్కోటి

ధారావాహిక



# మేల్నాడు- రామానుజుల అడుగుజాడలు

ఆంగ్ల మూలం- శ్రీ లక్ష్మీనరసింహన్ శ్రీధర్
తెలుగు- శ్రీదేవీ మురళీధర్
97388 59553

*గత సంచిక తరువాయి భాగం....*

## కృష్ణావతారకాలం

కోసల రాకుమారి సత్యను (సత్యభామ కాదు) శ్రీకృష్ణుడు వివాహం చేసుకున్నప్పుడు ఆమె తన తండ్రిని తాను నిత్యం పూజించే రామప్రియమూర్తిని తనవెంట ద్వారకకు పంపమని వేడుకున్నది. మహారాజు సంతోషంగా సమ్మతించాడు. ఆ విధంగా ఉత్తరదిశలోని అయోధ్యనుంచి రామప్రియమూర్తి పశ్చిమంలోని ద్వారకకు చేరుకున్నది. రాజప్రాసాదంలో ప్రతిష్ఠితమైంది. బలరామదేవుడు పూజాకైంకర్యాలు నిర్వహించగా రామప్రియమూర్తి 'బలరామప్రియ'గా ప్రసిద్ధమైంది. తరువాతి కాలంలో యాదవకులం శాపానికి గురైంది. బలభద్రుడు తిరునారాయణపురానికి విచ్చేసి మూలవరులు ఉన్నా, ఉత్సవమూర్తి లేకపోవటం గమనించి ఆలోచనలో పడ్డాడు. సమీప భవిష్యత్తులో ద్వారక కనుమరుగు అవుతుందని ఆ అవతారపురుషుడికి తెలుసు కాబట్టి రామప్రియ అర్చామూర్తిని ద్వారకనుండి తిరునారాయణపురం తీసుకు వచ్చి ప్రతిష్ఠించాడు. ఆ విధంగా రామప్రియ అర్చామూర్తి శ్రీరామ, శ్రీకృష్ణ, బలరామదేవుల పూజలు యుగాలతరబడి అందుకున్న సనాతనమూర్తి.

ఎంతోకాలం భక్తులు ఆరాధించిన తరువాత యాదవాద్రి పరదేశీయుల ద్వేషాగ్నికి ఇతర హిందూ దేవాలయాల వలెనే ముట్టడికి లోనైంది. శ్రీకరస్వామి ఇలా కొనసాగించారు: "భగవద్రామానుజులు మేల్నాడు చేరుకున్నారు. మనం వారు దర్శించిన క్రమంలోనే యాత్ర చేశాము కదా. రామానుజులు సన్యాసులైన శిష్యులను దిద్దాలని సంకల్పించారు. క్రిమికంఠ చోళుడు శైవేతరులమీద అకృత్యాలు చెయ్యటంచేత రామానుజులు మేల్కొటే చేరవలసివచ్చినా, అది శ్రీవైష్ణవం వ్యాప్తికి ఒక నెపం మాత్రమే. వారి యాత్ర వారి ఉద్దేశానికి సాధనంగా, మేల్నాడు వారి పాదస్పర్శ పొందేటట్లు ఉపకరించింది.

విష్ణువర్ధనరాజు యతిరాజుల ప్రధాన శిష్యుడైనప్పుడు అక్కడి సన్యాసులకు కోపం కలిగింది; కాబట్టి వారు యతిరాజులను వేదాంతచర్చకు సవాలు చేశారు. 1000 మంది సన్యాసులు ఒకేసారి 1000 ప్రశ్నలు అడుగుతారని, రామానుజులు వాటన్నింటికీ సమాధానం చెప్పాలని వారు నిబంధన విధించారు. యతిరాజు అంగీకరించి, తాను తెరమరుగున కూర్చుని సమాధానం ఇస్తానని చెప్పారు. 10 రోజులపాటు చర్చ జరిగింది; కొందరు రామానుజులతో స్పష్టత లేకుండా వాదించారు. అప్పుడు యతిరాజు 'గడ్డం పెంచుకుంటే మోక్షం వస్తే మేకలకు మోక్షం రావాలి; జుత్తు పెంచుకుంటేనే మోక్షం వస్తే సింహానికి మోక్షం రావాలి, మోక్షం పొందడానికి బూడిద పూస్తే, గాడిదలకు మోక్షం రావాలి; ఓపికగా వేచి ఉంటే మోక్షం వచ్చే అవకాశం ఉంటే కొంగలకు మోక్షం రావాలి' అని చెప్పారు. కానీ అందులో కొందరు తమ మొండిపట్టు వదులుకోలేదు. వీళ్ళను ఎలా సంస్కరించాలి అని రామానుజులు చింతించారు. ఈ సంఘటన తొండనూరులో జరిగిందని కొందరు, సాలిగ్రామంలో జరిగిందని కొందరు అభిప్రాయపడ్డారు. ఆ తరువాత ఆచార్య సార్వభౌములు దాశరథిని ఈ సన్యాసులు మంచి నీటిని వాడే సరస్సు ఏదని అడిగినప్పుడు, దాశరథి దగ్గరలో ఒక సరస్సు ఉందని చెప్పాడు.

*(ఇంకా ఉంది)*

మన మహర్షులు

# కణ్వమహర్షి

- సద్గురు డా॥ కె.శివానందమూర్తి.

కశ్యపప్రజాపతి వంశంలో కణ్వుడు పుట్టాడు. చిన్నప్పటినుంచీ ఆయన తపోనిష్ఠలో ఉండి బ్రహ్మచర్యము ఆశ్రయించాడు. సామవేదంలో అనేక మంత్రాలకు ఆయన ద్రష్ట. **'కాణ్వులు', 'కాణ్వశాఖ'** అనేది మనకు ఉంది. దానికి మూల పురుషుడాయన.

ఆయన తపస్సులో ఉంటే, లోపల అంతఃకరణలో సామవేదం దర్శనమిచ్చింది. దీనికి 'నిదానం' ఏమిటి అని అడిగాడట కణ్వుడు. నిదానం అంటే ఏమిటి? ఏది చేయాలి? దీనిని ఏ రూపంలో బహిర్గతం చేయాలి? ఎక్కడ వ్యాప్తి చేయాలి? అనే సందేహం కలిగిందట ఆయనకు. అందుకని బహిర్గతం చేయకుండా లోపల మౌనంగా ఉన్నాడు. ఆయన ఆశ్రమంలో చిన్నచిన్న పశుపక్ష్యాదులు అల్పజీవులు తిరుగుతూ ఉండేవి. అట్లాంటి జీవుల్లో ఒక పిల్లి ఉంది. దానినే చూస్తున్నాడు ఈ భావనతో. అంతలో ఆ పిల్లి తుమ్మింది. దానిని చూసి, "ఓహో! బహిర్గతం చేయమని దీని ఉద్దేశ్యం" అనుకున్నాడట.

తనలో ఉద్బుదమైన సామవేదాన్ని బహిర్గతంచేసి అనేక మంత్రాలకు ద్రష్ట అయ్యాడు కణ్వమహర్షి. అనేక సామ రూపములకు నిదానమును కనిపెట్టి జగజ్జేగీయమాను డయ్యాడు. నిదానమును కనిపెట్టడం అంటే, దానికి వినియోగ మేమిటి? ఎక్కడెక్కడ చేయాలి? వీటన్నిటినీ, వీటికి తగినటు వంటి బ్రాహ్మణములను కూడా ఆయన ప్రసాదించాడట. సామవేదంతోపాటు నిదానాన్ని ప్రసాదించాడు. మంత్రములకు 'వాక' అనిపేరు. అంటే వాక్కు అనే అర్థము ఉండి ఉండవచ్చు. ఎందుకు వాటిని వాడుకోవాలి అను కున్నప్పుడు, వెంటనే దానికి చెందిన వాక్యాలుంటాయి. 'అనువాకాలని' వాటికి పేరు. అంటే వాకము, అను వాకము- ఇట్లాగే ఉంది వేదమంతా! వాకము, అనువాకము రెండూ ఇచ్చినవాడే ఋషి. వాక-అనువాక ములు రెంటినీ అనుసరించి వెంటనే వస్తుంది దానియొక్క వినియోగం.



కణ్వుడు, మాలినీనదీతీరంలో ఒక ఆశ్రమాన్ని నిర్మించుకుని అక్కడ నివసిస్తున్నాడు. ఆయన నాశ్రయించి ఆయన శిష్యకోటి వాళ్ళ సంసారాలతో అనేకమంది ఉండేవాళ్ళు. ఆయనే వాళ్ళందరికీ పోషణకర్త. ఆయన లోకారాధ్యుడయ్యాడు. సహస్రసంఖ్యాకులయిన శిష్యులు ఆయన దగ్గర ఉన్నారు. ఆయన వాళ్ళకు **'కులపతి'** అయ్యాడు. భూత దయలో ఆయనకు మించినవాడులేడని, పరమదయాళువు అని ఆయనకు పేరొచ్చింది.

విశ్వామిత్ర, మేనకల కుమార్తె 'శకుంతల' ఆయన దగ్గరే పెరిగింది. ఆ కథ అంతా మనకు తెలిసిందే! ఆయన స్నానానికి వెళితే, అక్కడ పక్షులు తమ రెక్కలలో నీళ్ళు తీసుకొచ్చి ఆ బిడ్డమీద చల్లుతున్నాయి. ఆ శకుంత పక్షులు ఆ బిడ్డకు నీడపడుతున్నాయి. పూలు తీసుకొచ్చి ఆ బిడ్డ నోట్లో వాటిలోని తేనె పిందుతున్నాయి. ఆ బిడ్డకు ఎవరూ లేరని తీసుకొచ్చి సర్వోత్తమురాలుగా పెంచాడు కణ్వుడు. ఆ తరువాత ఆమెను దుష్యంతుడు వివాహం చేసుకున్నాడు.

గర్భవతిగా ఉన్నప్పుడు ఆమె దుష్యంతుడి దగ్గరికి వెళ్ళింది. అయితే అతడు గుర్తించలేదని, శాపగ్రస్తుడైనాడనీ ఒక కథ ఉంది. మరోకథ ప్రకారం శాపగ్రస్తుడు కాకపోయినా ఆమెను ఆదరించలేదు. కాబట్టి తిరస్కరించబడిన ఆమె మరొక ఆశ్రమానికి వెళ్ళితే అక్కడ భరతుడు పుట్టాడు.

ఆ పుట్టిన పిల్లవాడిని కణ్వుడే పెంచాడు. అతడే భరతుడు. నిర్భ యుడు. చిన్నప్పుడే క్రూరమృగాలతో ఆడుకుంటున్నాడు. తరువాత దుష్యం తుడు కూడా వచ్చి ఆమెను ఏలు కున్నాడు. మనకు మూలపురుషుడు అని భరతుడిని గౌరవిస్తాము.

కణ్వమహర్షి అనేక విషయములలో ధర్మనిష్ఠుడు. కణ్వధర్మశాస్త్రం, స్మృతి చంద్రికలలో అనేక వాక్యాలు పెద్దలు చెపుతున్నారు. యాజ్ఞవల్క్యుడి స్మృతిలో కూడా ఈ ప్రస్తావన ఉంది. మహా త్ముడు, ప్రమాణికుడు కణ్వమహర్షి.

# వేదజ్ఞానం

– శ్రీ కర్లపాలెం హనుమంతరావు

హిందూ ధర్మానికి 'వేదం' ప్రమాణం. రాసింది ఎవరో, ఎప్పుడో వివరాలు తెలియని వాఙ్మయం కాబట్టి వేదాన్ని 'అపౌరుషేయం' అన్నారు. లిపిసౌకర్యం లేని కాలం. ఒకరు చెబితే మరొకరు విని, తిరిగి మననం చేసుకునే ప్రక్రియ మాత్రమే. శ్రుతులూ ఆ విధంగా ఒకతరం నుంచి మరోతరానికి **'స్మృతులు'**గా ప్రసారమయ్యాయి. వేదసంఖ్యలో కొంత వివాదం ఉన్నా, ఇరవయ్యో శతాబ్దం ప్రారంభానికి ముండకోప నిషత్‌వంటి సాధికారిక సాహిత్యం నిర్ధారణతో అవి చతుర్వే దాలుగా స్థిరపడ్డాయి. ఛందస్సు రూపంలో ఉండే ప్రార్థనలు– **ఋగ్వేదము**; పద్యగద్యప్రక్రియలో సాగే యజస్సుల సంగ్రహం– **యజుర్వేదం**; గాన సానుకూలత కలిగిన గేయప్రక్రియ– **సామ వేదం**. కాగా వైజ్ఞానికాంశాల సమాహారంగా **'అథర్వణా'**నికి వేదస్థాయి దక్కింది.

ఇవిగాక ఆయుర్వేదం, ధనుర్వేదం, గాంధర్వం, ఆర్థిక శాస్త్రం ఉపవేదాలుగా; వేదాంగాలు ఆరు– **1)శిక్ష:** వేదమంత్రా లను సరిగ్గా ఉచ్చరించడానికి సహాయపడుతుంది. **2)ఛందస్సు:** వేదాల్లోని ఛందస్సులను (మాత్రలు, గణాలు) వివరిస్తుంది. **3)వ్యాకరణం:** వేదపదాల స్వరూపాన్ని, వాటి అర్థాలను వివరి స్తుంది. **4)నిరుక్తం:** వేదపదాల మూలాన్ని, వాటి అర్థాన్ని విశ్లేషి స్తుంది. **5)జ్యోతిష్యం:** వేదకాలాలను, గ్రహాలను మరియు యజ్ఞాల సమయాలను నిర్ణయించడానికి ఉపయోగపడుతుంది. **6)కల్పం:** యజ్ఞాలు, ఇతర ఆచారాలు నిర్వహించే విధానాలను వివరిస్తుంది. ఈ ఆరూ వేదాంగాలుగా వైదికవాఙ్మయం రూపం సంతరించుకుంది.

వేదాలలోని మంత్రభాగాలను **'సంహితలు'** అంటారు. యజ్ఞయాగాదుల కర్మకాండ వివరణ భాగాలను **'బ్రాహ్మణాలు'** అన్నారు. ఐతరేయం, తైత్తిరీయం, గోపథం, శతపథం ఈ తరహా బ్రాహ్మణాలే. బ్రాహ్మణాలు ప్రస్తావించని కొన్ని విశేషాలు **'ఆరణ్యకాలు'** ప్రస్తావించాయి. జనావాసాలకు దూరంగా కర్మాను ష్ఠానం చేసుకునే యోగుల కోసం ఆరణ్యకాల సృష్టి జరిగింది.

వేదవిజ్ఞానం అనంతమైంది. వేదాలన్నీ కంఠస్థమైన వాడు ఇప్పటివరకు పుట్టలేదన్న విశ్వాసం ఒకటి ప్రచారంలో ఉంది. అధ్యయనానికి ఒక వ్యక్తి జీవితకాలం చాలదన్న ఒక నాటి వాదానికి ఈ సాంకేతికయుగం చెల్లుచీటీ రాసేసింది. గురుశిష్యపరంపరగా సాగిన వైదికజ్ఞానం మధ్య దశల్లో కొంత భాగం నష్టపోయింది. ఉచ్చారణాపరంగా శబ్దానికి **ఉదాత్తం, అనుదాత్తం, స్వరితం** అనే మూడు అవస్థలు ఉన్నాయి. పెంచి ఒక చోట, తగ్గించి ఒక చోట సాగించాల్సిన శబ్ద స్వరోచ్చారణ– జిహ్వపై చేసే కత్తిసామే. స్వరభేదానికి అర్థాన్ని, మంత్ర ప్రభావాన్ని మార్చే శక్తి ఉందని విశ్వసిస్తారు. ఒక అక్షరం పలికే సమయం కూడా లెక్కకు వచ్చే మాత్రా పద్ధతి వల్ల ఉదాత్త, అనుదాత్త, ప్లుత స్థానాల ఎరుక తప్పనిసరి. వేదోచ్చారణ తీరు వివరిస్తూ రాసిన ప్రాతిశాఖ్యం వేదవాఙ్మయంలో ఒక ప్రముఖ గ్రంథం అయింది. 'విద్' అనే సంస్కృత ధాతువు నుండి "వేదం" అనే పదం ఉద్భవించింది, దీని అర్థం "తెలుసు కోవడం" లేదా "జ్ఞానం". 'ఆరోగ్యం ప్రసాదించమనో, సద్బుద్ధి కలిగించమనో, జ్ఞానం అందించమనో చేసుకునే వినతుల్లో ప్రార్థన లందుకుంటున్న దేవతలకు ఉండే విశేషార్థాల ప్రభావమే వేదానికి బలమన్నది' మహర్షుల విజ్ఞుల అభిప్రాయం. మానవ కల్యాణం మనసులో ఉంచుకుని తరాల నుంచి తరాలకు ఈ వేదసంపదను అందిస్తున్న జ్ఞానవంతులకు మనం సర్వదా కృతజ్ఞతాబద్ధులమై ఉందాం.



# ఆచార్యుడు చూపే మార్గం

- శ్రీ సురేశ్ కుమార్ రెడ్డి,
99858 31828

శరీరానికి జన్మనిచ్చే వారిని తల్లిదండ్రులు అని కీర్తిస్తాం. అట్లాగే మనకు జ్ఞానజన్మనిచ్చే మహనీయులు కూడా కొందరు ఉంటారు. వారినీ తల్లిదండ్రులు అని అంటాం. **'జ్ఞానం'** అని మనం దేన్ని అంటున్నాం, అంటే జ్ఞానం శరీరానికి లక్షణం కాదు. పైకి కనపడే శరీరం అన్ని భాగాలతో కనిపించినా, ఒకనాడు దాన్ని 'శవం' అని పేరు పెడతారు. కానీ అందులో జ్ఞానం ఉండదు. జ్ఞానం అనేది ఆత్మకు చెందినటువంటి ఒక లక్షణం. ఆత్మ ఎంతవరకు శరీరంలో ఉంటే, అంతవరకు అన్ని భాగాలు పనిచేస్తాయి, లేకుంటే పని చెయ్యవు. జ్ఞానం సహజంగానే ఉంటుంది, కానీ మూసి వేయబడి ఉంటుంది. ఆ మూసివేసిన జ్ఞానాన్ని సరిగ్గా పనిచేసేట్టు చేయగలిగిన మహనీయులనే ఆత్మకి జన్మనిచ్చిన వ్యక్తులు అంటాం.

మనం ఒకనాడు నామరూపాలు లేకుండా ఒక మూలన పడి ఉంటే ఒక రూపం వచ్చేట్టు చేస్తారు తల్లి, తండ్రి కూడా. మన మేమిటో, జ్ఞానం ఏమిటో తెలియని స్థితిలోంచి మన స్వరూపాన్ని, మన చుట్టూ ఉన్న ప్రపంచానికి మనకు ఉన్న సంబంధాన్ని తెలియజేసి, మన జ్ఞానాన్ని వికసింపజేసిన వారినీ మన తల్లిదండ్రులు అని అంటాం. మనం అంటే 'ఆత్మ' అనే అర్థం. మనం అంటే 'శరీరం' అని అర్థం కాదు. ఈ జ్ఞానాన్ని ఆచార్యుడు తన ఉపదేశం ద్వారా చేస్తాడు. ఉపదేశం అనేది మంత్రరూపంలోనో, గ్రంథరూపంలోనో చేస్తారు. లోకంలో తల్లి మనల్ని పోషించి పెద్ద చేసినట్లే, ఉపదేశం అనేది మన జ్ఞానాన్ని పెంచి పెద్ద చేస్తుంది. అందుకే 'మంత్రో మాతా గురుః పితా' అని అంటారు. గురువు తండ్రి, గురువు ఉపదేశం మన తల్లి అని అంటారు. జ్ఞానం అనేది లౌకికంగానూ, మరియూ అలౌకికంగానూ ఉంటుంది. భౌతికమైనవాటిని తెలిపేవారూ గురువులే, కానీ ఆత్మస్వరూప జ్ఞానాన్ని ఇచ్చేవారినే మనం వాస్తవిక గురువు అని అంటాం. ఎందుకంటే 'ఆత్మజ్ఞానం కలగటమే నిజమైన జన్మ' అని ఉపనిషత్తులు అంటాయి. ఆత్మజ్ఞాన ప్రదాతలనే మనం 'ఆచార్య' అని కీర్తిస్తాం.

మానవజాతికి వేదాల్లోనూ, ఇతిహాసాల్లోనూ, పురాణాల్లోనూ నిక్షిప్తమై ఉండే ఆత్మస్వరూపాన్ని తెలిపే నిగూఢమైన విషయాలను వెలికితీసి అందించిన మన ఋషులంతా మన ఆచార్యులే. వారు చేసిన ఉపకారం ఒకటైతే, వాటిని మనలాంటి సామాన్యుల దాకా అందించిన మహనీయులు కూడా మనకు ఆరాధ్యులే. వారు ఎన్నో రహస్యాలను సూత్రబద్ధం చేసి మనకి కూడా చదివే అధికారాన్ని ఇచ్చారు. ప్రాచీనకాలమందు గ్రంథాలను ముట్టుకోవడమే దోషంగా ఉండే స్థితి నుండి మనం వాటిని అనుసంధానం చేసే స్థితి వరకు తీసుకువచ్చారు. అట్లాంటి మన పూర్వాచార్యులు పరమ కారుణికులు. అలాంటి వారిలో గొప్ప మహనీయులు **'పిళ్ళైలోకాచార్య'** స్వామి. వారు చేసిన ఉపకారానికి వారిని కృతజ్ఞతతో స్మరించుకోవడం మన కర్తవ్యం.



పిళ్ళైలోకాచార్య స్వామి శ్రీకృష్ణపాదులు అనే వారి కుమారుడు. వారు ఏం చెప్పారు అంటే, 'మనలాంటి సామాన్యులు తెలియక ఒక పాము నోట్లో పడ్డాం. ఎట్లాంటి పాము అది అంటే అది కనిపించక మనల్ని మింగేస్తుంది. మన జన్మలని ఘోరంగా హింసిస్తుంది. ఆ పాము పేరు 'సంసారం'. సంసారం అంటే కుటుంబం అని అనుకుంటాం, కానీ అది కాదు అర్థం. మన చుట్టూ ఉండే వాటియందు ఉండే పట్టును 'సంసారం' అని అంటారు. మనలో ఉండే అహంకారమే దీనికి కారణం. అహంకారం అంటే– మనది కానిదాన్ని, మనది అనిపించే తెలివితక్కువతనం. శరీరమే నేను అనిపిస్తుంది, కానీ శరీరంలోన ఉన్న ఆత్మను గుర్తించకపోవడమే 'అహంకారం' లేక 'సంసారం' అని అంటారు. కొన్ని యజ్ఞాలలో యజ్ఞం పూర్తి అయ్యాక పూర్ణాహుతితో పాటు యజ్ఞశాలనే ఆహుతి చేస్తారు. అట్లా శరీరం అనే వ్యవస్థ భగవంతుడు ఏర్పరిచిన యజ్ఞం. అట్లా ఆత్మలేని శరీరాన్నీ మనం అట్టే పెట్టుకోం. మనం ఈ శరీరాన్నే సర్వం అని, దానిపైనే మమత పెంచుకుంటున్నాం. శరీరాన్ని కేవలం తినడం, పెరగడంలాంటి వాటికే ఉపయోగించు కుంటున్నాం. కానీ దాన్ని వాటికే పరిమితం చేయక మరొక మంచి ఉద్దేశ్యానికి వాడాలి అనేది మరచిపోతున్నాం. జ్ఞానం లేని ప్రాపంచిక విషయాలని పట్టుకొని జ్ఞానం కల జీవులని, పరమాత్మని వదిలి ఉన్నాం. సంసారం నుండి బయట పడడం అంటే మన బంధువులను, బాధ్యతలను వదలడం అని అర్థంకాదు.

ఈ సంసారం అనే వ్యాధి పైనుండి వచ్చినది కాదు, లోపలినుండి వచ్చినది. కనుక దానికి మందు లోపలి నుండే వేయాలి. ఆ లోపం జ్ఞానంలో ఏర్పడుతుంది, కనుక జ్ఞానం ద్వారానే మందు వేయాలి. అంటే ఉపదేశం ద్వారానే జ్ఞానాన్ని పూరించాలి. అట్లా మన స్వరూపం ఏంటో మనకు తెలిస్తే క్రమంగా మనలో ఏర్పడ్డ దుష్పరిణామాలు తొలగుతాయి. పిళ్ళై లోకాచార్యస్వామి అట్లాంటి సంసారం అనే సర్పంచే కాటు వేయబడ్డ మనలాంటివారికి ఒక జీవాతువుని ప్రసాదించారు. 'జీవాతువు' అంటే ప్రాణం నిలిపే ఔషధం అని పేరు. అట్లా వారు చేశారని వారిని స్మరించుకొనే శ్లోకం ఇది.

**లోకాచార్యాయ గురవే కృష్ణపాదస్య సూనవే।**
**సంసార భోగి సందష్ట జీవ జీవాతవే నమః॥**

సంసారం అనే సర్పంచే కరవబడ్డ జీవుడికి జీవౌష ధాన్ని ఇచ్చిన మహనీయులు. ఆయన పేరు లోకాచార్యులు. అజ్ఞానాన్ని తొలగించినవారు కనుక, వారిని గురువు అని వ్యవహరిస్తాం.

సంసారం అంటే సముద్రం అని కూడా వ్యవహరి స్తారు. మనలో ఉండే కోరికలే సముద్రంలో ఉండే నీరు. శరీరాన్ని పోషించుకునే కోరికలే కలుగుతున్నాయి మనలో. ఆ కోరికలను తీర్చుకునే క్రమంలో ఎన్నో తప్పటడుగులు వేస్తున్నాం. అందులోనే మునకలు వేస్తున్నాం. అట్లాంటి సముద్రంలోంచి బయట పడాలి అంటే విష్ణు అనే ఓడని తీసుకోవాలి అని మన ఋషులు చెబుతారు. మనకు కనిపించే ఈ ప్రపంచానికి వెనకాతల ఉండి నడిపే పరమాత్మని గుర్తించగలిగితే చాలు. మనం ఈ వస్తువులతో గడిపినా వాటి వెనకాల పరమాత్మ వరకు చూడగలం. సంసారం అనే సముద్రం నుండి బయట పడాలి అంటే 'విష్ణు' అనే ఓడను పట్టుకొని ప్రయాణించడమే మార్గం.

## శ్రీపదకేళి

### :: 118 – సమాధానాలు ::

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 ప్ర | బో | ధి | ని | | 2 కై | | 3 జ్యా | | | 4 సిం |
| హ్లా | | | | | శి | | లా | | | హ |
| 5 దు | స్స | 6 ల | | | క | | తో | | | ళ |
| డు | | పి | | | 7 ద్వా | ప | ర | యు | గ | ము |
| | 8 వ్ర | త | ము | | ద | | ణ | | | |
| 9 పం | | | | | శి | | 10 ము | 11 స | ల | ము |
| చ | | 12 ప్రాం | | | | 13 ఆ | | ము | | |
| 14 మీ | డ్వాం | శు | డు | | 15 వేం | క | టా | ద్రి | | |
| తీ | | వు | | 16 కౌ | | లి | | | | 17 కృ |
| ర్థం | | | | ము | | | | 18 ఉ | త్ప | త్తి |
| | 19 బా | ల | ల | ది | నో | త్స | వం | | | క |

# శ్రీవేంకటేశ్వరలీలలు



# వడ్డికాసులవాడు

- శ్రీ వాసగిరి రామచంద్రుడు

మా ఇంటి ఇలవేల్పు శ్రీవేంకటేశ్వరస్వామి. మేము ప్రతి సంవత్సరము తిరుపతి వచ్చి స్వామివారిని సేవించుకుంటాము. ఇది ఆనవాయితి. ఒకసారి మా అబ్బాయికి సుస్తీ, నా భార్య "మా అబ్బాయికి నయమైతే స్వామీ! నిలువు దోపిడి ఇస్తానని" శ్రీవేంకటేశ్వరస్వామివారికి మొక్కుకుంది. మా అబ్బాయికి ఆరోగ్యం బాగైంది. అనుకున్న ప్రకారం, నేను కుటుంబముతో సహా తిరుపతి వెళ్లి నిలువుదోపిడి ఇచ్చాము. అయితే ఎవరో పెద్దలు మంగళసూత్రములు ఇవ్వనక్కరలేదు అని చెప్పినందువలన, నా శ్రీమతి మంగళసూత్రములు మాత్రము ఇవ్వలేదు. మిగతా సొమ్మునంతా ఇచ్చాము. అంతా సవ్యంగా జరిగింది. తిరిగి సుఖంగా ఇంటికి చేరాము.

మరుసటి సంవత్సరము కుటుంబసమేతంగా, మళ్లీ తిరుమల వెళ్తునాము. స్వామి దర్శనానికి వెళ్ళాం. క్యూలో ధ్వజ స్తంభము దగ్గర ఉండగా ఒకతను, నాకు శ్రీగంధము తెచ్చి ఇచ్చినాడు. నేను నా భార్యకు, పిల్లలకు క్యూలోనే ఆ గంధాన్ని ఇచ్చాను. తర్వాత స్వామివారి దర్శనం బాగా జరిగినది. గర్భ గుడిలో నుండి వెనుదిరిగి జయ, విజయులను దాటి గంటవున్న ప్రదేశానికి వచ్చాము. నా భార్య మంగళసూత్రములు మాత్రం లేవు. ఎవరో కత్తిరించినట్లు ఉన్నది. అయితే బంగారుగొలుసు మాత్రం అట్లే ఉన్నది. ఎంత ఆశ్చర్యము. నా భార్య ఎక్కడ పడి పోయిందోనని వెతుకుతోంది. నేను పరీక్షగా చూశాడు. రెండు మంగళసూత్రములు మాత్రం కత్తిరించి తీసుకున్నట్లు ఉన్నవి. బంగారుగొలుసు మాత్రం అట్లే ఉంది. ఇది గర్భగుడిలో జరిగింది.



మా అందరికీ చాలా ఆశ్చర్యం వేసింది. ఎంతో ఆలోచించాం. ఇది ఖచ్చితంగా దొంగతనము కాదు. ఎందుకంటే, దొంగే అయితే బంగారుగొలుసు తీసుకోకుండా ఎందుకు వదులు తాడు. అదీగాక దొంగతనం చేస్తున్నప్పుడు ఖచ్చితంగా స్పర్శ తెలిసే అవకాశం ఉంది. అంతా మాయే అనిపించింది.

అప్పుడు నాకు గుర్తుకు వచ్చింది. ముందు సంవత్సరం వచ్చినప్పుడు మొక్కు ప్రకారం నిలువుదోపిడి అంతా ఇవ్వకుండా నా శ్రీమతి మంగళసూత్రాలు అట్టే పెట్టుకున్నది. కావున స్వామివారు తనకు రావలసిన వాటిని తీసుకున్నారని గుర్తించి, తెలియక తప్పు చేశామని మన్నించమని స్వామివారిని వేడుకొని వెదుకుట మాని, అపరాధం స్వామివారి హుండీలో వేసి బయటకు వచ్చాము. గరుడస్తంభం దగ్గర, పసుపుకొమ్ము, పసుపుతాడు రెండు రూపాయలకు కొని అక్కడే స్వామివారి ఎదురుగా నా భార్యకు కట్టాను. అందరం సుఖంగా ఇల్లు చేరాం. తర్వాత బంగారు మంగళసూత్రములు చేయించి కట్టాను. ఇది జరిగిన సంగతి. ఆపదమొక్కులవాడు, వడ్డికాసులవాడు అయిన ఆ స్వామి లీల వర్ణించడం ఎవరితరం? ఆర్తులను ఎంత వేగంగా రక్షించి ఆదుకుంటాడో, తన మొక్కుబడులు వసూలు చేసుకోవడంలోనూ అంతే ఖచ్చితంగా ఉంటాడని అర్థమైంది. స్వామివారికి మొక్కుబడులు చెల్లించడంలో ఎవరూ అశ్రద్ధ చేయకూడదని ఈ సంఘటన వ్రాస్తున్నాను.

ఏడుకొండలవాడా గోవిందా! గోవింద!
అడుగడుగు దండాలవాడ గోవిందా! గోవింద!

*నవంబరు 26న సుబ్రహ్మణ్యషష్ఠి సందర్భంగా...*



# కరుణాకరా! కళాధరా!

- శ్రీ జంధ్యాల శరత్‌బాబు, 99483 45013

దేవాది దేవనుత దేవగణాధినాథ
దేవేంద్రవంద్య మృదుపంకజ మంజుపాద।
దేవర్షి నారదమునీంద్ర సుగీతకీర్తే
వల్లీశనాథ మమ దేహి కరావలంబమ్॥

-అంటుంది సుబ్రహ్మణ్యస్తోత్రం. దేవతలందరిలో ఘనాఘనుడు, వారందరి స్తుతులనూ అందుకునేవాడు, నారదుడి సంకీర్తనలతో మహనీయత వెల్లివిరిసి దేవాధిదేవుడైన స్వామికి చేతులు జోడిస్తుంది నిఖిలమంతా. స్కందుడు, కుమారస్వామి అయిన ఆయనను కల్యాణప్రదవేదానికి ప్రతీకగా, పతాకగా ఎంతగానో సంభావిస్తోంది. కార్తికేయంగా జేజేలు పలుకుతూ వస్తోంది. 'స్కందషష్ఠి'గా మహోత్సవాన్ని నిర్వర్తిస్తున్నది.

ఆ కరుణాకరుడు, దీనబంధుడు, సర్వ సమస్త సకల మంగళాలకు మూలకారకుడైన దైవానికి షష్ఠివేళన జయజయా రావాలు, జననీరాజనాలు, మనసా వాచా కర్మణా పూజాదికాల పర్యవసానంగా సుఖసంతోషాలు, శాంతి సౌభాగ్యాలు లభిస్తా యన్నది భక్తకోటి ప్రగాఢ విశ్వాసం. భక్తి, జ్ఞాన సమ్మిళితంగా అందరూ ఆచరించుకునే పర్వదినం 'స్కందషష్ఠి'. శివ కుమారుడైన షణ్ముఖుడు అంతటికీ ప్రదాత.

హారాదిరత్న మణియుక్తకిరీట హార
కేయూర కుండల లసత్కవచాభిరామ
హే! వీర తారక జయామరబృంద వంద్య!

పంచాక్షరాది మనుమంత్రిత గాంగతోయైః
పంచామృతైః ప్రముదితేంద్ర ముఖైర్మునీంద్రైః
పట్టాభిషిక్త హరియుక్త పరాసనాథ!

నిత్యాన్నదాన నిరతాఖిల రోగహారిన్
తస్మాత్ప్రదాన పరిపూరిత భక్తకామ!
శ్రుత్యాగమ ప్రణవవాచ్య నిజస్వరూప వల్లీసనాథ!

అని ప్రస్తుతాంజలి. స్వామిది లోకోత్తర చరిత.

వాక్కుతో కలిగే జ్ఞానమే బ్రహ్మం. అంతటి ప్రకృష్టవాక్ స్వరూపుడే బ్రహ్మణ్యుడు. వారందరిలోనూ పరమశ్రేష్ఠుడు సుబ్రహ్మణ్యుడే. ఆయన అతిప్రాచీన నామధేయం 'స్కంద'. వాక్ తత్త్వమే స్కందప్రశస్తం. శ్రీ స్కందపురాణం అనేక అంశాల సమాహారం. శివకుమారుని జనన కారణం, బాల్యంలో స్కందుని లీలావినోదం, శివసదృశమై విశ్వరూపసందర్శనం, అటు తర్వాత అసుర సంహారం, ఇంద్రాది దేవతలందరికీ అభయప్రదానం, వల్లి-దేవసేనలతో పరిణయం- స్కందపురాణ భాగాలు.

అన్నింటికన్నా అతీతం 'బ్రహ్మం'. అది సత్త్వ, రజః, తమోగుణాలకు మహాతీతం. శివునిది చిన్ముద్ర. అంటే -

చూపుడు వేలిని బొటనవేలుకు తాకించి, గుండ్రంగా ఉంచి, తక్కిన మూడు వేళ్లనూ కలిపి ఉంచడం అన్న మాట. చిన్ముద్ర అర్థం మూడు వేళ్లనూ ఊర్ధ్వముఖంగా నిలిపి ఉంచడంలో ప్రస్ఫుటమవుతుంది! పరమాత్మను చేరాలంటే త్రిగుణాతీత సంస్కారమే మూలం, ముఖ్యం. త్రిగుణాత్మక లోకాన్ని అవతల ఉంచడం, అహంకారాన్ని పరబ్రహ్మంతో విలీనం చేయడమే పూర్ణత్వ పరమార్థం.

షణ్ముఖుడి ఆరుముఖాలూ– **ఆది, ఇచ్ఛ, క్రియ, జ్ఞాన కుండలిని, పరాశక్తి** రూపాలను సూచిస్తాయి. ఆరు శక్తులూ శరవణ సరోవరానికి చేరిన అనంతరమే లోకాలకు శుభాలు చేకూరాయని పురాణసారం. సరస్సు చెంగలువలలోని ఆరు శిశుమూర్తులనూ శివానీ మాతృమూర్తిత్వంతో చేతుల్లోకి తీసుకుని దగ్గరకి చేర్చింది. ఒక్క శరీరంగా మారిన షణ్ముఖునికి జ్ఞానక్షీరాన్ని అందించింది. అందుకే ఆ స్వామి ఆరు ముఖాలు, పన్నెండు చేతులు, ఒక్క శరీరంతో దర్శనమిచ్చాడని అంతరార్థం.

'స్కందం' అంటే ఇముడ్చుకోవడం. జగజ్జనని నుంచి అందిన జ్ఞానసారాన్ని తనలో నిక్షిప్తం చేసుకున్నందుకే స్కందుడు అనే పేరు వచ్చింది. కార్తికస్త్రీల మమతానురాగాలు పొందినందునే 'కార్తికేయు'డయ్యాడు. జ్ఞానశక్తిసంపన్నుడైన సుబ్రహ్మణ్యుడు ఒక ముఖం, రెండు కళ్లు, నాలుగు చేతుల్లోనూ, శక్తిశూల, వజ్ర, ధ్వజధారుడై, అభయహస్తం చూపుతుంటాడు.

శ్రీకార్తికేయ కరుణామృత పూర్ణదృష్ట్యా
కామాదిరోగ కలుషీకృత దుష్టచిత్తమ్,
భక్త్యా తు మామవ కళాధర కాంతికాంత్యా!

క్రౌంచాసురేంద్ర పరిఖండన శక్తి శూల
పాశాది శస్త్ర పరిమండిత దివ్యపాణే
శ్రీకుండలీశ ధృతతుండ శిఖీంద్రవాహా!

దేవాదిదేవ రథమండల మధ్యవేద్య,
దేవేంద్ర పీఠనగరం దృఢచాపహస్తమ్,
శూరం నిహత్య సురకోటిభిరీడ్యమాన!

– అని కొలుస్తుంది ఆరాధక మానసం.

కథనరీత్యా శిశుప్రాయాన గంగానదీ జలప్రవాహాన ఎదురొచ్చినందున గాంగేయుడు, శివదేవుడి నుంచి వెలువడిన తేజఃపుంజాల కారణంగా శివకుమారుడు, ఆ కాంతిదీప్తులు అగ్ని, వాయుదేవుల మూలాన నింగి నుంచి నేలకు, అక్కడి జలం, మీదకీ చేరినందున పంచభూతాలన్నీ సుబ్రహ్మణ్యస్వామికి వశమైనట్లే కదా! 'సత్ చిత్ ఆనంద' స్వరూపుడు శివుడు. శక్తి స్వరూపిణి పార్వతి. ఆ ఆదిదంపతుల మాదిరే ఈ స్వామీ భక్త వరదుడు.

తండ్రి అంతటివాడై, ప్రతిరూపుడై, శక్తిసంధాయకుడైన సుబ్రహ్మణ్యుడు దేవసేనాధిపత్యం వహించిన అనంత శూరుడు. శివతనయుడి (బాలసుబ్రహ్మణ్యుడి) బాల్యంలో





ఎంతెంత సుందరతత్త్వరూపమో! ప్రకాశాల కర్ణకుండలం, నడుమున ఆభరణ విశేషంతో చిరుగంటల రవళీనాదం. తారకబ్రహ్మ బీజాక్షరాల ఆరు అక్షరాల మంత్రవేదం. సప్త సముద్రాలు, అష్టదిక్కులు, పద్నాలుగు లోకాలనూ విశ్వరూపం ద్వారా కనబరచిన మహిమాన్వితుడు. జగదీశుడే ప్రాణంగా, జగదీశ్వరీ ఆత్మగా బాలసుబ్రహ్మణ్యస్వామి విశ్వరూపి అయ్యాడన్నది పురాణ కథనం.

‘షట్’ అంటే ఆరు. వాటిల్లో రెండేసి వంతున ప్రాణ, దేహ, మనోధర్మాలు. అవి:- ఆకలి-దప్పులు, శోక-మోహాలు, జనన-మరణాల సూక్ష్మ అంశాలకు సమగ్రవిశదీకరణలు. షట్ భావాలూ ఉన్నాయి. అవి:-పుట్టడం, మరణించడం, పెరగడం, వృద్ధి చెందడం, కృశించటం, నశించడం. భక్తులకు స్వామి సందేశ ఉపదేశాలు అనేకమున్నాయి. ‘ఆత్మతత్త్వ’ విచారం ఎంతైనా ప్రధానం. సత్త్వం, శాశ్వతం, పరిశుద్ధం, వేదవేద్యం, పరబ్రహ్మరూప వాస్తవికతను తెలిసి మసలాలి. సత్యజ్ఞానానంద స్వరూపంగా ఉండాలి. ప్రత్యగాత్మ స్వరూపం, సర్వోత్కృష్టం, నిత్యం, నిఖిలం నేనే. అఖండ సచ్చిదానంద, స్వయం దీప్త, సమరసమయ, ఏకాత్మక పరబ్రహ్మత నాదే.

నాలో నేనై, మీలోనూ నేనా ఉన్నాను. అన్నీ నేనే. అంతర్యామిని. అన్ని మంగళాలకూ కారణాధికారిని. శివ, శక్తి రూపాన్ని. జ్ఞాననేత్ర ప్రదాతను అనే సుబ్రహ్మణ్య స్వామి వారి వాణి భక్తజనులపాలిట కల్పవల్లి. స్కందసుబ్రహ్మణ్య షష్ఠి చంద్రుని ప్రకాశవంతపక్షంలోనిది. ఇదే కార్తికేయ సుబ్రహ్మణ్యం. అదే విధంగా, సుబ్రహ్మణ్య చంపషష్ఠి. తెలుగు నాట అన్ని ప్రాంతాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, కేరళ, మరెన్నో ప్రదేశాల్లో ఈ మహోత్సవాన్ని నిర్వహిస్తారు. ప్రభాత సమయంలో నదీస్నానం, కథాపఠనం, గీతసమర్పణం, భజనం, ఉపవాస సమాచరణం, వ్రత ఆచరణం, స్వామి ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలతో అంతటా పండుగ వాతావరణమే. పేదలకు దానధర్మాలు చేయడమన్నది పుణ్యప్రదం.

తిథిగా, సంఖ్యగా షష్ఠికి ఎనలేని ప్రాధాన్యముంది. ‘పింగళాయ, శక్తిధరాయ, తారకాసుర సంహారకాయ, భక్తవత్సలాయ, సనాతనాయ, అక్షోభ్యాయనమః’ అంటూ స్వామికి అనేకానేక నామావళి.

**హే స్వామినాథ కరుణాకర దీనబంధో**
**శ్రీ పార్వతీశ ముఖపంకజ పద్మబంధో**
**శ్రీశాది దేవగణపూజిత పాదపద్మ!**

-అంటూ సుబ్రహ్మణ్యస్వామిని సమర్చన చేద్దాం. ‘నమస్తే నమస్తే మహాశక్తిపాణే/ సదాభీష్టపాణే’ అని రెండు చేతులూ జోడించి మనఃపూర్వకంగా నమస్సుమాలు అర్పిద్దాం. ఆ గురు స్వరూపుడిని భక్తితో పూజించటం అందరికీ మహదానందకారకం.

# శ్రీ పళ్ళికొండేశ్వరస్వామి ఆలయం - సురుటుపల్లి

– డా॥ ఐ.ఎల్.ఎన్.చంద్రశేఖర రావు, 94919 46070

త్రిమూర్తులలో లయకారుడైన శివుడు లింగరూపంలో కాకుండా శయనమూర్తిగా కొలువుదీరి పూజలందుకొంటూ ఉన్న విశిష్టక్షేత్రం– **'సురుటుపల్లి'**.

తిరుపతి జిల్లాలో తిరుపతికి సుమారు 73 కిలోమీటర్ల దూరంలో నాగలాపురం మండలంలో పవిత్ర అరుణానదీ తీరంలో 'సురుటుపల్లి' ఉంది. శివుడు క్షీరసాగరమథనం సమయంలో ఆవిర్భవించిన హాలాహలాన్ని స్వీకరించి, శయనించి విశ్రమించిన క్షేత్రం. కనుక దీనికి **'కాలకూటశయన క్షేత్రం'** అనే పేరు ఏర్పడింది. క్షీరసాగరంనుంచి కాలకూట విషం ఆవిర్భవించిన తరువాత దాన్ని సేవించమని దేవతలందరూ శివుడిని ప్రార్థించారు. శివుడు సేవించిన తరువాత దేవతలందరూ శివుణ్ణి కీర్తించారు, పూజించారు. ఈ విధంగా దేవతలు అంటే **'సురలు'** కోట్లాదిమంది శివుణ్ణి పూజించిన ప్రాంతం కనుక **'సురకోటిపల్లి'** అనే పేరు ఏర్పడి... అది కాలక్రమంలో సురుటుపల్లి అయినట్లు స్థలపురాణకథనం. అటువంటి సురుటుపల్లిలోని ప్రాచీన ఆలయంలో పరమశివుడు విగ్రహరూపంలో, శయన భంగిమలో **'శ్రీపళ్ళికొండేశ్వరస్వామి'** పేరుతో కొలువుదీరి పూజలందుకొంటూ ఉన్నాడు.

చారిత్రకంగా పరిశీలిస్తే, సురుటుపల్లి ఆలయం సామాన్య శకం 11వ శతాబ్దంలో చోళుల కాలంలో మొదటి సారిగా నిర్మింపబడింది. కాలక్రమంలో ఆలయం శిథిలావస్థకు చేరుకోగా స్థానికులు సుమారు దశాబ్దకాలం ముందు జీర్ణోద్ధరణ కార్యక్రమాలను చేపట్టి ఆలయాన్ని సర్వాంగసుందరంగా తీర్చి దిద్దారు.



సురుటుపల్లి గ్రామంలో ప్రధాన రహదారి ప్రక్కనే ఆలయం ఉంది. తూర్పు అభిముఖంగా ఉన్న ఆలయంలోకి ప్రవేశించేందుకు, తూర్పు, ఉత్తరం వైపుల ద్వారాలు ఉన్నాయి. తూర్పుద్వారంపైన ప్రాచీన గోపురం దర్శనమిస్తుంది. ఈ ద్వారం గుండా ఆలయంలోకి అడుగిడుతూనే విశాలమైన ప్రాంగణంలో ప్రధాన ఆలయం దర్శనమిస్తుంది. ఆలయప్రాంగణంలో రెండు ఆలయాలు ఉన్నాయి. అందులో ఒకటి శివుడు శయనమూర్తిగా కొలువుదీరిన ఆలయం కాగా, దాని ప్రక్కనే శివుడు లింగ రూపంలో కొలువుదీరిన ఆలయం ఉన్నాయి. రెండు ఆలయాలు ఒకే ప్రాంగణంలో ఉన్నా రెండు ధ్వజస్తంభాలు ఉండటం విశేషం.

శివుడు శ్రీపళ్ళికొండేశ్వరస్వామిగా శయన రూపంలో కొలువుదీరిన ప్రధాన ఆలయం–మహామండపం, ముఖమండపం, అంతరాలయం, గర్భాలయాలను కలిగి ఉంది. ప్రధాన గర్భాలయంలో శివుడు శయనమూర్తిగా దర్శనమిస్తాడు. **సర్వమంగళాదేవి** పేరుతో ఉన్న పార్వతీదేవి ఆసీనురాలై ఉండగా, ఆమె తొడపైన తలను ఉంచుకొని శ్రీపళ్ళికొండేశ్వరస్వామి శయనించి ఉన్నాడు. స్వామి చతుర్భుజాలను కలిగి ఒక చేతిలో జింకను, మరో చేతిలో అంకుశాన్ని ధరించగా, మరో రెండు చేతులలో ఒక దాన్ని తలక్రింద, మరో చేతిని శరీరంపైన ఉంచుకొని కొలువుదీరి ఉన్నాడు. భారీమూర్తిగా కొలువుదీరి ఉన్న శ్రీపళ్ళికొండేశ్వరస్వామివారి చుట్టూ వివిధదేవతలు, మహర్షులు ప్రార్థిస్తూ ఉన్న రూపంలో కొలువుదీరి ఉన్నారు.



వీరందరూ గర్భాలయంలోని గోడలపై మలచబడి ఉన్నారు. బ్రహ్మ, విష్ణువు, నారదుడు, అగస్త్యుడు, మార్కండేయుడు, గౌతముడు, సూర్యుడు, పులస్త్యుడు, తుంబురుడు, చంద్రుడు, వినాయకుడు, వల్లీదేవసేనాసమేత సుబ్రహ్మణ్యస్వామివంటి వివిధ దేవతలు, మహర్షులు స్వామివారి చుట్టూ దర్శనమిస్తారు. ఈ విధంగా శివుడు శయనమూర్తిగా కొలువుదీరిన ఆలయం ఇదొక్కటే కావడం, మరెక్కడా లేకపోవడం విశేషం. గర్భాలయంపై మాములుగా ఉండే ఏకశిఖర గోపురంలాగా కాకుండా ఈ గర్భాలయంపై రాజగోపురంవంటి గోపురం నిర్మింపబడి ఉండటం విశేషం.

ఆలయ ప్రాంగణంలో శ్రీపళ్ళికొండేశ్వరస్వామి వారి ఆలయానికి కుడివైపున ఉన్న ఆలయంలో శివుడు లింగ రూపంలో **శ్రీవాల్మీకేశ్వరస్వామి**గా కొలువుదీరి పూజలందుకొంటూ ఉన్నాడు. ప్రదోషమండపం, ముఖమండపం, అంతరాలయం, గర్భాలయాలను కలిగి ఉన్న ఈ ఆలయ గర్భాలయంలో పరమశివుడు లింగరూపంలో శ్రీవాల్మీకేశ్వరస్వామిగా కొలువుదీరి అభిషేకాలను, పూజలను అందుకొంటూ ఉన్నాడు. పూర్వం శ్రీవాల్మీకి మహర్షి ఈ క్షేత్రంలో శివుణ్ణి పూజించగా శివుడు ప్రత్యక్షమై, అనుగ్రహించి, మహర్షి కోరిక మేరకు స్వయంభువుగా శ్రీవాల్మీకేశ్వరస్వామిగా కొలువుదీరినట్లు కథనం. గర్భాలయం బయటి గోడలవైపు వరుసగా దక్షిణ, పశ్చిమ, ఉత్తరంవైపులో శ్రీదక్షిణామూర్తి, శ్రీలింగోద్భవమూర్తి, శ్రీబ్రహ్మదేవుడు కొలువుదీరి ఉన్నారు. కాగా శ్రీదక్షిణామూర్తి




తన దేవేరి గౌరీదేవి సమేతంగా **'దాంపత్య దక్షిణామూర్తి'**గా కొలువుదీరి ఉండటం విశేషం. ఈ విధమైన రూపం మరెక్కడా కనిపించదు. ఆలయ ముఖమండపం లోనికి ప్రవేశించే ద్వారానికి ఇరువైపులా **శ్రీశంఖనిధి, శ్రీపద్మనిధిలు** ధర్మపత్నులైన **వసుంధర, వసుమతి**ల సమేతంగా కొలువుదీరి ఉన్నారు. ఆలయ ముఖమండపం, ప్రదక్షిణామండపాలలో శ్రీవరసిద్ధి వినాయకుడు, శ్రీమహాలక్ష్మి, శ్రీరామలింగేశ్వరుడు, శ్రీనాగేశ్వరుడు, శ్రీసుబ్రహ్మణ్యస్వామి, శ్రీకాలభైరవుడు, శ్రీవిశాలాక్షి, శ్రీవిష్ణుమూర్తి, లింగోద్భవమూర్తి, సప్తమాతృకలు వంటి దేవతామూర్తులను దర్శించుకోవచ్చు.

శ్రీవాల్మీకేశ్వరస్వామివారి ఆలయానికి కుడివైపున స్వామివారి దేవేరి శ్రీమరకతాంబిక అమ్మవారు ప్రత్యేక ఆలయంలో కొలువుదీరి పూజలందుకొంటూ ఉంది. ఈ ఆలయ గర్భాలయ ద్వారానికి ఇరువైపులా కామధేనువు, కల్పవృక్షాలు కొలువుదీరి ఉండటం విశేషం. అందువల్ల ఈ అమ్మవారిని దర్శించి పూజించడం వల్ల కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

ప్రతిరోజూ పూజలు జరిగే సురుటుపల్లి ఆలయంలో త్రయోదశినాడు సాయంత్రం ప్రదోష సమయంలో ప్రదోష పూజలు విశేషంగా జరుగుతాయి. పూర్వం శివుడు శయనించి ఉన్న సమయంలో వివిధ దేవతలు, మహర్షులు ప్రార్థించగా, శివుడు త్రయోదశినాడు ప్రదోష సమయంలో అనుగ్రహించినట్లు కథనం. అందువల్ల ప్రదోషపూజలు విశేషంగా జరుగుతాయి. ఈ ఆలయంలో ప్రదోషపూజలు చేస్తే సకలకష్టాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం. ఇక ప్రతి సంవత్సరం మాఘమాసంలో మహాశివరాత్రి సందర్భంగా ఆలయంలో ఉత్సవాలను నిర్వహిస్తారు. కార్తికమాసం, దేవీనవరాత్రులు, ఇతర పర్వదినాలలో ప్రత్యేకపూజలు, ఉత్సవాలను నిర్వహిస్తారు.

తిరుపతి నుంచి 73, పుత్తూరు నుంచి 36, చెన్నై నుంచి 64, నాగలాపురం నుంచి 11 కిలోమీటర్ల దూరంలో తిరుపతి-చెన్నై రహదారిలో సురుటుపల్లి ఉంది. తిరుపతి, పుత్తూరు, నగరి, చిత్తూరు, చెన్నైల నుంచి బస్సు సౌకర్యాలు ఉన్నాయి. తిరుమల తిరుపతి దేవస్థానాలు, టూరిజం శాఖ వారు, రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థవారు తిరుపతి విష్ణునివాసం నుంచి నిర్వహించే ప్యాకేజిటూర్లో వెళ్ళి ఈ క్షేత్రాన్ని దర్శించవచ్చు. సురుటుపల్లిలో భక్తులకు వసతి సౌకర్యాలు లభించవు. చుట్టుప్రక్కల పట్టణాల నుంచి వెళ్ళి దర్శించుకొని తిరిగి ఆయా పట్టణాలకు చేరుకోవడం మంచిది.

శివుడు శయనమూర్తిగా కొలువుదీరిన అపురూప క్షేత్రమైన సురుటుపల్లిని దర్శించి భక్తులు తరించవచ్చు.

# సంవాదం - సందేశం

- శ్రీ మదన్ రావు జోషి

మన దైనందిన జీవితంలో ఉదయం లేచినప్పటి నుంచి మళ్లీ నిద్ర పోయే వరకు, కొన్నిసార్లు నిద్రలో కూడా ప్రశ్నలు వస్తాయి. వాటిలో కొన్ని తెలియని విషయాలు తెలుసుకోవడం కోసం, తెలిసిన విషయమే అయినా ఇంకా లోతుగా అధ్యయనం చేయడానికి, కుశలప్రశ్నలు, కొంటెప్రశ్నలు, చిలిపిప్రశ్నలు, ఇబ్బందికరంగా ఉండే ప్రశ్నలు, చివరిగా స్వీయ విశ్లేషణ కొరకు వేసుకునే ప్రశ్నలు, ఈ విధంగా జీవితమంతా ప్రశ్నలు దొరికీ దొరకని సమాధానాలతో జీవితమంతా గడిచిపోతుంది. అలాగే **'వాదం - సంవాదం'**లో కూడా ప్రశ్నలు సమాధానాలు ఉంటాయి. వాదంలో 'సంఘర్షణ', సంవాదంలో 'సంభాషణ', 'సందేశం' ఉంటాయి. సంవాదంకొస్తే మన పురాణాలలో ఇతిహాసాలలో ఎన్నో సందర్భాలు, సంఘటనలు మనకు మన నిజజీవితంలో ఆధ్యాత్మిక ఎదుగుదల కోసం ఎన్నో సందేశాలు, సందేహ నివృత్తి దొరుకుతాయి.







'యుధిష్ఠిర-భీష్మ' సంవాదంలో ఆ ఒక్క విష్ణుదేవుని స్తుతి, అర్చనలతో మానవులకు శుభం ప్రాప్తిస్తుందని; 'శివ-పార్వతుల' సంవాదంలో ఒక్క రామనామం సహస్రవిష్ణునామాలతో సమానమని; 'యక్షునికి- యుధిష్ఠిరునికి' జరిగిన సంవాదంలో సత్యం, ధర్మం అంతిమ విజయం సాధిస్తుందని; 'హయగ్రీవ-అగస్త్య' సంవాదంలో అమ్మవారి రూపంలో ఉన్న శక్తి స్వరూప, స్వభావాలు; 'కృష్ణార్జునుల' సంవాదంలో మనకు అతి విలువైన జీవితాన్ని గడిపే విధానాన్ని; 'పరీక్షిత్తు-శుకమహర్షి' సంవాదంలో అరిషడ్వర్గాలను జయించే వృత్తాంతాలు; 'అజామిళోపాఖ్యానం'లో నారాయణనామోచ్చారణ సత్ఫలితం; 'నచికేతుడు- యమ ధర్మరాజు' సంవాదంలో ఆత్మతత్త్వం గురించి; సుందరకాండ 'హనుమ-సీత' సంవాదంలో ధైర్యం, ధర్మం, ఆపదలో ఉన్నవారికి అనునయం; 'సీతానుసూయ' సంవాదంలో పాతివ్రత్యం, పతిశుశ్రూష; 'బభ్రువాహనుడు- ప్రేత' సంవాదంలో బ్రతికి ఉన్నప్పుడు చేసిన సుకృతులు దుష్కృతముల ఫలితం పర్యవసానం, చనిపోయిన తరువాత చేసే ఉత్తర క్రియలు వాటి ప్రభావం పర్యవసానం గురించి; 'ఆదిశంకరులు- మండనమిశ్రుడు' సంవాదంలో అద్వైతసిద్ధాంత విశ్లేషణ, పరస్పర అంగీకారం ఇత్యాదిసందేశాలు మనకు అందించారు. కావున ఈ సంవాదం ద్వారా మనకు లభించిన సందేశాలను నిజజీవితంలో ఆచరణలో పెట్టినట్లైతే జీవితం ధన్యమవుతుందనుటలో సందేహం లేదు.



కృష్ణం వందే జగద్గురుమ్.

# ఇహపరాలను తెలుసుకో!

- డా॥ కేశవరావు, 88979 39633

ఒక సాధువు నడిచి వెళుతూ అలసటగా ఉంటే ఒక చెట్టు కింద కూర్చున్నాడు. ఎదురుగా ఉన్న ఇంట్లోని గృహస్థుడు ఆయన్ని చూసి తమ ఇంట్లోకి వచ్చి కొంచెం సేపు విశ్రాంతి తీసుకోమని కోరాడు. సాధువుకి మంచి భోజనం పెట్టి, చీకటి పడింది కదా, ఈ పూటకి ఇక్కడే ఉండమని కోరాడు ఆ ఇంటి యజమాని. మాటల్లో తన కష్టసుఖాలు ముచ్చటిస్తూ, యజమాని– “ఏమిటోనండీ! సంసారంలో సుఖం లేదండీ. మీ జీవితమే హాయి!!” అన్నాడు. వెంటనే ఆ సాధువు “అయితే నా వెంట రా! నీకు మోక్షమార్గం చూపిస్తాను” అన్నాడు. యజమాని కంగారుపడుతూ. “అలా ఎలా కుదురుతుంది? పిల్లలు చిన్న వాళ్ళు. వాళ్లను పెంచి పెద్ద చేయాలి కదా!!” అన్నాడు.

సాధువు మాట్లాడలేదు. కొన్ని సంవత్సరాలు గడిచాయి. ఆ సాధువు మరల అదే మార్గంలో వస్తూ ఆ ఇంటిని చూసి ఆగాడు. ఆయన్ని చూసి యజమాని సాదరంగా ఆహ్వానించి, అతిథిమర్యాదలు చేశాడు. మాటలలో సాధువు అన్నాడు, “పిల్లలు పెద్దవాళ్లు అయ్యారు కదా, నా వెంట రా! నీకు మోక్ష మార్గం చూపిస్తాను.” యజమాని తడబడుతూ “ఇప్పుడే కాదు స్వామీ! పిల్లలు స్థిరపడాలి.. వాళ్ళ పెళ్ళిళ్ళు చేయాలి...” అన్నాడు.

ఇంకా కొన్ని సంవత్సరాలు గడిచాయి. సాధువు మళ్లీ అదే యజమాని ఆతిథ్యం, సాధువు అదే మాట, యజమాని జవాబు కొంచెం విసుగ్గా.. “పిల్లలకి డబ్బు విలువ తెలియదు.. అందుకని నేను దాచిన దంతా ఆ చెట్టు కింద పాతిపెట్టాను. వీలు చూసుకుని చెబుతాను. ఒక పెద్ద ఇల్లు కట్టాలి. మీలాగా నాకు ఎలా కుదురుతుంది” అన్నాడు.

ఇంకా కొన్ని సంవత్సరాలు గడిచాయి. సాధువు మళ్లీ అదే మార్గంలో వస్తూ ఆ ఇంటి వంక చూడకుండా వెళ్ళి పోతుండగా ఆ యజమాని కొడుకు గమనించి ఆహ్వానించాడు. అతను తమ తండ్రి మరణించాడని చెప్పాడు. సాధువుకి కొంచెం బాధనిపించింది. ఆతిథ్యం స్వీకరించి బయటికి వచ్చాడు. చెట్టు కింద ఒక కుక్క కూర్చుని ఉంది. యజమాని అనుమానంగా దాని వంక చూశాడు. సందేహం లేదు, యజమాని కుక్కగా పుట్టాడు. సాధువు మంత్ర జలం దాని మీద జల్లి, “ఏమిటి నీ పిచ్చి మోహం? కుక్కగా పుట్టి ఇంటికి కాపలా కాస్తున్నావా? నా వెంట రా.. నీకు మోక్ష మార్గం చూపిస్తాను” అన్నాడు. యజమాని “ఆ మాట మాత్రం వినలేను. ఎందుకంటే నేను డబ్బు ఇక్కడ దాచిన సంగతి పిల్లలకి చెప్పలేదు. ఎవరూ దోచుకోకుండా చూడాల్సిన బాధ్యత నాదే కదా” అన్నాడు.

మళ్ళీ కొన్నాళ్ళకి సాధువు ఆ దారిన వస్తూ ఆ ఇంటి వైపు చూశాడు. కుక్క కనపడలేదు. పక్కవారిని అడిగితే అది పోయిందని చెప్పారు. అయినా సాధువు అనుమానంగా చుట్టూ చూస్తుంటే చెట్టు కింద ఒక పాము కనిపించింది. పరీక్షగా చూశాడు. ఖచ్చితంగా ఆ యజమాని మళ్ళీ పాముగా పుట్టాడు. మంత్రజలం చల్లి, “ఇంకా ఈ ఇంటిని వదిలి వెళ్ళవా? నాతో రా” అన్నాడు. “ఆ ఒక్క మాట మాత్రం అనకండి. నా సొమ్ము పిల్లలకి కాకుండా ఇతరులకి దక్కనీయకుండా చూడాలి కదా” అన్నాడు దీనంగా.

సాధువు వెంటనే అతని ఇంట్లోకి వెళ్లి, అతని కొడుకులతో “మీ నాన్న ఆ చెట్టు కింద సొమ్ము దాచిపెట్టాడు. కానీ జాగ్రత్త! అక్కడ పాము ఉంది” అన్నాడు. అనగానే కొడుకులు ఎగిరి గంతేసి, కర్రలు తీసుకుని బయలుదేరారు. తన కొడుకులే తనను కర్రలతో చావ గొడుతుంటే అతను దీనంగా సాధువు వంక చూశాడు. కానీ అప్పటికే చాలా ఆలస్యమైంది.



**నీతి:** గృహస్థాశ్రమంలో బాధ్యతలు తప్పవు. కానీ, మోహబంధాలు ఎంత గట్టిగా మనం కట్టేసుకోవాలి అనే వివేకం చాలా అవసరం. **ఇహమే కాదు, పరం గురించి కూడా మనం తప్పనిసరిగా ఆలోచించాలి... !!!**

## విశ్వదాభిరామం    వేమన పద్యసూక్తి



# బుద్ధిహీనుడిని సేవించరాదు

ఎరుక లేనిదొరల నెన్నాళ్లు గొలిచిన
బ్రతుకు లేదు; వట్టిభ్రాంతి గాని;
గొడ్డుటావు పాలు గోకితే చేపునా?
విశ్వదాభిరామ! వినుర వేమ!

**అర్థాలు:** ఎరుక లేనిదొరలు= తెలివి లేనిపాలకులు; భ్రాంతి=భ్రమ(లేనిది ఉన్నట్లు తోచుట); గొడ్డు+ఆవు= సంతానమేలేని ఆవు; చేపుట= పాల నిచ్చుటకు సిద్ధమగుట.

**భావం:** తెలివిలేని దొరలను ఎన్నాళ్లు సేవించినా, బ్రతుకు గడవదు. వట్టి భ్రాంతి మాత్రమే మిగులుతుంది. గొడ్డుటావును నిలిపి ఎంత గోకినా పాలు చేపదు గదా.

**వివరణ:** ఆవు బలిష్ఠమైనదైనా గొడ్డుదైతే పాలివ్వదు. అలాగే తెలివిలేని దొర ఎంత ఉన్నవాడైనా సేవ చేయించుకొంటాడు గాని ఆసేవకు తగిన ప్రతి ఫలం ఇవ్వడు. తెలివిలేని అధికారి సేవకుడు చేసిన పనిలోని గొప్పతనం గ్రహించలేడు. సేవకుడు వివేకంతో అధికారికి అధికఫలం వచ్చే విధంగా ప్రవర్తించినా, దానిని సాధారణ కార్యంగా మాత్రమే స్వీకరిస్తాడు. చాలకాలంగా చేస్తుంటే ఎప్పటికైనా, ఏదో ఇస్తాడని భ్రాంతి పడడమే కాని, యథార్థంగా ఫలితం ఉండదు. అందుచేత అటువంటి అధికారివద్ద చేసిన పనిలో విశిష్టత గ్రహించి, తగిన విధంగా ఆదరించేవాడినే అందరూ ఆశ్రయిస్తారు. కాని తెలియని అధికారిని సేవించడానికి ఎవరూ ఇష్టపడరు.

– కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు

## భాస్కరశతకం

# ‘దుర్జనుల దగ్గరికి పోరాదు’

లోకములోన దుర్జనుల లోఁతు నెఱుంగక చేరరాదు సు
శ్లోకుఁడు చేరినం గవయఁ జూతురు చేయుదు రెక్కసక్కెముల్
కోకిలఁ గన్నచోట గుమిగూడి యసహ్యపుఁగూత లార్చుచుం
గాకులు తన్నవే తఱిమి కాయము తల్లడమంద భాస్కరా!



**తాత్పర్యం**

భాస్కరా! లోకంలో మంచి యశస్వి అయినవాడు దుర్మార్గుల అభిప్రాయాన్ని తెలుసుకోకుండా, వాళ్ల దగ్గరికి పోగూడదు. అలా దరికి చేరితే వాళ్ళు అతణ్ణి ఎదిరించాలని చూస్తారు. ఎగతాళి చేస్తారు. కాకులు కోకిలను చూచినచోట గుంపుగా గూడి అసహ్యంగా అరుస్తూ కోకిల వణికి పోయేలా తరిమి తన్నుతాయి కదా!

– వ్యాఖ్యాత: డా॥ తిరుమల శ్రీనివాసాచార్య

## సెప్టెంబరు నెల క్విజ్–38 సమాధానాలు

| | |
|---|---|
| 01) శైలపుత్రి | 11) ధ్వజస్తంభం |
| 02) ఆచార్య వెలువోలు నాగరాజ్యలక్ష్మి | 12) గరుడపురాణం |
| 03) అనంతపద్మం | 13) వ్యూహరూపం |
| 04) గయ | 14) ఆదిశేషుడు |
| 05) మహిష్మతి | 15) సర్వభూపాలవాహనం |
| 06) దుర్గాసురుడు | 16) మాండవి |
| 07) స్వాతి | 17) హరివంశం |
| 08) దేవీగీత | 18) నారాయణగిరి |
| 09) ధౌమ్యమహర్షి | 19) తిరుమల నంబి |
| 10) గరుత్మంతుడు | 20) 1933 |

**సరైన సమాధానాలు వ్రాసినవారు–**

1)మేడపాటి కీర్తిక, కుతుకులూరు 2)వై.సాయివాణి, బెంగుళూరు 3)భువన, కర్నూలు 4)తేతల గీతిక, కుతుకులూరు 5)చిప్పచిన్మయి, పోచారం 6)డి.ముక్తీశ్వర్, విజయవాడ 7)కె.సంహిత, కర్నూలు 8)ఎస్.జానకి, యానాం 9)కాండూరి శ్రీచరణ్, కోదాడ 10)భట్టిప్రోలు షణ్ముఖ విరాట్, బెంగుళూరు 11)యన్.గౌతమ్ మహేష్, కాకరపల్లి 12)సూరంపూడి సత్యసూర్య అభయ్‌రామ్, అలంపురం.

చిత్ర కథ

# సువర్ణ వర్షం

కథ– శ్రీ డి.శ్రీనివాసదీక్షితులు
చిత్రాలు– శ్రీ కె.ద్వారకనాథ్




దేశికుల నోటివెంట ఆశువుగా ‘శ్రీస్తుతి’ సాగుతోంది. తాయార్ కళ్ళల్లో మెరుపులు...
యోగారంభ త్వరిత మనసో.. అమ్మా! ఈ బ్రహ్మచారిని అనుగ్రహించు...
పాహి మాం దేవి!
‘శ్రీస్తుతి’ పూర్తి అయింది. 25 శ్లోకాలు... నింగి నుంచి... సువర్ణవర్షం... ధారలు ధారలుగా...
ఆచార్యా! అమ్మ కరుణించింది. మీ అనుగ్రహం అపారం.
అంతా అమ్మ దయ!
ఆచార్యా! పాదాభివందనం. బంగారు నాణాలు... సువర్ణకాంతులు బంగారం..
నాయనా! దురాశపడవద్దు. నీ దారిద్ర్యం పోయేంత బంగారు తీసుకో.. అదే నీ ప్రాప్తం...
అలాగే ఆచార్యా!
బ్రహ్మచారి తీసుకోగా మిగిలిన బంగారం మాయ మయింది.
నాయనా! గృహస్థాశ్రమాన్ని స్వీకరించు!
బ్రహ్మచారి భక్తితో దేశికులపాదాలకి నమస్కరించి...
వేదాంతదేశికం భజే!

# సంస్కృతం నేర్చుకుందాం..!!

పాఠం-37(ఇ)

రచన- కీ.శే. మహామహోపాధ్యాయ కాశీ కృష్ణాచార్య

అ) ఈ క్రిందివాటిని తెలుగులోకి అనువాదం చేయండి.

01) मण्टपस्य अधः एकः कुशमञ्चः अस्ति।
02) तन्मञ्चे बिडालः खनकेन साकं कलहं करोति।
03) मत्कुणाः मशकाश्च रात्रिन्दिवं युष्मद्गृहे सञ्चरन्ति।
04) अम्बरीषं, ऋजीवं, लवित्रं, खनित्रंच एतानि सर्वाणि आवरणे कुसूलसमीपे एकत्रैव सन्ति।
05) वने, झिल्लिकाः अतीव नादं कुर्वन्ति।
06) ब्राह्मणगृहेषु पिष्टं, तक्रं, नवनीतं, तैलम् एतानि द्रव्याणि सर्वदा स्युः।
07) किञ्च गोमयमपि स्यात्।
08) ब्राह्मणबालकाः उपनयनात्पूर्वं कंसेषु भोजनं कुर्युः।
09) गतवर्षे युष्मद्गृहे एकामस्त्रा अवश्यं खलु। सा इदानीं कुत्रास्ति?
10) गोधाः पिपीलिकाः भक्षयन्ति।
11) जलूका मम कनिष्ठिकां अदशत्।
12) मक्षिकाः दूषिकायां प्रतन्ति।

అ) జవాబులు

01) పందిరిక్రింద ఒక నులక మంచము ఉన్నది.
02) ఆ మంచములో పిల్లి పందికొక్కుతో కొట్లాటపెట్టుకొనుచున్నది.
03) నల్లులు, దోమలు రాత్రింబవళ్ళు మీ ఇంటిలో తిరుగుచున్నవి.
04) మంగళము, బాణలి, కొడవలి, గడ్డపార ఇవయన్నియు దొడ్డిలో గాద దగ్గరనే ఉన్నవి.
05) అడవిలో కీచురాళ్ళు మిక్కిలి శబ్దం చేయుచున్నవి.
06) బ్రాహ్మణుని ఇండ్లలో పిండి, మజ్జిగ, వెన్న, నూనె ఈ ద్రవ్యము లెప్పుడు ఉండును.
07) అంతేకాకుండా ఆవు పేడకూడ ఉండును.
08) బ్రాహ్మణబాలకులు ఉపనయనమునకు ముందు కంచములలో అన్నము తినుదురు.
09) మీ ఇంటిలో నిరుడు (గత సంవత్సరం) ఒక తిత్తి, తప్పనిసరి కదా! అది ఇప్పుడెచ్చట ఉన్నది.
10) బల్లులు చీమలను తినుచున్నవి.
11) జలగ నా చిటికెన వ్రేలును కొరికినది.
12) ఈగలు పుసియందు పడుచున్నవి.

ఆ) ఈ క్రిందివాటిని సంస్కృతంలోకి అనువాదం చేయండి.

01) మాయింటి చుట్టూ
02) ఉడుతలు ఎక్కువగా ఉన్నవి.
03) నిరుడు గరుడవాహనమందు గజ్జెలు ఉండెను.
04) సరే మంచిది, కాని అక్కడ అడ్డముగా ఆబోతు పరిగెత్తుచున్నది.
05) నీవు సరిగా రమ్ము.
06) నాకు ప్రక్కగా లేగ దూడ ఉన్నది.
07) మేకపోతు కుందేటితో కూడ ఆడుచున్నది.
08) నేటికిని వాడు వంకరగా నడుచుచున్నాడు.
09) నీవు బొత్తిగా నాపనిని చేయవేమిరా?
10) అయ్యోపాపం కంబళి మీద ఎలుకను పిల్లి చంపుచున్నది కదా.
11) దోమలు ఆబోతును కరచుచున్నవి.
12) నీవు నాతో కూడ రావద్దు.
13) నల్లి కళ్ళపాము వెన్న మీద పడ్డది.
14) ఆ తిత్తిని ఇటు తెమ్ము.

ఆ) జవాబులు

01) अस्मद्गृहं परितः।
02) चिक्रोडाः अधिकतया सन्ति।
03) गतवर्षे गरुडवाहने सिञ्जाः आसन्।
04) आं भवतु समीचीनम्। परन्तु तत्र तिर्यक् ढङ्कः धावति।
05) त्वं सम्यक् अप्रमादम् आगच्छ।
06) मम पार्श्वतः वत्सा वर्तते।
07) अजा शशकेनापि खेलति।
08) अद्यापि सः वक्रं गच्छति।
09) त्वं मम कर्म किञ्चिदपि न करोषि किम्?
10) अहो! कम्बले बिडालः मूषिकं हन्ति।
11) मशकाः ढङ्कं दशन्ति।
12) त्वं मया सह मा आगच्छ।
13) रक्तपुच्छ सर्वः नवनीते पतितः।
14) तां भस्त्रिकाम् अत्र आनय।

# క్విజ్ 40

01) అలమేలుమంగమ్మ పుట్టినరోజు? జ)..........

02) పద్మసరోవరంలో వేంకటేశ్వరుడు లక్ష్మికోసం ఎన్నేండ్లు తపస్సు చేశాడు? జ)..........

03) ఆవు రూపం దాల్చిందెవరు? జ)..........

04) లక్ష్మి మనస్సు ఎటువంటిది? జ)..........

05) పుష్పవేణి భర్త ఎవరు? జ)..........

06) వైవస్వతమనువు కుమారుడెవరు? జ)..........

07) శ్రీహరి నందక ఖడ్గాంశమున అవతరించిందెవరు? జ)..........

08) కార్తికశుద్ధతదియను ఏమంటారు? జ)..........

09) పరమశివుడు పార్వతీదేవికి బోధించింది? జ)..........

10) వేదసారుని కుమార్తె పేరు? జ)..........

11) కశ్యపప్రజాపతి వంశంలో పుట్టిందెవరు? జ)..........

12) వేదాల్లోని మంత్రభాగాలను ఏమంటారు? జ)..........

13) కర్మకాండ వివరణ భాగాలను ఏమని పిలుస్తారు? జ)..........

14) దేని ద్వారా జ్ఞానాన్ని పూరించాలి? జ)..........

15) అన్నింటి కన్నా అతీతమేది? జ)..........

## నియమ నిబంధనలు

01) పదిహేనేళ్లలోపు బాలబాలికలు మాత్రమే ఈ 'క్విజ్'లో పాల్గొనాలి.

02) ఇందులో పాల్గొనే పిల్లలు తప్పనిసరిగా హిందువులై ఉండాలి.

03) నిర్దేశించిన స్థలంలోనే జవాబులు వ్రాసి పంపాలి. క్విజ్ సమాధానపత్రం జిరాక్సు ప్రతులు పంపేటట్లు అయితే, చందా నమోదు సంఖ్య తప్పనిసరి.

04) సమాధానాల్లో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండకూడదు.

05) జవాబులు చేరాల్సిన చివరితేది **25-11-2025.**

06) ఈ క్విజ్‌లో అన్ని సమాధానాలు సరిగ్గా వ్రాసిన బాలబాలికల పేర్లను వచ్చే తదుపరినెల సప్తగిరి మాసపత్రికలో ప్రచురిస్తాం.

07) తి.తి.దే. ప్రధాన సంపాదకులవారి కార్యాలయంలో పనిచేసే ఉద్యోగుల పిల్లలు ఈ క్విజ్ పోటీలో పాల్గొనకూడదు.

08) క్విజ్‌కి సంబంధించి ఏ సమాచారమూ ఫోన్‌ద్వారా ఇవ్వబడదు.

09) ఈ క్విజ్‌లో పాల్గొనే పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా సప్తగిరి మాసపత్రిక చందాదారులై ఉండాలి. క్విజ్ సమాధాన పత్రంలో ఈ క్రిందివివరాలు స్పష్టంగా వ్రాసి పంపాలి.

10) జవాబులను బాల్ పెన్నుతో మాత్రమే వ్రాసి పంపాలి. పెన్సిల్, స్కెచ్, జెల్ పెన్నులతో వ్రాయకూడదు.

11) ఈ ప్రశ్నలకు జవాబులు ఈ సంచికలోని వ్యాసాల్లోనే ఉన్నాయి. వెతికి వ్రాయండి.

చందాసంఖ్య: .......... వయస్సు: ..........

పాఠశాల: .......... తరగతి: ..........

పేరు: ..........

చిరునామా: ..........

..........

..........

.......... పిన్‌కోడ్: ..........

ఫోన్ సంఖ్య: ..........

### జవాబులు చేరాల్సిన చిరునామా

ప్రధాన సంపాదకులు, 'సప్తగిరి' మాసపత్రిక, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ బిల్డింగ్, కె.టి.రోడ్డు, తిరుపతి-517 507, తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

# బాలవినోదం

## క్రింది ఆధారాలను బట్టి గడులు నింపి, రంగు గడుల అక్షరాలు నింపితే ఒక సామెతవస్తుంది.

| | | | |
|---|---|---|---|
| దయ | - | | |
| ముని | - | | |
| చర్మం | - | | |
| మహిళ | - | | |
| ఎక్కువ | - | | |
| చండిక | - | | |
| చూలాలు | - | | |
| ముక్తి | - | | |

జవాబులు: కృప, ఋషి, తోలు, నారి, జాస్తి, దుర్గ, గర్భిణి, మోక్షం
సామెత: కృపతో నాస్తి దుర్భిక్షం

## 'బొమ్మల' ఆధారాలతో తెలుగుపదాలు వ్రాయండి

01)  - ☐ ☐కం

02)  - ☐ ☐కం

03)  - ☐ ☐కం

04)  - ☐ ☐కం

05)  - ☐ ☐కం

జవాబులు: 1)కంటకం 2)మూషికం
3)వల్మీకం 4)కనకం 5)జంబూ

## ఇచ్చిన పదాలు అటునుంచి చదివినా, ఇటునుంచి చదివినా ఒకే అర్థం వస్తుంది

1) వి☐☐☐వి
2) నం☐☐☐నం
3) రం☐☐☐రం
4) పా☐☐☐పా
5) పం☐☐☐పం
6) గ☐☐☐ ☐☐గ

జవాబులు: వికటకవి, నందనందనం, రంగనగరం,
పాలుతెలుపా, పంచాస్త్రచాపం, గడపలో పడగ

## ఆధారాలను బట్టి గడులను నింపండి పిల్లలు- అన్నీ పా....ములే!

1) జలము - పా☐☐ము
2) పవిత్రము - పా☐☐ము
3) నైపుణ్యము - పా☐☐ము
4) ఒక పక్షి - పా☐☐ము
5) పరమాన్నము - పా☐☐ము
6) క్రిందిలోకము - పా☐☐ము
7) మహాపాపము - పా☐☐ము
8) బోధించుట - పా☐☐ము

జవాబులు: 1)పానీయము 2)పావనము 3)పాటవము
4)పావురము 5)పాయసము 6)పాతాళము
7)పాతకము 8)పాఠనము

## 'ద్వంద్వ'పదములు పూరించండి

1) ☐☐నారాయణులు
2) ఉమా☐☐☐☐☐
3) ☐☐పుణ్యాలు
4) సీతా☐☐☐
5) ☐☐సక్తులు
6) సూర్య☐☐☐
7) ☐☐☐బెళుకులు
8) ☐☐సంపదలు

జవాబులు: 1)లక్ష్మీ 2)మహేశ్వరులు 3)పాప
4)రాములు 5)శక్తి 6)చంద్రులు 7)తళుకు 8)సిరి

# రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి



**మేషం–** అష్టమకుజ సంచారదోషాన్ని అధిగమించుటకు శ్రీసుబ్రహ్మణ్య ఆరాధన చేయాలి. కందులు దానం చేయుటవలన సమస్యలన్నిటినీ అధిగమించి పనుల్లో కృతకృత్యులవుతారు. సమాజంలో అందర్నీ ఆకట్టుకుంటారు.



**వృషభం–** దూర ప్రయాణాలు ఫలిస్తాయి. సౌకర్యవంతమైన గృహయోగం కలుగుతుంది. ఉద్యోగాలలో పై అధికారుల మన్నన, వారితో మంచి సంబంధాలను పొందుతారు. శారీరక దృఢత్వం కోసం ఆరోగ్యకరమైన నియమాలను అనుసరిస్తారు.



**మిథునం–** గురు సంచారం ప్రభావంతో, మీరు ఆస్తిని కొనుగోలు చేయడంలో కృతకృత్యులవుతారు. వ్యాపారాలకు సంబంధించిన కఠిన నిర్ణయాలు తీసుకుని ఆర్థికంగా లాభపడతారు.



**కర్కాటకం–** మానసిక సంతృప్తితోబాటు సమాజంలో గౌరవాన్ని పొందుతారు. ప్రణాళిక సిద్ధం చేసుకుని రంగంలోనికి దిగుతారు. విజయం సాధిస్తారు మరియు విదేశీప్రయాణం చేయగలుగుతారు. ఆరోగ్యంపై దృష్టి పెడతారు.



**సింహం–** తలపెట్టిన పనులు సకాలంలో పూర్తి అగుట, ధైర్యంతో వ్యవహార జయము, ఉద్యోగ విషయాలలో ముందంజ, అన్ని వృత్తులవారికి జీవనవృద్ధి, వ్యక్తిగత లాభం, స్థాయి పెరగడం, పుష్కలమైన ఆరోగ్యం ఉంటుంది.



**కన్య–** జ్ఞాన సముపార్జనకోసం పరితపిస్తారు. ఇతరులను జ్ఞానవంతులను చేయడం లక్ష్యంగా పనిచేస్తారు, వారికి నిరంతరం సహకారమందిస్తూ వారిపై ప్రభావం చూపుతారు, లక్ష్యాలను సాధిస్తారు, ఆర్థికవృద్ధి కలుగుతుంది.



**తుల–** కొత్త విషయాలను నేర్చుకోవాలనే తపన ఉంటుంది. ఆశావహంగా ఉంటారు. సన్నిహితులు, మిత్రులతో కలసి కార్యసాధన చేస్తారు. ఆనందమయమైన సమయాన్ని చూస్తారు. విద్యార్థులకు విజయం చేకూరుతుంది.



**వృశ్చికం–** శక్తిమంతమైన మరియు చురుకైన వ్యక్తిత్వాన్ని కలిగి స్వతంత్ర నిర్ణయాలు తీసుకుని పురోగమిస్తారు. ఇతరులను నియంత్రించే ధోరణితో దూకుడుగా వ్యవహరిస్తారు.



**ధనుస్సు–** ఆర్థికపరమైన సమస్యలకు పరిష్కారం కనుగొనే సమయం ఇది. ఋణముల నుండి అభద్రతా భావాన్ని తొలగించుకుంటారు. కళాత్మక రంగం లేదా సినీరంగంలో ప్రతిభ చూపి అధిక ఆదాయం పొందుతారు.



**మకరం–** శుభప్రదమైన సమయం. ఇంట్లో శుభకార్యాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. విలాసవంతమైన జీవితాన్ని గడుపుతారు మరియు సమాజంలో గౌరవం మరియు మర్యాద పెరుగుతాయి. సంతోషంగా ఉంటారు.



**కుంభం–** సాంఘికంగానూ కుటుంబపరంగానూ ఆనందంగా ఉండటం, నూతనవస్తు, వస్త్రప్రాప్తి, ధనాగమము, ఆలయములను సందర్శించడం గౌరవమర్యాదలు పెరుగుతాయి.



**మీనం–** చలివాతావరణం, గొంతు నొప్పివంటి కంఠవ్యాధుల బారినపడకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. ముందు జాగ్రత్త వలన పొంచి ఉన్న ప్రమాదాన్ని నివారించకోవచ్చు.

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**



# సప్తగిరి

(ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక)

## చందా నమోదు పత్రం

**1.** పేరు మరియు చిరునామా :

(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

(పిన్‌కోడ్ తప్పనిసరి)

సెల్ నెం.

**2.** కావలసినభాష :

తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐

హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం ☐

**3.** సంవత్సరచందా : ☐ రూ.240/-

జీవితచందా ☐ రూ.2400/- (12 సం॥రాలు)

**4.** విదేశాలకు సంవత్సరచందా : ☐ రూ.1030/-

**5.** చందా పునరుద్ధరణ :

(అ) చందానెంబరు :

(ఆ) భాష :

**6.** చెల్లించిన మొత్తం :

డి.డి.నెం. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్ మాత్రమే :

........................................................................ తేది :...................

ప్రదేశం :

తేది :

చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.240/-, జీవితచందా(12 సం॥రాలు) రూ.2400/-లు, విదేశాలకు సంవత్సర చందా రూ.1030/-; డి.డి. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓలను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి' మ్యాగజైన్, తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.

2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులోగానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప- మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.

3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.

4) మా చిరునామా "ప్రధాన సంపాదకులు, సప్తగిరి కార్యాలయం, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ బిల్డింగ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".

5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

# శ్రీపదకేళి

118



**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు, 90003 24024

**అడ్డం** 1)కార్తిక శుద్ధ ఏకాదశి(4); 5)గాంధారీధృతరాష్ట్రుల పుత్రిక(3); 7)ఈ యుగంలో కృష్ణావతారంగా విష్ణుమూర్తి అవతరించాడు(6); 8)నోము(3); 10)యాదవకులంలో వినాశనానికి పుట్టిన ఆయుధము(4); 14)దక్షుడను రాజు యొక్క కుమారుడు(4); 15)సప్తగిరులలో ఒక అద్రి పేరు(4); 18)కార్తిక కృష్ణ ఏకాదశి(3); 19)నవంబరు, 14న గల ప్రత్యేకత(7)

**నిలువు** 1)లీలావతి హిరణ్యకశిపుల కుమారుడు(4); 2)క్షీరాబ్ధి ద్వాదశికి గల మరియొక పేరు(6); 3)కార్తిక పూర్ణిమ నాడు సాయంత్రం దేవాలయాలలో చేసే కార్యక్రమం(6); 4)ఒక ద్వీపము(4); 6)మందపాలుని భార్య(3); 9)తిరుచానూరులో పద్మావతీ తాయారు బ్రహ్మోత్సవాలలో జరిగే ముఖ్యమైన తీర్థం(5); 11)ప్రాచీన బర్హిభార్య. ప్రచేతసుల తల్లి(3); 12)వత్సప్రీతి కుమారుడు(3); 13)ఆకలి దప్పికలతో ఒక పదము(3); 16)వెన్నెల(3); 17)ఈ నక్షత్రం పౌర్ణమి రోజున ఉంది కనుక కార్తికమాసం అన్నారు.(3)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.

- ప్రధాన సంపాదకుడు



Printed by Sri R.V.Vijaya Kumar, B.A., B.Ed., and Published by Dr.V.G.Chokkalingam, M.A., Ph.D. on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D.



2025, సెప్టెంబర్ 25న తిరుమలలో భక్తులకు
నూతన వసతి సముదాయం వేంకటాద్రి నిలయం (పి.ఎ.సి)ను
భారత ఉపరాష్ట్రపతి గౌ॥ శ్రీ సి.పి.రాధాకృష్ణన్ గారితో
కలిసి ప్రారంభిస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు
మాన్యశ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు



2025, సెప్టెంబర్ 25న తిరుమల
వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని ఐసిసి సెంటర్‌ను
ప్రారంభిస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు
మాన్యశ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు



2025, సెప్టెంబర్ 24న తిరుమల శ్రీవారికి రూ.3.86 కోట్లు విలువైన
స్వర్ణయజ్ఞోపవీతాన్ని తిరుమల తిరుపతి దేవస్థానముల ధర్మకర్తలమండలి అధ్యక్షులు
శ్రీ బి.ఆర్.నాయుడుగారు బోర్డు సభ్యులు శ్రీమతి పనబాక లక్ష్మి, శ్రీ భానుప్రకాష్ రెడ్డి,
శ్రీ నరేష్‌కుమార్, శ్రీ శాంతారామ్‌ల సమక్షంలో దాతలు శ్రీ పువ్వాడ మస్తాన్‌రావు,
శ్రీమతి కుంకుమ రేఖ దంపతుల నుండి స్వీకరిస్తున్న దృశ్యం.



2025, సెప్టెంబర్ 18న మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ
అన్నప్రసాద కేంద్రంలో తి.తి.దేవస్థానముల కార్యనిర్వహణాధికారి
శ్రీ అనిల్ కుమార్ సింఘాల్, ఐ.ఏ.ఎస్.,
తనిఖీలు నిర్వహించి, భక్తులతో మాట్లాడుతున్న దృశ్యం.



2025, సెప్టెంబర్ 13న తి.తి.దే. ధర్మకర్తలమండలి ఎక్స్ అఫీషియో సభ్యుడిగా
ప్రమాణం చేసిన దేవాదాయశాఖ కార్యదర్శి డా॥ ఎం.హరి జవహర్‌లాల్, ఐ.ఏ.ఎస్.,కు
తి.తి.దే. అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ సి.హెచ్. వెంకయ్యచౌదరి, ఐ.ఆర్.ఎస్.,
శ్రీవారి చిత్రపటాన్ని అందజేస్తున్న చిత్రం.



2025, సెప్టెంబర్ 13న తి.తి.దే. ధర్మకర్తలమండలి సభ్యుడిగా
ప్రమాణం చేసిన శ్రీ సుదర్శన్ వేణుకు తి.తి.దే. అదనపు
కార్యనిర్వహణాధికారి శ్రీ సి.హెచ్.వెంకయ్యచౌదరి, ఐ.ఆర్.ఎస్.,
శ్రీవారి చిత్రపటాన్ని అందజేస్తున్న దృశ్యం.



SAPTHAGIRI (TELUGU) SPIRITUAL ILLUSTRATED MONTHLY
Published by Tirumala Tirupati Devasthanams Printing on 25-10-2025 and Posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under RNI No.21139/1970. Postal Regd. No.TRP/155/2024-2026 "LICENCED TO POST WITHOUT PREPAYMENT No.PMGK/RNP/WPP-04(1)/2024-2026" Posting on 1st of Every Month.

తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారి పుష్పయాగం
(26-11-2025)